: fb.com/vaartha Digital
WWW.VAARTHA.COM
epaper.vaartha.com
రాజమహేంద్రవరం
Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
16-7-2025
బుధవారం సంపుటి: 31
సంచిక: 165
పేజీలు: 12 వెల: 6.50



# అంతరిక్షం నుంచి క్షేమంగా అవనిపైకి..

- కాలిఫోర్నియా తీరంలో ల్యాండ్ అయిన శుక్లా బృందం క్యాప్సూల్
- దాదాపు 18 రోజులు ఐఎస్ఎస్‌లో పరిశోధనల్లో పాల్గొన్న శుభాంశు, మరో ముగ్గురు వ్యోమగాములు
- అంతర్జాతీయ స్పేస్ సెంటర్‌లోకి ప్రవేశించిన తొలి భారతీయుడిగా శుక్లా రికార్డ్
- ఏడు రోజుల క్వారంటైన్‌కు ఆ నలుగురు
- గగన్‌యాన్‌కు దారివేసిన శుక్లా: ప్రధాని మోడీ అభినందనలు
- కుమారుడు క్షేమంగా తిరిగిరావడంతో తల్లిదండ్రుల ఆనందబాష్పాలు

**న్యూయార్క్, జూలై 15:** అంతరిక్ష యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకుని భారత్ కీర్తి పతాకాన్ని సమున్నతంగా ఎగరేసిన మన ముద్దుబిడ్డ శుభాంశు శుక్లా పుడమికి తిరిగొచ్చాడు. శుక్లాతో పాటు మరో ముగ్గురు వ్యోమగాములతో ఐఎస్ఎస్ నుంచి బయల్దేరిన క్రూ డ్రాగన్ సి213 గ్రేస్ క్యాప్సుల్ మంగళ వారం మధ్యాహ్నం 3.01 గంటలకు కాలిఫోర్నియా తీరంలో సురక్షితంగా ల్యాండ్ అయింది. జూన్ 26, 2025న భారత్ వైమానిక దళ టెస్ట్ పైలట్ గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా

>>2

# సత్వరమే నిధులు మంజూరు



మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిసిన సిఎం చంద్రబాబు. చిత్రంలో కేంద్రమంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని, ఎంపిలు

## రాష్ట్రానికి సాయం పెంచి ఆదుకోవాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కోరిన సిఎం చంద్రబాబు

## వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ

## పోలవరం, బనకచర్ల వివరాలు తెలిపిన ముఖ్యమంత్రి

**విజయవాడ,జూలై15,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్రహోం మంత్రి అమిత్ షాతో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భేటీ అయ్యారు. రాష్ట్ర ప్రాజెక్టులు, నిధులపై ఇరువురు నేతలు చర్చించారు. ముందుగా మాజీ కేంద్రమంత్రి టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతి రాజును గవర్నర్‌గా నియమించడంపై హోంమంత్రికి, కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం ధన్యవాదాలు తెలియచేశారు. అనంతరం రాష్ట్రానికి చెందిన పలు అంశాలపై అమిత్ షాతో ముఖ్యమంత్రి చర్చలు జరిపారు. రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టులకు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆర్థిక సాయం అందించే అంశాలపై సీఎం హోం మంత్రికి వివరించారు. గత ఏడాదిగా క్లిష్టమైన పరిస్థితుల్లో రాష్ట్రానికి అండగా నిలిచినందుకు ధన్యవాదాలు తెలియచేసిన ముఖ్యమంత్రి కేంద్రసహకారంతో ధ్వంసమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నామని తెలియచేశారు. అయితే ఇప్పటికీ ఆర్థిక వనరుల పరంగా తీవ్రమైన కొరతను ఎదుర్కొంటున్న ఏపీకి కేంద్రం నుంచి మరింతగా సహకారం అందించే అంశాన్ని సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. విభజన వల్ల ఏపీ ఎదుర్కొన్న ఆర్థిక నష్టాన్ని పరిగణనలోకి తీసుకుని నిధుల కేటాయింపులు చేసేలా చూ డాలని 16వ ఆర్థిక సంఘానికి నివేదించామని

>>2

## హంద్రీ నీవా ఫేజ్-1

# కాలువల విస్తరణ పూర్తి

## 3,850 క్యూసెక్కులకు పెరిగిన సామర్థ్యం

## వంద రోజుల్లో లక్ష్యాన్ని పూర్తి చేసిన సర్కార్

## తీరనున్న సీమ తాగు, సాగునీటి కష్టాలు



**గుంటూరు,జులై 15,ప్రభాతవార్త ప్రతినిధి:** కూటమి ప్రభుత్వం చొరవ, వేగవంతమైన నిర్ణయాలు రాయ లసీమకు జలసిరులు తెచ్చాయి. హంద్రీనీవా ఫేజ్1 కాలువల విస్త రణ పనులు పూర్తి కావటంతో సీమ జిల్లాలు సస్యశ్యామలం కానున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 17వ తేదీన నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం మల్యాల పంపింగ్ స్టేషన్ వద్ద విస్తరణ పూర్తైన హంద్రీనీవా కాలువకు నీటిని విడుదల చేయనున్నారు. ముందు ప్రకటించినట్టుగానే వంద రోజుల్లో ఈ కాలువ విస్త రణ పనుల లక్ష్యాన్ని కూటమి ప్రభుత్వం పూర్తి చేసింది. రూ.696 కోట్లతో చేపట్టిన ఈ విస్తరణ పనులతో హంద్రీనీవా ఫేజ్ 1 కాలువ ప్రవాహ సామర్థం 3850 క్యూసెక్కులకు పెరిగింది. రాయల సీమకు తాగు, సాగునీరివ్వాలన్న సంకల్పంతో రోజువారీ టార్గెట్లు పెట్టి మరీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఫేజ్ 1, ఫేజ్ 2 కాలువ పనుల్ని పరుగులు పెట్టించారు. ప్రస్తుతం ఫేజ్ 1 కాలువ విస్తరణ పనులతో అదనంగా 1600 క్యూసెక్కుల మేర నీటిని తరలించేందుకు అవకాశం కలిగింది. దీంతో జీడిపల్లి రిజర్వాయర్‌ను పూర్తి సామర్థంతో నీటిని నింపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. తద్వారా కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో ఆయకట్టుకు సాగునీరు, 33 లక్షల మంది ప్రజలకు దాహార్తిని తీర్చేలా కూటమి ప్రభుత్వం ఈ ప్రాజెక్టును శరవేగంగా పూర్తి చేసింది. మల్యాల నుంచి జీడిపల్లి వరకూ 216 కిలోమీటర్ల మేర హంద్రీనీవా కాలువ విస్తరణ పనులు పూర్తి కావటంతో జీడిపల్లి, కృష్ణగిరి, పత్తికొండ, గాజులదిన్నె సహా స్థానికంగా రాయలసీమ జిల్లాల్లోని చెరువులను కూడా నీటితో నింపనున్నారు. దీంతో సీమ జిల్లాల్లో భూగర్భజలాలు

>>2



## హైకోర్టు జడ్జిగా

# బి.దేవానంద్

## మద్రాసు హైకోర్టు నుండి బదలీకి రాష్ట్రపతి ఆమోదం

**విజయవాడ.జూలై15,ప్రభాతవార్తప్రతినిధి:** జస్టిస్ బట్టు దేవానంద్ ఏపీ హైకోర్టుకు బదిలీ అయ్యారు. ఆయన మద్రాస్ హైకోర్టు నుంచి మళ్ళీ ఏపీ హైకోర్టుకు వచ్చేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్మ ఆమోద ముద్ర వేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర న్యాయశాఖ సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ దేవానంద ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా త్వరలో ప్రమాణం చేయించనున్నారు. ఏపీ హైకోర్టులో మొత్తం 37 మంది న్యాయమూర్తుల నియామకానికి ఆమోదమున్న విషయం తెలిసిందే. జస్టిస్ బట్టు దేవానంద్ రాకతో ఏపీహైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 29కి చేరుతుంది. ఏపీహైకోర్టులో ఆయన4వ స్థానంలో

>>2

## ఐటి, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లలో

# 10లక్షల ఉద్యోగాలు

## ఆ దిశలో కంపెనీల ఏర్పాటుకు చర్యలు

## మరింత సులభంగా 'మనమిత్ర' సేవలు

## రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో 95 సంస్థలు

## సమీక్షలో మంత్రి లోకేష్

**విజయవాడ,జూలై15,ప్రభాతవార్తప్రతినిధి:** రాబోయే నాలుగేళ్లలో ఐటి, ఎలక్ట్రానిక్స్, డాటా సెంటర్లు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్ (జిసిసి) ద్వారా 10లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా అధికార యంత్రాంగం పనిచేయాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ కోరారు. ఐటి, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజిఎస్ శాఖల ఉన్నతాధికారులతో ఉండవల్లి నివాసంలో మంత్రి లోకేష్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఐటి, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జిసిసి), డాటాసెంటర్ల ఏర్పాటుకు ఇప్పటివరకు 95 ప్రముఖ సంస్థలు లక్షకోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయని, ఆ సంస్థలు త్వరితగతిన తమ యూనిట్లను ఏర్పాటు చేయడానికి అవసరమైన అనుమతులు, ఇతర సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ప్రతిష్టాత్మక సంస్థలైన టిసిఎస్, కాగ్నిజెంట్ సంస్థలకు విశాఖలో ఇప్పటికే భూకేటాయింపులు పూర్తిచేశామని అధికారులు తెలిపారు. ఆ సంస్థలు సాధ్యమైనంత త్వరగా కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఇటీవల తమ బెంగళూరు పర్యటనలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జిసిసి)ల ఏర్పాటుకు ఎఎన్‌ఎస్ఆర్, సత్వ సంస్థలు ఎంఓయులు కుదుర్చుకున్నాయని, ఈ రెండింటి ద్వారానే యువతకు 35వేల ఉద్యోగాలు రానున్నాయని చెప్పారు. ఎంఓయులు చేసుకున్న సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ యూనిట్లు ఏర్పాటు చేసేలా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని తెలిపారు. రాష్ట్రానికి వచ్చే చిన్న సంస్థల కోసం 26 జిల్లా కేంద్రాల్లో కో వర్కింగ్ స్పేస్ సిద్ధం చేయాలని సూచించారు.

**త్వరలోనే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్:** రాష్ట్రంలో నవీన ఆవిష్కరణలు, స్టార్టప్‌ల ప్రోత్సాహానికి తలపెట్టిన రతన్ టాటా ఇన్నోవే

>>2



మంగళవారం ఐటి, ఎలక్ట్రానిక్స్, జిసిసి, డేటా సెంటర్లపై సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి నారా లోకేష్

# ఎబివిపై చర్యలు నిలిపివేత

**విజయవాడ,జూలై15.ప్రభాతవార్తప్రతినిధి:** పదవీ విరమణచేసిన మాజీ అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఇంటెలిజెన్సీ) ఎబి వెంకటేశ్వరరావుపై నమోదైన క్రిమినల్ ప్రొసీడింగ్స్‌పై చర్యలను

>>2

# ఎంపి మిథున్ రెడ్డికి హైకోర్టులో చుక్కెదురు

## మద్యం ముడుపుల కేసు



**విజయవాడ.జూలై15,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్సీపీ ఎంపీ మిథున్ రెడ్డికి హైకోర్టులో చుక్కెదురైంది. మద్యం ముడుపుల కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని మిథున్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ ని కొట్టేస్తూ ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ దశలో ముందస్తు బెయిల్ ఇవ్వలేమని న్యాయస్థానం స్పష్టం చేసింది. మద్యం ముడుపుల కేసులో ఎంపీ మిథున్ రెడ్డి ఏ4 నిందితుడిగా ఉన్నారు. మద్యం ఆర్డర్లు, సరఫరా వ్యవస్థ గతంలో ఆన్‌లైన్ పద్ధతి ద్వారా పారదర్శకంగా ఉండేదని, దీనిని మాన్యువల్ విధానంలోకి తీసుకురావడంతో ఎంపీ మిథున్‌రెడ్డి (ఏ4) కీలక పాత్ర పోషించారని సీఐడీ/సిట్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా హైకోర్టులో వాదనలు వినిపించారు. ముడుపులు అందిన కంపెనీలకే మద్యం సరఫరా అనుమతులిచ్చారని లూథ్రా తెలిపారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం వల్ల రాష్ట్ర ఖజానాకు రూ.3,500 కోట్ల నష్టం జరిగిందని అన్నారు. ఆ సొమ్మును మళ్లించడంలో మిథున్‌రెడ్డి ప్రధాన పాత్ర పోషించారని మద్యం కుంభకోణానికి వ్యూహారచన వేసిన నాటి నుంచి దానిని అమలు చేసే వరకు మిథున్‌రెడ్డి కీలక వ్యూహకర్తగా వ్యవహరించారంటూ సాక్షుల వాంగ్మూలం ఇచ్చినట్లు వాదనలు వినిపించారు. ఇంకా దానికి సంబంధించిన ఆధారాలు లభించాయని వివరిం చారు. మిథున్ రెడ్డిని అదుపులోకి తీసుకుని విచారిస్తే

>>2



మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం అధికారులను కలిసిన టిడిపి బృందం

## వలసదారులు, వృద్ధుల

# చేర్పు కోసం ప్రత్యేక చర్యలు

## కేంద్ర ఎన్నికల కమిషన్‌కు టిడిపి వినతి

## ప్రత్యేక యాప్ ద్వారా ఓటరు సవరణ చేయాలి

**విజయవాడ.జూలై15,ప్రభాతవార్తప్రతినిధి:**భారత ఎన్నికల సంఘం తీసుకువస్తున్న సంస్కరణలపై పలు కీలకమైన సూచనలని తెలుగుదేశం పార్టీ చేసింది. ఈసీతో ఇవాళ(మంగళవారం, జులై 15) ఆరుగురు సభ్యుల టీడీపీ బృందం ఢిల్లీలో భేటీ అయింది. టీడీఎల్పీ నేత లావు శ్రీకృష్ణ దేవరాయలు నేతృత్వంలో సీఈసీ జ్ఞానేశ్వరకుమార్, ఈసీలు డాక్టర్ సుఖ్బీర్ సింగ్,వివేక్ జోషిలను టీడీపీ నేతలు కలిశారు. కేంద్ర ఎన్నికల సంఘానికి ఓ లేఖను టీడీపీ బృందం అందజేసింది. ఈవీఎంలపై ఓటర్ల జాబితా పరంగా టీడీపీ నేతలు కీలక సూచనలు చేశారు. సీజీఏ ఆధ్వర్యంలో వార్షిక తృతీయ పక్ష ఆడిట్ నిర్వహించింది. పార్టీలు, ఎన్నికల విధానాల్లో మార్పులతో పాటు పలు అంశాలపై చర్చించింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలతో అన్ని పార్టీల సూచనలు తీసుకుంటున్నామని ఈసీ తెలిపింది. బీహార్‌లో ఈసీ సంస్కరణలను టీడీపీ బృందం స్వాగతించింది. గంట సేపు కేంద్ర ఎన్నికల కమిషనర్‌లతో టీడీపీ నేతలు చర్చించారు. ఆగస్టు జనవరి మధ్య ఏపీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ జరుగనుందని సీఈసీ తెలిపారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా రూపొందించాలని లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. అపోహలకు చోటులేకుండా సంస్కరణలు అమలుచేయాలని సూచించారు. ప్రత్యేక యాప్ ద్వారా ఓటరు జాబితా సవరణ చేయాలని శ్రీకృష్ణదేవరాయలు కోరారు. ఏఐ ఆధారిత టూల్స్‌తో డూప్లికేట్, మరణించిన ఓటర్లని గుర్తించాలి.ఇపిఐసీ నంబర్లలో డూప్లికేట్ల తొలగింపు, ఆధార్‌తో క్రాస్ వెరిఫికేషన్ ,సరికొత్త బయోమెట్రిక్ పద్ధతికి మార్పు సూచన బీఎల్‌ఏలకు చురుకైన పాత్ర కల్పించాలి. బూత్ లెవెల్ ఏజెంట్లకు డ్రాఫ్ట్ రోల్స్ ముందుగానే ఇవ్వాలి. అన్ని గుర్తింపు పొందిన పార్టీలకు సమాన హక్కులు ఉండాలి. పబ్లిక్ యాక్సెస్, పారదర్శకతకు బలమైన పిలుపు. జిల్లా వారీగా డాటా విడుదల చేయాలి. ఓటర్ల జాబితాలో చేర్పులు, తొలగింపుల వివరాలు వెల్లడించాలని సూచించారు ప్రజల ఫిర్యాదుల కోసం రియల్ టైం డ్యాష్‌బోర్డు ఏర్పాటు. చట్టపరమైన సంస్కరణలు అవసరం. బ్లాక్ లెవెల్ ఆఫీసర్లు, డిస్ట్రిక్ట్ అధికారుల నిర్లక్ష్యానికి శిక్షలు విధించాలి. రాష్ట్రస్థాయిలో అంబుడ్స్‌మెన్ నియామకం చేయాలి.ఓటర్లుగా వలసదారులు, ఆదివాసీలు, వృద్ధుల చేర్పు కోసం

>>2

# నేటి ప్రగతికి బీజం పివి వేసినదే



మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన పివి స్మారక సదస్సులో పాల్గొన్న సిఎం చంద్రబాబు

## ఆయన 17 భాషలు మాట్లాడేవారు..

## నేడు దేశంలో ఒక భాషపైనే చర్చ సాగుతోంది..

## ఢిల్లీలో 'ది లైఫ్ అండ్ లెగసీ ఆఫ్ పివి' సదస్సులో సిఎం చంద్రబాబు

## భారత్ ప్రధానుల మ్యూజియంలో సదస్సు

**విజయవాడ,జూలై15,ప్రభాతవార్తప్రతినిధి:** చదువుకున్న యువత రాజకీయాల్లోకి రావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. ఢిల్లీలోని భారత ప్రధానుల మ్యూజియం, లైబ్రరీ ప్రాంగణంలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు స్మారకోపన్యాస సదస్సు జరిగింది. ద లైఫ్ అండ్ లెగసీ ఆఫ్ పీవీ నరసింహారావు పేరుతో కేంద్ర సాంస్కృతిక శాఖ ఈ సదస్సు నిర్వహించింది. ఇప్పటి వరకు ఐదుగురు మాజీ ప్రధానులకు సంబంధించిన స్మారకోపన్యాస సదస్సులు నిర్వహించిన కేంద్ర సాంస్కృతిక శాఖ ఆరో సదస్సుగా పీవీ నరసింహారావు స్మారకోపన్యాస సదస్సు నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాజకీయాల్లోకి యువత రావాల్సిన అవసరం ఉంది. చదువుకున్న యువత రాజకీయాల విషయంలో విముఖత ప్రదర్శిస్తున్నారు. ఇది సరైనది కాదు. నేను యువకులైన మంచి రాజకీయ నేతల గురించి వెతుకుతున్నాను. యువత అంతా ఆల్ ఇండియా సర్వీసెస్, బిజినెస్, మంచి ఉద్యోగం.. మంచి కెరీర్ అంటున్నారు. కానీ మంచి ఉద్దేశ్యాలు మంచి భావాలు కలిగిన యువత రాజకీయాల్లోకి రావాలి, అప్పుడే దేశానికి మంచి లీడర్షిప్ వస్తుంది. పబ్లిక్ పాలసీలు రూపొందించేది రాజకీయ నాయకులే బ్యూరోక్రాట్లు కాదు. ప్రజలకు మంచి చేసేలా విధానాలు రూపకల్పన చేయాలంటే రాజకీయ నేతల వల్లనే సాధ్యం. ఈ విషయాన్ని యువతరం గుర్తుంచుకోవాలి. టీడీపీ దేశంలోనే యంగెస్ట్ పార్టీ.. టీడీపీలో చాలా మంది యువకులు.. చదువుకున్న వారు ప్రజా ప్రతినిధులుగా ఉన్నారు." అని చంద్రబాబు చెప్పారు. అనేక పార్టీలను ఒప్పించి పీవీ ఆర్థిక సంస్కరణలు తెచ్చారని చంద్రబాబు అన్నారు.దేశంలో లైసెన్స్ రాజ్ విధానానికి స్వస్తి చెప్పారు. పెట్టుబడిదారులు సులభంగా వచ్చేలా చర్యలు తీసుకున్నారు. దేశంలో పారిశ్రామిక పురోగతికి బాటలు వేశారు. పీవీ తీసుకున్న చర్యలవల్లే ఐటీ విప్లవం వచ్చింది.తెలుగు రాష్ట్రాల స్ఫూర్తితో వేళ్లూనుకున్న పి.వి.నరసింహారావు తనకు మధ్య ఉన్న స్నేహపూర్వకమైన, గౌరవప్రదమైన సంబంధాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేసుకున్నారు. ఆయన సమతుల్యత రాజకీయ పరిణతికి ఒక ప్రకాశవంతమైన ఉదాహరణ అని ఆయనను అభివర్ణించారు. ఆయన మన గొప్ప దేశం యొక్క విధిని పునర్నిర్మించిన నిజమైన తెలుగు బిడ్డ."శ్రీ పి.వి. నరసింహారావు అసాధారణ మేధస్సు అద్భుతమని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు కొనియాడారు. పీవీ నరసింహారావు బహుభాషలలో ప్రావీణ్యం సంపాదించారు

>>2

# క్షేమంగా అవనిపైకి..

>> అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో అడుగుపెట్టి చరిత్ర సృష్టించాడు. 39 ఏళ్ల వయసున్న శుక్లా ఐఎస్ఎస్‌కు వెళ్లిన తొలి భారతీయుడిగా, 634వ వ్యోమగామిగా ఘనత పొందారు. మరో ప్రత్యేకత ఏంటంటే 41 ఏళ్ల తర్వాత అంతరిక్షంలోకి వెళ్లిన మొదటి భారతీయుడూ ఆయనే. రాకేశ్ శర్మ తర్వాత అంతరిక్ష యాత్రలో పాల్గొన్న రెండో భారతీయుడిగా శుక్లా రికార్డుకెక్కారు. యాక్సియమ్ 4 మిషన్‌లో భాగంగా ఫాల్కన్9 రాకెట్‌ను జూన్ 25న అంతరిక్షంలోకి ప్రయోగించారు. ఈ మిషన్‌లో శుభాంశు శుక్లాతో పాటు పెగ్గీ విట్సన్, స్లావోస్జ్ ఉజ్నాన్స్కీవిస్నియెుస్కీ, టిబోర్ కాపు పాల్గొన్నారు. భూమి చుట్టూ 28 గంటల ప్రయాణం తర్వాత వ్యోమగాములు బయల్దేరిన స్పేస్‌క్రాఫ్ట్ ఐఎస్ఎస్‌కు డాక్ అయింది. జూన్ 26న ఐఎస్ఎస్‌కుచేరుకున్న ఈ నలుగురు వ్యోమగాములు అమెరికా, భారతదేశం, పోలాండ్, హంగేరీ, సౌదీ అరేబియా, బ్రెజిల్, నైజీరియా, గీతిని, యూరప్ అంతటా ఉన్న దేశాలతో సహా 31 దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తూ మైక్రోగ్రావిటీలో దాదాపు 60 శాస్త్రీయ అధ్యయనాలు, వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించారు. వాటిలో భారతదేశం ఇస్రో ద్వారా ఏడు కీలక అధ్యయనాలను ఈ మిషన్‌కు అందించింది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో 18 రోజుల పాటు విస్తృత పరిశోధనలు జరిపిన అనంతరం నిన్న అంటే జులై 14న సాయంత్రం 4:45 గంటలకు ఐఎస్ఎస్‌తో క్రూ డ్రాగన్ ది213 గ్రేస్ క్యాప్సూల్ అన్‌డాకింగ్ ప్రక్రియ నిర్వహించారు. పలు ఆర్బిటల్ ప్రక్రియల అనంతరం ఇవాళ మధ్యాహ్నం 3.01 గంటలకు కాలిఫోర్నియా తీరంలో క్రూ డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్ ల్యాండ్ అయింది. వెంటనే శుక్లాతో పాటు పెగ్గీ విట్సన్, స్లావోస్జ్ ఉజ్నాన్స్కీ విస్నియెుస్కీ, టిబోర్ కాపు వ్యోమగాములను ఏడు రోజుల పాటు క్వారంటైన్‌కు తరలించనున్నారు. అంతరిక్షంలో భారరహిత స్థితిని అనుభవించిన కారణంగా భూమిపైకి చేరగానే ఇక్కడి వాతావరణానికి వారి శరీరాలు అలవాటు పడేందుకు ఈ చర్యలు తీసుకోనున్నట్లు ఇస్రో పేర్కొంది. అందుకోసం వారం రోజుల పాటు రిహాబిలిటేషన్ సెంటర్‌లో ఉంచనున్నట్లు తెలిపింది. ఇస్రోకు చెందిన వైద్యాధికారులు వ్యోమగాముల ఆరోగ్యం, ఫిట్‌నెస్‌ను నిరంతరం పర్యవేక్షిస్తారని వివరించింది.

**చరిత్ర సృష్టించిన శుక్లా: ప్రధాని మోడీ**



అంతరిక్షం నుంచి భూమికి తిరిగి వచ్చిన గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లాను ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించిన భారతదేశపు మొట్టమొదటి వ్యోమగామిగా శుభాన్షు శుక్లా కొత్త చరిత్ర సృష్టించాడు. తన అంకితభావం, ధైర్యం మార్గదర్శక స్ఫూర్తి ద్వారా బిలియన్ల కలలను నిజం చేశారు. ఇది భారత మానవ అంతరిక్ష విమాన మిషన్ – గగన్‌యాన్ వైపు మరో మైలురాయిని సూచిస్తుందని ప్రధాని మోడీ పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రధాని ఎక్స్ వేదికగా తన అధికారిక అకౌంట్‌లో పోస్ట్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శుభాన్షు శుక్లాను అభినందిస్తూ. చారిత్రాత్మక మిషన్ నుండి భూమికి తిరిగి వస్తున్న గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లాను యావత్ దేశంతో పాటు నేను స్వాగతిస్తున్నాను. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించిన భారతదేశపు మొట్టమొదటి వ్యోమగామిగా, ఆయన తన అంకితభావం, ధైర్యం మరియు మార్గదర్శక స్ఫూర్తి ద్వారా బిలియన్ల కలలను ప్రేరేపించారు. ఇది మన స్వంత మానవ అంతరిక్ష విమాన మిషన్ – గగన్‌యాన్ వైపు మరో మైలురాయిని సూచిస్తుందని అన్నారు.

**భగవంతునికి కృతజ్ఞతలు: తల్లిదండ్రులు**



ఐఎస్ఎస్ నుంచి గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాతో పాటు యాక్సియమ్4 సిబ్బంది సురక్షితంగా భూమికి తిరిగి వచ్చిన క్షణాల్లో భావోద్వేగాలు ఉప్పొంగాయి. పసిఫిక్ మహాసముద్రంలో విజయవంతంగా స్ప్లాష్‌డౌన్ అయిన వార్తకు స్పందించిన శుక్లా తల్లి ఆశా శుక్లా కన్నీళ్లు పెట్టుకున్నారు. చాలా రోజుల తర్వాత తన కొడుకు సురక్షితంగా పుడమికి చేరుకోవడంపై ఆమె ఆనందం వ్యక్తం చేశారు. తన కుమారుడు శుక్లా పైలట్‌గా వ్యవహరించిన యాక్సియమ్4 మిషన్ విజయంపై ఆమె మాట్లాడారు. మొదట్లో నాకు భయం వేసింది. అయితే ఇప్పుడు నాకు చాలా గర్వంగా ఉంది. రాబోయే తరం కూడా ప్రేరణ పొంది ముందుకు సాగాలని అన్నారు. ఈ క్రమంలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి యాక్సియమ్4 సిబ్బంది భూమికి చేరుకున్న తరుణంలో లైవ్ ఈవెంట్‌ను కవర్ చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.నా కొడుకు సురక్షితంగా పుడమికి తిరిగి వచ్చాడు. ఐ థాంక్ టూ గాడ్. ఈ లైవ్ ఈవెంట్‌ను కవర్ చేసిన వారందరికీ కృతజ్ఞతలు. నా కొడుకు భూమికి చేరుకున్న క్షణంలో నేను భావోద్వేగానికి గురయ్యాను. ఎందుకంటే చాలా రోజుల తర్వాత నా బిడ్డ భూమికి తిరిగి వచ్చాడని ఆమె విలేకరులతో అన్నారు.

# నేటి ప్రగతికి బీజం పివి వేసినదే

>> అని వ్యాఖ్యానించారు, ఇది భారతదేశ గొప్ప సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తుంది. భాష చర్చనీయాంశంగా మారుతున్న నేటి సం దర్భంలో రావు జీవితంలోని ఈ అంశం ప్రేరణగా పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆర్థిక సరళీకరణకు ముందు తరువాత భారతదేశం యొక్క సామాజికఆర్థిక మరియు రాజకీయ సవాళ్లను ఎదుర్కొన్న ప్రత్యక్ష అనుభవం ఉన్న అరుదైన నాయకులలో రావు కూడా ఉన్నారని ముఖ్యమంత్రి నొక్కి చెప్పారు. "ఒక వినయపూర్వకమైన వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ఆయన చిన్నప్పటి నుంచీ అసాధారణమైన ప్రతిభను ప్రదర్శించారు. ఆయన విద్యార్థి నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు మరియు గొప్ప పండితుడు" అని ఆయన అన్నారు. పీవీ తెచ్చిన సంస్కరణలను వాజ్‌పేయి కొనసాగించారు.వాజ్‌పేయి హయాంలో హైవేలు, ఎయిర్‌పోర్టులు, పోర్టులువచ్చాయని చంద్రబాబు అన్నారు.2014లో మోదీ కూడా అనేక సంస్కరణలు తెచ్చారని చెప్పారు.మోదీ హయాంలో భారత్ పేరు ప్రపంచవ్యాప్తంగా మారుమోగుతోంది.. అనేక దేశాలతో మోదీ మంచి సంబంధాలు కొనసాగిస్తున్నారు.సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్.. సబ్ కా విశ్వాస్ పేరుతో ముందుకెళ్తున్నాం.. ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచాం. యువత ఆశలు, ఆకాంక్షల సాధనకు మోదీ కృషి చేస్తున్నారు. వికసిత్ భారత్ పిలుపుతో దేశ రూపురేఖలు మారుతున్నాయి. ప్రపంచం ఎదుర్కొనే అనేక సమస్యలకు మనం పరిష్కారం చూపిస్తున్నాం.. మోదీ సంస్కరణల వల్ల దేశం వేగంగా అభివృద్ధి చెందుతోంది. అని చంద్రబాబు చెప్పారు. 2014లో దేశానికి ఓ మలుపు వచ్చింది. ప్రధాని నరేంద్ర మోదీ డిజిటల్ ఇండియా, మేకిన్ ఇండియా, స్టార్టప్ ఇండియా ఆత్మనిర్భర్ భారత్ వంటి కార్యక్రమాలను ప్రారంభించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం ధైర్యంగా, లక్ష్యంతో ముందుకు సాగుతోంది. 2028 నాటికి జర్మనీని దాటి భారత దేశం ఆర్థిక వ్యవస్థలో మూడో స్థానానికి చేరనుంది. ఆర్థిక స్థిరత్వం, జాతియతా భావం పెంపొందడం, అంతర్జాతీయంగా భారతదేశానికి గౌరవం దక్కడం వంటివి మోదీ నాయకత్వంలో సాధ్యమయ్యాయి. ప్రపంచ బ్యాంక్ లెక్కల ప్రకారం గత దశాబ్దంలో 17 కోట్ల మందికిపైగా ప్రజలు తీవ్రమైన పేదరికం నుండి బయటపడ్డారు ఆపరేషన్ సింధూర్ ద్వారా మోదీ టెర్రరిస్టులకు ధీటుగా సమాధానం చెప్పారు. ఇండియా సత్తా చాటారు. పబ్లిక్ పాలసీలు ప్రజల కోసం తేవాలి. నరేంద్ర మోదీ తెస్తున్న సంస్కరణలు ప్రజల కోసం.. ప్రజల మధ్య అసమానతలు తగ్గించేలా ఉన్నాయి. రైట్ లీడర్.. రైట్ టైమ్.. రైట్ ప్లేసులో ఉన్నారు. మోదీ సారథ్యంలో వివిధ రంగాల్లో భారతదేశం ప్రపంచంలో అగ్ర భాగాన నిలుస్తోంది. సంస్కరణలు తేవడం ద్వారా పీవీ దేశానికి దిశ చూపారు. వాజ్‌పేయి బలమైన పునాదులు వేశారు. మోదీ దేశానికి ఊపు ఇచ్చారు." అని చంద్రబాబు చెప్పారు. ప్రజలు.యువత ఆలోచనలు ఎప్పుడూ దేశాభివృద్ధి దిశగానే ఉండాలి. నేను చాలామంది నేతలను చూశాను. రాజకీయ నేతల్లో దూరదృష్టి కలవారు ఉన్నారు. సమర్థులు ఉన్నారు.. విధ్వంసకారులూ ఉన్నారు. ఎవరిని నమ్మాలి.. ఎవర్ని ఎన్నుకోవాలి.. భారతదేశ అభివృద్ధి కోసం ఎవరికి సహకరించాలనే దానిపై అందరూ ఆలోచన చేయాలి. స్మార్ట్ వర్క్ చేయాలి.. టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. క్వాంటం మిషన్ కేంద్రం ప్రారంభించింది. సిలికాన్ వ్యాలీ అమెరికాకు ఉంది.. మనకు క్వాంటం వ్యాలీ ఎందుకు ఉండకూడదనే ఉద్దేశ్యంతో క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తున్నాం. సంపద సృష్టించాలి.. దాన్ని పేదలకు పంచాలి. ప్రపంచంలో మన దేశానికి ప్రత్యేకత ఉంది. మన సంస్కృతి మన గొప్పదనాన్ని చాటుతుంది, అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో భారత ప్రధానుల మ్యూజియం, లైబ్రరీ కమిటీ ఛైర్మన్ సహా ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును సన్మానించేందుకు పీవీ కుమారుడు, మనవడు వేదిక మీదకు రాగా.. తనకు కాదని.. మీకే సన్మానం చేయాలంటూ చంద్రబాబు వారికి శాలువాలు వేశారు.

# హంద్రీ నీవా ఫేజ్-1 కాలువల విస్తరణ పూర్తి

>> గణనీయంగా పెరిగేందుకు ఆస్కారం కలిగింది. 12 ఏళ్ల తర్వాత మళ్లీ 40 టీఎంసీలుగతంలో హంద్రీనీవా ఫేజ్ 1 కాలువ పూర్తి సామర్థ్యం 2,200 క్యూసెక్కులు మాత్రమే ఉండటంతో ఇప్పటి వరకూ 12 సార్లు మాత్రమే వరద సమయంలో 40 టీఎంసీల నీటిని వినియోగించుకున్న పరిస్థితి. ప్రస్తుతం కాలువల సామర్థ్యం 3,850 క్యూసెక్కులకు పెరగటంతో ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం మేరకు 40టీఎంసీల వరద జలాలను ఈ ఏడాదిలో రాయలసీమ జిల్లాలకు వినియోగించుకునే అవకాశం కలగనుంది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు శరవేగంగా హంద్రీనీవా కాలువ ఫేజ్ 1 విస్తరణ పనుల్ని జలవనరుల శాఖ పూర్తి చేసింది. నెలకు దాదాపు 4.27 టీఎంసీల చొప్పున నాలుగు నెలల వరద కాలంలో అదనంగా 17.10 టీఎంసీల నీటిని తీసుకునేందుకు అవకాశం ఈ విస్తరణ పనుల ద్వారా కలిగింది. దీంతో హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్టుకు కేటాయించిన 40 టీఎంసీల నీరు కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల తాగు, సాగునీటి కష్టాల్ని తీర్చనున్నాయి. హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్ 1 ద్వారా నంద్యాల జిల్లాలో 2906 ఎకరాలు, కర్నూలు జిల్లాలో 77,094 ఎకరాలు, అనంతపురం జిల్లాలో 1,18,000 ఎకరాల ఆయకట్టుకు నీరు అందనుంది. ఫేజ్ 2 ప్రాజెక్టులో భాగంగా అనంతపురం జిల్లాలో మరో 2.27 లక్షల ఎకరాలు, కడప జిల్లాలో 37,500 ఎకరాలు, చిత్తూరు జిల్లాలో 1.40 లక్షల ఎకరాల మేర ఆయకట్టుకు నీరు అందనుంది. మొత్తంగా ఫేజ్ 1, ఫేజ్ 2 ద్వారా 6 లక్షల పైచిలుకు ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీరు అందనుంది. కూటమి వచ్చాకే మళ్లీ హంద్రీనీవా పనులు201419లో రూ.4,317 కోట్లకు పాలనానుమతులు ఇచ్చిన అప్పటి టీడీపీ ప్రభుత్వం హంద్రీనీవా కాలువల విస్తరణ పనుల్ని 47 శాత మేర పూర్తి చేసింది. 2019 నుంచి 24 వరకూ గత ప్రభుత్వం ఆ పనుల వైపు కన్నెత్తి కూడా చూడలేదు. మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చాక హంద్రీనీవా ఫేజ్ 1 ప్రధాన కాలువ పనుల్లో కదలిక వచ్చింది. 2025 ఏప్రిల్ లో మొదలైన విస్తరణ పనులు కేవలం వంద రోజుల్లో పూర్తి అయ్యాయి. తదుపరి ఫేజ్ 2 పనుల్ని కూడా ఈ నెలాఖరుకు పూర్తి చేసి పుంగనూరు, కుప్పంలోని చివరి ఆయకట్టుకూ నీళ్లు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీని కోసం మొత్తం రూ.3,890 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తోంది.

# వలసదారులు, వృద్ధుల చేర్పు కోసం ప్రత్యేక చర్యలు

>>ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. మొబైల్ బిఎల్‌వోలతో పున:నమోదు డ్రైవ్‌లు చేపట్టాలి. తాత్కాలిక చిరునామాల ఆధారంగా ఓటింగ్ హక్కు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ తరపున టీడీపీ నేతలు ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. 2029 వరకు ఎన్నికలు లేకపోవడంతో త్వరలో ఎస్ఐఆర్ ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ముందు కనీసం 6 నెలల ముందు మొబైల్ బిఎల్‌వోలతో పూర్తి చేయాలని అభ్యర్థించారు.ఎస్ఐఆర్ పౌరసత్వ ధ్రువీకరణ కాదని స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ఇవన్నీ తెలుగుదేశం పార్టీ ప్రజాస్వామ్య బలోపేతానికి ఇచ్చిన సూచనలని ఆ పార్టీ నేతలు తెలిపారు. టీడీపీ బృందంలో ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీలు దగ్గుమళ్ల ప్రసాదరావు, బైరెడ్డి శబరి, నేతలు కూన రవికుమార్, జ్యోత్స్న ఉన్నారు.

# ఎబివిపై చర్యలు నిలిపివేత

>> ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంగళవారం జీఓ ఆర్‌టి నెంబరు 1334ని ప్రభుత్వం విడుదల చేసింది. ఇంటెలిజెన్సీ డిజిగా ఉన్న సమయంలో నమోదైన కేసుల్లో ప్రొసీడింగ్స్ నిలిపివేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# 10లక్షల ఉద్యోగాలు

>> షన్ హబ్‌ను త్వరలోనే ప్రారంభించనున్నట్లు మంత్రి లోకేష్ తెలిపారు. దీంతోపాటే విశాఖ, రాజమహేంద్రవరం, విజయవాడ, తిరుపతి, అనంతపురంలో ప్రాంతీయ స్పోక్స్ కేంద్రాలను కూడా ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అమరావతి క్వాంటమ్ వ్యాలీకి సంబంధించి టిసిఎస్, ఎల్ అండ్ టి, ఐబిఎంల భాగస్వామ్యంతో కంపెనీ ఏర్పాటైందని, ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలపై అధికారులు దృష్టి సారించాలని అన్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో 400 ఎకరాల్లో నిర్మించతలపెట్టిన డ్రోన్ సిటీని ఏడాదిలోగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకు అవసరమైన ఎకో సిస్టమ్ కల్పించాలని అధికారులను ఆదేశించారు. బుడమేరు వరదల సమయంలో డ్రోన్లసేవలు ఎంతగానో ఉపకరించాయని, వ్యవసాయం, పోలీసింగ్, వాతావరణం తదితర శాఖల్లో డ్రోన్ల వినియోగంపై నెలకో జిల్లాలో ఈవెంట్లు నిర్వహించి ప్రజలను చైతన్యపర్చాలని సూచించారు.

పౌరసేవల్లో సరికొత్త అధ్యాయాన్ని సృష్టించిన మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ సేవలను మరింత విస్తృత ప్రచాలని మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. మొత్తం 702 సేవలకు 535 సేవలను ఇప్పటికే మనమిత్ర ద్వారా అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులు తమకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం రెవిన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే విధానానికి చెక్ పెట్టాలని, కులధృవీకరణ పత్రంతో సహా విద్యాసంబంధిత అన్నిరకాల సర్టిఫికెట్లు బ్లాక్ చైన్ తో అనుసంధానం చేసి మనమిత్ర ద్వారా సులభతరంగా పత్రాలు అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలోని 45వేల ప్రభుత్వపాఠశాలల్లో ప్రతిస్కూలుకు ఇంటర్నెట్ కనెక్టివిటీ ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, రాజమండ్రి వంటి ఎయిర్ పోర్టుల్లో అంతరాయం లేని ఫోన్ కనెక్టివిటీకి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, ఐటి అండ్ సి స్పెషల్ సెక్రటరీ సుందర్ ఎపిఐఐసి ఎండి అభిషిక్త్ కిషోర్, ఎకనమిక్ డెవలప్ మెంట్ బోర్డు సిఇఓ సాయికాంత్ వర్మ, ఆర్టీజిఎస్ సిఓ ప్రకార్ జైన్, ఎపిటిఎస్ ఎండి సూర్యతేజ, తదితరులు పాల్గొన్నారు.

# హైకోర్టు జడ్జిగా బి.దేవానంద్

>> కొనసాగుతారు. జస్టిస్ దేవానంద్ పదవీకాలం 2028 ఏప్రిల్ 13 వరకు ఉంది. ప్రభుత్వ ఉపాధ్యాయులు బట్టు వెంకటరత్నం,మనోరంజితం దంపతులకు కృష్ణాజిల్లా గుడివాడలో 1966ఏప్రిల్ 14న జస్టిస్ జన్మించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. 1989 జులై 6న బార్‌కౌన్సిల్ న్యాయవాదిగా పేరునమోదు చేసుకున్నారు. విశాఖ జిల్లా కోర్టులో ప్రాక్టీసు ప్రారంభించి,తర్వాత హైకోర్టుకు మార్చారు. 1996 నుంచి 2వేలు వరకు హైకోర్టులో సహాయ ప్రభుత్వన్యాయవాదిగా,2014 జులై నుంచి 2019 మే వరకు ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేశారు. 2006లో ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికయ్యారు. 2020జనవరి 13న ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా భాధ్యతలు స్వీకరించారు.బదిలీపై 2023 ఏప్రిల్ 10న మద్రాస్ హైకోర్టుకు వెళ్ళారు. ఆయన్ను తిరిగి ఏపీ హైకోర్టుకు బదిలీ చేసేందుకు సుప్రీంకోర్టు కొలీజియం ఇటీవల కేంద్రానికి సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. జస్టిస్ దేవానంద్‌కు భార్య,ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. జస్టిస్ దేవానంద్ సోదరుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విజయనగరం జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్నారు.

## ఎంపి మిథున్ రెడ్డికి హైకోర్టులో చుక్కెదురు

>>ముడుపుల సొమ్ము అంతిమంగా ఎక్కడికి చేరిందో తెలుస్తుందని ధర్మాసనానికి తెలిపారు.ముడుపులు రూపేణా డికార్ట్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్(ఏ16) నుంచి మిథున్‌రెడ్డి కుటుంబానికి చెందిన పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన బ్యాంక్ ఖాతాలో రూ.5 కోట్లు జమైందని కోర్టు దృష్టికి తెచ్చారు. ముడుపుల ద్వారా వచ్చిన సొమ్ముతో బంగారు అభరణాలు కొనుగోలు చేశారని అన్నారు. అలానే మిథున్ రెడ్డి దర్యాప్తునకు సహకరించడం ఆయనికి నేర చరిత్ర ఉందని, ఆయనపై 8 కేసులు నమోదు అయ్యాయని అన్నారు. ఇందువల్ల ముందస్తు బెయిల్ పొందేందుకు మిథున్‌రెడ్డి అనర్హులని ఆయని పిటిషన్ ను కొట్టేయాలని లూథ్రా కోరారు. ఎంపీ మిథున్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది టి. నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం విధానంతో పిటిషనర్‌కు సంబంధం లేదని అలానే పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్ సంస్థలో మిథున్‌రెడ్డి డైరెక్టర్ కాదని తెలిపారు. డికార్డు లాజిస్టిక్స్ సంస్థ నుంచి పీఎల్ఆర్ సంస్థకు వచ్చిన రూ.5 కోట్లను తిరిగి ఆ సంస్థకే చెల్లించారని ఓ సాక్షి ఇచ్చిన వాంగ్మూలం మినహా పిటిషనర్ నేరానికి పాల్పడ్డారనేందుకు ఎలాంటి ఆధారాలు లేవని అన్నారు. ఇరువురి వాదనలు విన్న న్యాయస్థానం ఇటీవల తీర్పు రిజర్వ్ చేసి నేడు ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## రిటైర్డ్ ఇంజినీర్ హత్య కేసులో నిందితుల అరెస్టు

**విజయబాడ,జూలై15,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో జరిగిన రిటైర్డ్ ఇంజనీర్ హత్య కేసులో పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. దీనికి సంబంధించి మాచవరం పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ దామోదర్, మాచవరం సీఐ ప్రకాశ్‌ల వివరాలు ఉన్నాయి. తెలంగాణలోని ఖమ్మం జిల్లా కొత్తగూడేనికి చెందిన పల్లపు మంగ అలియాస్ అనూష 12 ఏళ్ల వయసులోనే రమేశ్ అనే వ్యక్తిని ప్రేమ వివాహం చేసుకుంది. ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది. 5 ఏళ్ల కింద ముగ్గురు పిల్లలు, భర్తను వదిలేసి విజయవాడ వచ్చింది. ఇంటిలో పని చేసుకొని జీవనం సాగించింది. అనంతరం హైదరాబాద్ వెళ్లింది. ఓ డేటింగ్ యాప్ ద్వారా రాజా అనే వ్యక్తి పరిచయం అవ్వగా మంగ అతడిని పెళ్లి చేసుకుంది. ఒక సంవత్సరం తర్వాత అతన్ని కూడా వదిలేసింది. అనంతరం యాప్‌లో పరిచయమైన ఖమ్మం జిల్లా నారాయణపురం మండలం తల్లాడ గ్రామానికి చెందిన వేమిరెడ్డి ఉపేంద్రరెడ్డి అనే వ్యక్తిని ఈ ఏడాది మే 29న 3వ పెళ్లి చేసుకుంటుంది. విజయవాడ ఎన్టీఆర్ కాలనీకి చెందిన రిటైర్డ్ ఇంజనీర్ రామారావు ఇంటిలో కేర్ టేకర్‌గా చేరింది. ఆయన ఇంట్లో ఎక్కువ బంగారం, నగదు ఉంటాయనే ఆలోచనతో భర్త ఉపేంద్ర సహాయం తీసుకొని రామారావుని హత్య చేసింది. తర్వాత బీరువాలోని డబ్బు తీసుకుని ఇద్దరూ పరారయ్యారు. సీసీ కెమెరాలతో పాటు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా గాలించిన పోలీసులు చివరకు ఇద్దరినీ అరెస్టు చేశారు. కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన ఎస్సైలు శంకర్,శ్రీనివాస్, సిబ్బంది వంశీ, మల్లేశ్వరరావు, రమేష్, తరుణ్, సుభాష్‌లను డీసీపీ దామోదర్ అభినందించారు.

# కేరళ నర్సుకు ఊరట: యెమెన్‌లో ఉరిశిక్ష వాయిదా

**సనా,జూలై 15:** ఉరికంబం ఎక్కాల్సిన కేరళ నర్స్ నిమిష ప్రియకు ఊరట లభించింది. ఈనెల 16 అమలు కావాల్సిన ఆమె ఉరిశిక్షను యెమెన్ ప్రభుత్వం వాయిదా వేసింది. ఈ మేరకు విదేశాంగ శాఖ ఓ ప్రకటన చేసింది. యెమెన్ జైలు అధికారులతోపాటు ప్రాసిక్యూషన్ కార్యాలయంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది. ఈ కేసులో బాధితురాలికి సాయం చేసేందుకు భారత్ ప్రభుత్వం మొదటి నుంచి తనవంతు ప్రయత్నాలు చేస్తోంది. నిమిష, బాధిత కుటుంబాల మధ్య పరస్పర అంగీకారానికి వచ్చి కేసును పరిష్కరించుకునేలా మరింత సమయం ఇవ్వాలని కోరాం. ఈ విషయంలో స్థానిక జైలు అధికారులు, ప్రాసిక్యూటర్ ఆఫీసుతో నిరంతరం జరిపిన సంప్రదింపులు ఫలించాయి. మరణశిక్ష అమలును వాయిదా వేసేందుకు యెమెన్ అధికారులు అంగీకారం తెలిపారని విదేశాంగ శాఖ వర్గాలు వెల్లడించాయి. ఇక ఈ కేసులో బ్లడ్ మనీ తీసుకునేలా బాధిత కుటుంబాన్ని ఒప్పించేందుకు మత గురువు కాంతాపురం ఏపీ అబూబకర్ ముస్లియార్ సంప్రదింపులుజరుపుతున్నారు. ఆచర్చలు కూడా సానుకూలంగా జరుగుతున్నట్లుగా తెలుస్తోంది. బాధిత కుటుంబానికి ఒక మిలియన్ డాలర్ల (దాదాపు రూ.8.6కోట్లు) క్షమాధనాన్ని ఇచ్చేందుకు నిమిష ప్రియ కుటుంబం సిద్ధంగా ఉంది. ఇందుకు వారు అంగీకరిస్తే నిమిష ప్రియకు మరణశిక్ష తప్పే అవకాశం ఉంది. కేరళ పాలక్కాడ్ జిల్లాకు చెందిన నిమిష నర్సు కోర్సు పూర్తి చేసిన తర్వాత 2008లో యెమెన్ వెళ్లి అక్కడే ఉద్యోగంలో చేరారు. 2011లో థామస్‌ను వివాహం చేసుకున్న ఆమె అక్కడే ఓ క్లినిక్ తెరవాలనుకొన్నారు. ఆ దేశ నిబంధనల ప్రకారం స్థానిక తలాల్ అదిబ్ మెహది అనే వ్యక్తిని నిమిష, థామస్ జంట తమ వ్యాపార భాగస్వామిగా చేసుకొన్నారు. వారు అల్‌అమన్ మెడికల్ కౌన్సిల్ సెంటర్‌ను ప్రారంభించారు. కొన్నేళ్ల తర్వాత ఆమె భర్త, కుమార్తె కేరళకువచ్చేశారు. నిమిష యెమెన్‌లోనే ఉంటూ సెంటర్‌ను కొనసాగించారు.



మంగళవారం న్యూఢిల్లీలో నీతిఆయోగ్ సభ్యులతో భేటీ అయిన సిఎం చంద్రబాబు

# సత్వరమే నిధులు మంజూరు

>> అమిత్ షాకు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. అలాగే రాష్ట్రంలోని కరవు ప్రాంతాలకు నీటిని తరలించేందుకు కీలకమైన పోలవరం –బనకచర్ల లింక్ ప్రాజెక్టు అంశాన్ని కూడా సీఎం ప్రస్తావించారు. పోలవరం నుంచి కర్నూలు జిల్లా బనకచర్ల రెగ్యులేటర్ వరకూ 200 టీఎంసీల వరద నీటిని తరలించేలా ఈ లింక్ ప్రాజెక్టు ప్రతిపాదించినట్లు తెలిపారు. అనుసంధాన ప్రాజెక్టు పూర్తి అయితే కరవు పీడిత రాయలసీమ ప్రాంతానికి దక్కే ఫలితాలను అమిత్ షాకు సీఎం చంద్రబాబు వివరించారు. గోదావరి నదిలో ఎగువ, దిగువ రాష్ట్రాల నీటి అవసరాలు తీర్చిన తర్వాత కూడా 90 నుంచి 120 రోజుల మిగులు జలాలు ఉంటాయని ముఖ్యమంత్రి తెలిపారు. నదీ ప్రవాహ మార్గంలో చివరి రాష్ట్రంగా గోదావరి మిగులు జలాలను పూర్తిగా వినియోగించుకునే హక్కు ఏపీకి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు హోం మంత్రికి తెలియచేశారు. అంతకుముందు ఢిల్లీలోని ముఖ్యమంత్రి నివాసంలో నీతి ఆయోగ్ సభ్యులు వి.కె.సారస్వత్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఎరో స్పేస్, డిఫెన్స్ పరిశ్రమల ఏర్పాటుపై సారస్వత్‌తో ముఖ్యమంత్రి చర్చించారు. రాయలసీమ ప్రాం తంలో డిఫెన్స్ పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రభుత్వం ప్రణాళికలు చేస్తోందని ఈ పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలు ఆ రంగంలో పరిశ్రమలు, పెట్టుబడులు సాధించేందుకు అనుసరించాల్సిన అంశాలపై ఇరువురూ చర్చించారు. అనంతరం ఢిల్లీ మెట్రో రైల్ ఎండి వికాస్ కూడా ముఖ్యమంత్రిని కలిశారు. విశాఖ, విజయవాడ నగరాల్లో మెట్రో నిర్మాణంపై సహాకారంపై చర్చించారు.



మంగళవారం ఢిల్లీ మెట్రో రైల్ ఎండి వికాస్‌ను కలిసిన సిఎం చంద్రబాబు

## అటవీశాఖలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

**విజయవాడ,జూలై 15,ప్రభాతవార్తప్రతినిధి:** కూటమి ప్రభుత్వంలో ఉద్యోగాల భర్తీకి ఏపీపీఎస్సీ మొదటి నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటికే మెగా డీఎస్సీ వచ్చినా ఏపీపీఎస్సీ ద్వారా ఇదే తొలి నోటిఫికేషన్. అటవీ శాఖలో 256 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, 435 అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ పోస్టుల భర్తీ కోసం ఈ నోటిఫికేషన్‌ను జారీచేసినట్లు ఏపీపీఎస్సీ కార్యదర్శి పి.రాజాబాబు ఒక ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్‌ను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. అభ్యర్థులు ఈనెల 16 నుంచి ఆగస్టు 5 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. స్పోర్ట్స్ కోటా ఖాళీలు, ఎస్సీ గ్రూపుల వారీగా ఖాళీల వివరాలను అందుబాటులో ఉంచుతామన్నారు.కాంట్రాక్టు డిగ్రీ లెక్చరర్ల సేవలను రెన్యువల్ చేస్తూ ఉన్నత విద్యా శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 693 మంది లెక్చరర్ల సేవలు కొనసాగిస్తున్నట్లు పేర్కొంది. ఈ ఏడాది జూన్ నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ వరకు 11 నెలలపాటు ఈ కాంట్రాక్టు కొనసాగుతుంది.

# సజ్జల శ్రీధర్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప బెయిల్‌ను తిరస్కరించిన ఎసిబి కోర్టు

**విజయవాడ,జూలై15,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న సజ్జల శ్రీధర్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్లను విజయవాడ ఏసీబీ కోర్టు కొట్టేసింది. సోమవారం న్యాయాధికారి పి.భాస్కరరావు ఈ మేరకు తీర్పును వెలువరించారు. సజ్జల శ్రీధర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌ను కొట్టేయడం ఇది రెండోసారి. ఇంతకుముందు కూడా ఆయన దాఖలుచేసిన పిటిషన్‌ను కోర్టుకొట్టేసింది. దీంతో ఆయన రెండోసారి పిటిషన్ దాఖలు చేశారు.

# ఎఐ ఆధారిత విద్యా విప్లవానికి కేంద్రంగా ఎపి: సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూలై 15,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతిలో ఏఐ ప్లస్ క్యాంపస్ ఏర్పాటు..ఉన్నత విద్యను సమూలంగా మార్చే నిర్ణయమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఇందుకు ముందుకొచ్చిన ఆదిత్య బిర్లా గ్రూప్ ఛైర్మన్,బిట్స్ విశ్వవిద్యాలయ కులపతి కుమారమంగళం బిర్లాకు సోమవారం ఎక్స్ వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. 'ఈ నిర్ణయం ఆంధ్రప్రదేశ్‌ను ఏఐ ఆధారిత విద్యా విప్లవానికి కేంద్రంగా మార్చే దిశగా గొప్ప ముందడుగు' అని చంద్రబాబు పోస్ట్ చేశారు.

**బిట్స్ క్యాంపస్ ఏర్పాటుకు స్వాగతిస్తున్నాం**

బిట్స్ కొత్త క్యాంపస్‌ను అమరావతిలో ఏర్పాటు చేయనున్నట్లు ఆదిత్య బిర్లా గ్రూప్ ఛైర్మన్ కుమారమంగళం బిర్లా చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎక్స్‌లో పోస్టు చేశారు. రూ.వెయ్యి కోట్ల పెట్టుబడితో నెలకొల్పనున్న ఈ క్యాంపస్‌లో 7 వేల మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తారు'అని లోకేష్ పేర్కొన్నారు.

## వారం - వర్జ్యం

16-07-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
షష్ఠి రా.9.02
పూర్వాభాద్ర ఉ.5.44, ఉత్తరాభాద్ర తె.4.50
వర్జ్యం : తె.4.41-7.44
దు.ఉ.11.49-12.40
రాహుకాలం – మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** వృత్తి, వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు.కీలక నిర్ణయాలలో కొంత భాగస్వామి సలహాలు తీసుకొంటారు.

**వృషభం :** కుటుంబ సభ్యుల నుండి సహాయసహకారాలు అందుకొంటారు. ఆరోగ్య సమస్యలు చికాకులు కలిగిస్తాయి.

**మిథునం:** గృహనిర్మాణ ఆలోచనలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి

**కర్కాటకం :** శ్రమకు తగిన ఫలితం కష్టమే. ఎదుటివారి విషయాలలో జోక్యం తగదు.ఆర్థిక పరిస్థితి అనుకూలం..

**సింహం:** పెట్టుబడుల విషయంలో తొందరపాటు వద్దు. ఇంటాబయటా కొంతవరకు ప్రోత్సాహం లభిస్తుంది.

**కన్య :** పట్టుదల పెరుగుతుంది. బంధువులకు కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు.

**తుల :** శ్రమకు తగ్గ ఫలితం దక్కుతుంది. దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊరట చెందుతారు.

**వృశ్చికం:** కీలక నిర్ణయాలలో సొంత ఆలోచన మంచిది. సాంకేతిక, రాజకీయ రంగాల వారికి కొంత అనుకూలంగా వుండును.

**ధనుస్సు:** సోదరుల సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఉద్యోగాలలో స్థానచలనం వుంటుంది.

**మకరం:** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**కుంభం:** శ్రమకు తగిన ఫలితం దక్కదు. దీర్ఘకాలిక సమస్యలు ఎదురై చికాకులు పెడతాయి.

**మీనం :** దూరప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. సేవా కార్యక్రమాలలో చురుకుపాల్గొంటారు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మహిళామణులను గొప్ప వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలి

## పట్టణాభివృద్ధి శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్



లైఫ్లీ హుడ్స్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్ షిఫ్ యాక్సిలరేషన్ ప్రోగ్రాంను ప్రారంభిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్

**విజయవాడ,జూలై 15,ప్రభాతవార్త ప్రతినిధి:** మహిళా మణులను ఆర్థికంగా శక్తివంతులను చేసి వారు గొప్ప వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్న ఆశయంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ప్రభుత్వం ముందుకు వెళుతుందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి లైఫ్లీ హుడ్స్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్ షిఫ్ యాక్సిలరేషన్ ప్రోగ్రాంను తాడేపల్లి లోని ఓ ప్రైవేటు కన్వెన్షన్ లో మంగళవారం నిర్వహించారు.జ్యోతి ప్రజ్వలన ద్వారా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ʼ మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి లీప్ కార్యక్రమం ఎంతో ఉపయోగపడు తుం దన్నారు. వారిలో దాగున్న వ్యాపార నైపు ణ్యా లను వెలికితీసి వారిని బలమైన వ్యాపా రవేత్తలుగా తయారు చేయడానికి మెప్మా చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 30వేల మందికి పైగా మహిళా వ్యాపారవేత్తలను తయారు చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతున్నామన్నారు. స్వయం సహాయక సంఘాల నుంచి రుణం తీసుకుని చిన్న చిన్న వ్యాపార సంస్థలు నెలకొల్పి అంచెలంచెలుగా రూ. కోటి టర్నోవర్ సాధించే సంస్థలుగా రూపాం తరం చెందేలా వారికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ ఏడాదిలో రాష్ట్రమంతా ఆడిట్ నిర్వహించాలన్న లక్ష్యంతో ముందకు సాగుతున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ అన్నారు. మహిళలు చాలా మంది ఆడిట్ లో పాల్గొంటే తమ కుటుంబాలకు ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు అందవన్న అపోహ లో ఉన్నా రని, అది వాస్తవం కాదని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో పేదరికాన్ని శాశ్వతంగా దూరం చేయా లన్న సంకల్పంతో ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. నేడు మన సొసైటీలో ఎన్నో విధాలుగా ఆదాయం పొందే మార్గాలు ఉన్నాయని, అవకాశాలను అంది పుచ్చు కోవాలన్న సంకల్పం ఉండాలన్నారు. కుకింగ్, వివిద అంశాలపై అవగాహన కల్పించే వీడియోలు సైతం ఆదాయాన్ని సమకూర్చు తాయన్నారు. మన గ్రామంలో, మన పట్టణంలోనే సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ పై శిక్షణ పొంది ఆదాయం ఆర్జించవచ్చన్నారు. మెప్మా ఎండీఎస్. తేజ్ భరత్ మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి, వారిని సంఘంలో ఒక గుర్తింపు కలిగిన వ్యాపారవేత్తలుగా తయారు చేయడానికి మెప్మా సిబ్బంది శక్తి వంచన లేకుండ పనిచేయాలని పిలుపునిచ్చారు. మహిళలకు రుణాలు ఇప్పిం చడంతో బాధ్యత తీరిపోయింద నుకోకూడదని, వారి వ్యాపార ఉన్నతికి తమ వంతు సలహాలు, సహాయ సహకారాలు అందించాలన్నారు. రాష్ట్రంలోని విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి కార్పొరేషన్ లలో లినితిశి ఆడిట్ చివరి దశకు వచ్చిందని, మిగిలిన 14 కార్పొరేషన్ లలో కూడా ఆడిట్ ను త్వరలోనే నిర్వహిస్తామని, అటుపై మన్సిపాల్టీలు, నగర పంచాయితీలలో దశల వారీగా నిర్వహిస్తామన్నారు. ఆడిట్ అంటే వ్యాపారంలో ఉన్న మహిళలకు మరింత మెళుకువలు అందించడం, వారిని ప్రోత్స హించడం వంటివి ఉంటాయని వివరించారు.

# పంచాయతీల్లో ఆడిటింగ్‌కు పారదర్శక ప్రణాళిక

**విజయవాడ,జూలై15,ప్రభాతలవార్తప్రతినిధి:**గ్రామ పంచాయితీల్లో ఆడిట్ ఇక పక్కాగా నిర్వహించేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోంది. ఇప్పటి వరకు అస్తవ్యస్త విధానాల కారణంగా పంచాయితీల్లో నిధుల వ్యయం,ఆదాయంపై లెక్కాపత్రం ఉండటం లేదు. కార్యదర్శులు,ఉద్యోగుల్లోనూ జవాబుదారీ తనం కొరవడుతోంది. లోకల్ ఫండ్ ఆడిట్ అధికారులు కూడ తూతూమంత్రంగా ఆడిట్ నిర్వహిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవు తున్నాయి.ఇలాంటి పలు లోపాల నేపథ్యంలో పంచాయితీల్లో ఆదాయ,వ్యయాల్లో పారదర్శకత ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ నెల 11,12 తేదీల్లో ఇదే అంశంపై నిర్వహించిన రాష్ట్ర స్థాయి సదస్సులో పాల్గొన్న పంచాయితీరాజ్,లోకల్ ఫండ్ ఆడిట్,ఎకౌంట్స్ జనరల్ తదితర శాఖల అధికారులు,నిపుణులు చేసిన పలు సూచనల ఆధారంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.గ్రామ పంచాయితీ,మండల పరిషత్ కార్యాలయాల్లోనే పంచాయతీలకు సంబంధించిన ఆడిట్ నిర్వహించాలి. హోటళ్ళు, అతిథిగృహాల్లో నిర్వహించడానికి వీల్లేదు. ఆడిట్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా చేపట్టాలి. నిధుల దుర్వినియోగానికి కారకులైన వారిపై విధిగా చర్యలు సిఫార్సు చేయాలి.రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండేలా పంచాయితీ కార్యదర్శులు,సిబ్బందికి తగిన శిక్షణ ఇవ్వాలి. పంచాయితీలకు వచ్చే ఆదాయ,వ్యయంపై పక్కాగా రికార్డులు నిర్వహించకపోతే చర్యలు తప్పవన్న సంకేతాలు కార్యదర్శులకు పంపాలి. పంచాయితీల పనితీరుపైనా ఎప్పటికప్పుడు మండల,జిల్లా స్థాయిల్లో అధికారుల సమీక్షలు, క్షేత్రస్థాయి పరిశీలన విధిగా చేపట్టాలి.

# డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు జర్నలిస్టు హెల్త్ స్కీమ్ పొడిగింపు

## - సమాచార పౌర సంబంధాల శాఖ, సంచాలకులు హిమాన్షు శుక్ల

**విజయవాడ,జూలై15,ప్రభాతవార్తప్రతినిధి:** వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీమ్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ వైద్య ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంగళవారం జీవో యం.యస్ నెం. 77 ను జారీ చేసినట్లు సమాచార పౌర సంబంధాల శాఖ, సంచాలకులు హిమాన్షు శుక్ల ఒక ప్రకటనలో తెలిపారు. కావున రాష్ట్ర వ్యాప్తంగా అక్రిడిటేషన్లు అమలులో ఉన్న వర్కింగ్ జర్నలిస్టులందరూ ఈ పథకం ప్రీమియం క్రింద రూ. 1250/ సంబంధిత వెబ్ సైట్ ద్వారా ఈ క్రింద తెలిపిన పద్దుకు చెల్లించి లబ్ధి పొందవలసినదిగా సంచాలకులు తెలిపారు. హెడ్ ఆఫ్ అకౌంట్ 8342001200103001 001, డీడీవో కోడ్ 2703 0802 003 ప్రీమియం చెల్లించిన జర్నలిస్టులు ఒరిజినల్ చలానా, రెన్యూవల్ చేయించుకున్న రాష్ట్ర స్థాయి అక్రిడిటేషన్ జిరాక్స్ కాపీలను విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్, ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ లోని రెండవ ఫ్లోర్ లో ఉన్న సమాచార పౌర సంబంధాల శాఖ, సంచాలకుల కార్యాలయంలోనూ, జిల్లా స్థాయి జర్నలిస్టులు సంబంధిత జిల్లా కేంద్రాల్లోని సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో అందజేయాల్సిందిగా సంచాలకులు హిమాన్షు శుక్ల తెలిపారు. వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీం ప్రీమియం రూ. 2,500 కాగా ఇందులో జర్నలిస్టు వాటా రూ. 1,250, ప్రభుత్వం వాటా రూ. 1,250 అన్నారు. జర్నలిస్టు, భార్య/భర్త, పిల్లలు, జర్నలిస్టుపై ఆధారపడిన తల్లిదండ్రులకు ఈ స్కీమ్ వర్తిస్తుందన్నారు. ఈ స్కీమ్ లో భాగంగా ప్రభుత్వం కార్పస్ ఫండ్ ను నిర్వహిస్తూ జర్నలిస్టుల వైద్య ఖర్చులను డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు విధి విధానాలను అనుసరించి చెల్లిస్తుందన్నారు. జర్నలిస్టు హెల్త్ స్కీమ్ ద్వారా జర్నలిస్టులు, వారిపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులకు ఏదైనా అనారోగ్యం సంభవించిన ప్రతిసారి రూ. 2 లక్షల వరకు విలువ చేసే వైద్య సేవలు అందుతాయని, ఇలా సంవత్సర కాలంలో ఎన్నిసార్లైనా పరిమితులు లేకుండా ఈ సదుపాయాన్ని అందిస్తారని తెలిపారు. వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీమ్ ద్వారా జర్నలిస్టులకు ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ తరహాలో నగదు రహితంగా వైద్య సేవలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీమ్ ద్వారా పొందే వైద్య సేవల విషయంలో ఎలాంటి ఆదాయ పరిమితులు లేవని, అదే విధంగా నిర్దేశిత చికిత్సలకు సంబంధించి ఉచిత అవుట్ పేషెంట్ సేవలు కూడా పొందవచ్చని ఆయన వివరించారు. ఈ పథకానికి డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీగా, అదే విధంగా సమాచార పౌర సంబంధాల శాఖ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందని ఆయన పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కలిగి ఉన్న జర్నలిస్టులందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని హిమాన్షు శుక్ల ఆ ప్రకటనలో కోరారు.

# రాష్ట్రంలో 351 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు నాన్ అఫిషియల్ పర్సన్ ఇన్‌ఛార్జి (పిఐసి) కమిటీలు

**విజయవాడ,జూలై15,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో 351 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు (పిఎసిఎస్) నాన్ అఫిషియల్ పర్సన్ ఇన్ఛార్జి (పిఐసి) కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ఈ మేరకు వ్యవసాయశాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలు ఎన్నికలు జరిగే వరకూ లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకూ కొనసాగుతాయని పేర్కొన్నారు.

# 19న అక్టోబర్ నెల ఆర్జితసేవల టిక్కెట్లు విడుదల

**తిరుమల,జూలై 15ప్రభాతవార్తప్రతినిధి:** అఖిలాండకోటిబ్రహ్మాండనాయకుడు...ఆపదమొక్కలవాడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనాలకు సంబంధించి తిరుమల తిరుపతి దేవస్థానం రానున్న అక్టోబర్‌నెలకు సంబంధించి ఆన్‌లైన్ టిక్కెట్లు ఈనెల 19వతేదీ శనివారం విడుదల చేయనుంది. అక్టోబర్ నెలకోటాను 19వతేదీ ఉదయం 10గంటలకు విడుదల చేసేలా టిటిడి ఐటి విభాగం ఏర్పాట్లుచేసింది. ఆర్జిత సేవాటిక్కెట్లు ఎలక్ట్రానిక్ డిప్ కోసం 21వతేదీ సోమవారం ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టిక్కెట్లు పొందిన భక్తులు 21వతేదీ నుండి 23వతేదీ మధ్యాహ్నం 12గంటల లోపు లక్కీడిప్‌ద్వారా టిక్కెట్లు పొందిన భక్తులు నగదు చెల్లించి టిక్కెట్లు అందుకోవచ్చు. ఇక ఆర్జితసేవా కల్యాణం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకరణ సేవల టిక్కెట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ఈనెల 22వతేదీ ఉదయం 10గంటలకు విడుదల చేస్తారు. వర్చువల్ సేవల టిక్కెట్లు 22న మధ్యాహ్నం 3గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. అంగప్రదక్షిణ టోకెన్లను 23వతేదీ ఉదయం 10గంటలకు విడుదల చేస్తోంది. రోజువారీగా (శుక్రవారం తప్ప)750 టోకెన్లను ఆన్‌లైన్‌లోనే విడుదల చేస్తున్న విషయం విదితమే. ఇదిలా ఉండగా శ్రీవాణి టిక్కెట్లు ఆన్‌లైన్‌లో 23వతేదీ ఉదయం 11గంటలకు విడుదల చేస్తారు. 300 రూపాయలు ఎస్ఇడి టిక్కెట్లు కోటా 24వతేదీ ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. దివ్యాంగులు,

వృద్ధుల కోటా 23న మద్యాహ్నం 3గంటలకు, 24న గదుల కోటా విడుదలచేస్తారు.

25న శ్రీవారి సేవా కోటా విడుదలవుతుంది. భక్తులు ఆర్జితసేవలు,దర్శన టిక్కెట్లను ఆన్‌లైన్‌లో టిటిదేవస్థానమ్స్. ఎపి.జిఒవి.ఇన్ వెబ్‌సైట్‌లో మాత్రమే బుక్‌చేసుకోవాలని టిటిడి కోరింది.

# ఏసిబి వలలో నెల్లిమర్ల కమిషనర్

## రూ.15వేలు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన తారక్‌నాథ్



**నెల్లిమర్ల, (విజయనగరం జిల్లా) జూలై 15 ప్రభాతవార్త:** నెల్లిమర్ల నగర పంచాయతీ కమిషనర్ ఏ.తారక్‌నాథ్ మంగళవారం ఏసీబీకి చిక్కారు. పట్టణంలోని పద్మశాలివీధిలో నివసిస్తున్న ఓ వ్యక్తి వద్ద నుంచి ఇంటి నిర్మాణం నిమిత్తం ప్లాన్ అప్రూవల్ కోసం మున్సిపల్ కార్యాలయంలోని తన గదిలో రూ.15 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ రమ్య అందించిన వివరాలిలా ఉన్నాయి. నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని పద్మశాలివీధిలో నివశిస్తున్న బురిడి మహేష్ అదే వీధిలో ఇల్లు నిర్మించుకుంటున్నారు. సదరు ఇంటికి ప్లాన్ అప్రూవల్ నిమిత్తం ఇటీవల దరఖాస్తు చేసుకున్నారు. అయితే ప్లాన్ అప్రూవల్ కోసం నగర పంచాయతీ కమిషనర్ తారక్‌నాథ్ మహేష్ నుంచి రూ.20 వేలు లంచం డిమాండ్ చేశారు. రూ.15 వేలు నగదు రూపంలో, మిగిలిన రూ.5 వేలకు దివాన్ కాట్ బెడ్ ఇవ్వాలని కోరారు. ప్లాన్ కోసం అవసరమైన ఫీజు చెల్లించానని, లంచం ఇవ్వలేనని మహేష్ ప్రాధేయపడ్డారు. అయినా సరే కమిషనర్ అంగీకరించలేదు. దీంతో మహేష్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచన మేరకు మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో నగర పంచాయతీ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌కు వెళ్లిన మహేష్ రూ.15 వేలు అందజేశారు. లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ రమ్య ఆధ్వర్యంలో సిబ్బంది రెడ్ హ్యాండెడ్‌గా కమిషనర్ తారక్‌నాథ్‌ను పట్టుకున్నారు. కేసు నమోదు చేశామని, బుధవారం కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ తెలిపారు. నగర పంచాయతీ కమిషనర్ తారక్‌నాథ్‌పై మొదటి నుంచి అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణంలో నిర్మాణంలో ఉన్న ప్రతి భవనం వద్దకు వెళ్లి లంచాలు డిమాండ్ చేసినట్లు విమర్శలు గుప్పుమన్నాయి. ఇదే విషయాన్ని గత మూడు దఫాలుగా జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో సభ్యులు ప్రస్తావించారు. ఒకానొక సందర్భంలో బాధితులతోనే నేరుగా సమావేశాల్లో చెప్పించారు. అయినా సరే కమిషనర్ తీరులో ఏమాత్రం మార్పు రాలేదు. అంతా సవ్యంగా జరిగితే ఈ నెలాఖరుకు ఆయన ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఇంతలోనే ఏసీబీ అధికారులకు పట్టుబడటం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

# సిబ్బంది నిర్లక్ష్యంతోనే హిసార్ ఎక్స్‌ప్రెస్ మంటలు !

## - ఇంజిన్ వెనుక బోగీలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్



**తిరుపతి,జూలై 15ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి రైల్వేస్టేషన్ సమీపంలో ఔటర్‌ట్రాక్‌పై మంటల్లో పూర్తిగా తగలబడిన హిసార్ ఎక్స్‌ప్రెస్‌రైలు (04717) స్లీపర్‌బోగీలో విద్యుత్‌షార్టుసర్క్యూట్ కారణమని రైల్వేవిభాగం అధికారులు నిర్ధారించారు. ఈ ఘటన జరిగిన 24గంటల తరువాత గుంతకల్లునుండి వచ్చిన రైల్వేవిభాగం ఇంజనీరింగ్,ఎలక్ట్రికల్‌అధికారులు, ఆర్‌పిఎఫ్, జిఆర్‌పి అధికారులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తులో ఆ బోగీలో విద్యుత్ వైర్లు షార్టుకావడంతోనే మంటలు వ్యాపించాయని తేల్చారు. తిరుపతి రైల్వేస్టేషన్ ఉన్నతాధికారి కుప్పాల సత్య నారాయణ దీనిపై సమగ్రంగా రైల్వే అధికారులతో కలసి దర్యా ప్తులో ఈ ఉదంతమే కారణమని తేల్చారు. దీనివల్లే ఆ రైలు ఇంజిన్‌కు వెనుకనే ఉన్న బోగీ మంటల్లో పూర్తిగా కాలిపోయింది. రాజస్థాన్ హిసార్ నుండి సోమవారం ఉదయం 10.50 గంటలకు తిరుపతికి వచ్చిన ఈ రైలు షంటింగ్‌కోసం ముందుక ువెళ్ళి ఔటర్‌ట్రాక్ పట్టాలపై ఆగింది. దాదాపు రెండు గంటల ఉన్నఫళంగా రైలుబోగీలో మంటలు వ్యాపించడం స్థానికులు ,రైల్లో ఉన్న గార్డు గమనించి వెంటనే సమాచారం ఇవ్వడంతో మంటలను అదుపుచేయడంతో పెద్దప్రమాదం తప్పింది. అయితే రెండుగంటల ముందే ప్రయాణీకులు రైల్వేస్టేషన్‌లో దిగిపోయారు. వందలకిలో మీటర్ల దూరం ప్రయాణించిన ఈ రైలు వేగానికి తగ్గట్లు తిరుపతికి చేరిన తరువాత షంటింగ్‌యార్డుకు వెళ్ళాలి.

దీనికంటే ముందే రైలు ఔటర్‌ట్రాక్‌పై ఆగడంతో వేడితీవ్రత అధికంగా ఉండటంతో ఇలా జరిగిందని నిర్ధారణకు వచ్చారు.

# సుపరిపాలనలో తొలి అడుగుకు తెలుగు తమ్ముళ్లు వెనకడుగు

## పి.గన్నవరంలో అయోమయంలో పడ్డ టిడిపి శ్రేణులు..

**కోనసీమ బ్యూరో, జూలై 15, ప్రభాతవార్త..** రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయిన సందర్భంగా సాధించిన విజయాలు,అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల అభిప్రాయాలు, సూచనలు తెలుసుకునేందుకు తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి పి.గన్నవరం నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్లు వెనకడుగు వేస్తున్నారు. రాజకీయంగా ఎంతో చైతన్యం కలిగిన పి. గన్నవరం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలమైన కేడర్ తో ముందుకు వెళ్తోంది. టిడిపి అధిష్టానం ఆదేశాలను పాటిస్తూ ఏ పక్షంలో ఉన్నా (అధికార, ప్రతిపక్ష) పాటించడమే వారి విధి. 201924 వరకు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం చేపట్టిన ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను వ్యతిరేకించి పోరాడిన చరిత్ర పి.గన్నవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీది. రాష్ట్రంలో 2024లో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పి.గన్నవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీలో మండల కమిటీల నియామకం రూపంలో వర్గ పోరు బహిర్గతమయి,రెండు వర్గాలుగా చీలిపోయింది. నియోజవర్గంలోని అంబాజీపేట,అయినవిల్లి, మామిడికుదురు మండలాల్లో గ్రామ కమిటీల అధ్యక్ష, కార్యదర్శుల ఓట్ల రూపంలో మండల కమిటీలు ఎంపిక నిర్వహించి,పి.గన్నవరం మండల కమిటీ ఎంపికను వాయిదా వేసినట్లు తెలిసింది.ఈనెల రెండు నుండి ప్రారంభించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నియోజకవర్గంలో అట్టహాసంగా ప్రారంభించి మూడు రోజులు నిర్వహించి, నాల్గవ రోజు నుంచి తెలుగు తమ్ముళ్లు గ్రామాల్లో కనిపించకుండా పోయారు. నియోజవర్గ టిడిపి కన్వీనర్ గా వ్యవహరిస్తున్న రాజోలు నియోజకవర్గంనకు చెందిన నాయకుడి ప్రమేయం తమకక్కర్లేదని,పి.గన్నవరం నియోజవర్గంలో తెలుగుదేశం పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనకుండా ఆయనను కట్టడి చేసే వరకు తాము పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనమని ఒక వర్గం పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తే, కొత్తపేట నియోజకవర్గం చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడి ప్రమేయం పి.గన్నవరం నియోజకవర్గంలో ఉన్నంతవరకు తాము పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటామని మరో వర్గం పార్టీ అధిష్టానానికి ఫిర్యాదులు చేశారని తెలిసింది. తెలుగుదేశం పార్టీ చేపడుతున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించకుండా మూడు రోజుల్లోనే మూలన పెట్టేశారు. అధికారం లేనప్పుడు ఐక్యంగా ఉండి, అధికారం చేపట్టిన తర్వాత వర్గాలుగా విడిపోవడంతో కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు.

# రాజధాని అవసరాలకు కృష్ణానదిలో ఇసుక తవ్వకాలకు అనుమతి

**విజయవాడ,జూలై 15,ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతి నిర్మాణ అవసరాలకు ప్రకాశం బ్యారేజీకి ఎగువున కృష్ణా నదిలో పూడిక ఇసుకను తవ్వి తీసేందుకు (డీసిల్టేషన్)కు,దానికి రూ.286.20 కోట్లు వెచ్చించేందుకు సీఆర్‌డీఏకు ప్రభుత్వం పాలనాపరమైన అనుమతులిచ్చింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇసుక తవ్వకాలకు టెండరుల పిలిచే భాధ్యతను జలవనరుల శాఖకు...పర్యవేక్షణ భాధ్యతను సీఆర్‌డీఏకు అప్పగించింది. టెండర్ల ప్రక్రియ నిర్వహణకు సీఆర్‌డీఏ ఒక కమిటీని ఏర్పాటు చేస్తుంది. అన్ని రకాల అనుమతులతో పాటు నిబంధనలకు అనుగుణంగా ఇసుక త్వకాలు చేపట్టేందుకు సీఆర్‌డీఏకు పరిశ్రమల శాఖ అనుమతులు జారీ చేసింది.

# తిరుమల సమాచారం

## కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

### - మధ్యాహ్నం 12గంటలకు సర్వదర్శనం మొదలు



**తిరుమల,జూలై 15ప్రభాత వార్తప్రతి నిధి:** ఆపద మొక్కులవాడు ఏడు కొండల వేంకటేశ్వరస్వామి ఆల యంలో సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినం పురస్కరించు కుని మంగళవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరు మంజనం శాస్త్రోక్తంగా నిర్వ హించారు. ఆలయ అర్చకులు, అధికారులు మహాయజ్ఞంలా ఈ కార్యక్రమంలో పాల్గొని ఆలయం అంతటా సుగంధపరిమళ ద్రవ్యంతో శుద్ధి చేశారు. ఉదయం 6గంటల నుండి 11గంటల వరకు సాగిన ఈ మహాయజ్ఞంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ జె.శ్యామలరావు ,అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యులు పనబాకలక్ష్మి, భానుప్రకాశ్‌రెడ్డి, నరేష్‌కుమార్, శాంతారాం,సదాశివరావు, జంగాకృష్ణమూర్తి, జానకిదేవి,మహేందర్‌రెడ్డి, టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ అర్చకులు, ఉద్యోగులు పాల్గొని ఆలయంలోపల బంగారువాకిలి నుండి ఉప ఆలయాలు, మహద్వారం వరకు నీటితో శుభ్రంగా కడిగారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరిపసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం,గంధంపొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంద ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా సంప్రోక్షణ చేశారు. ఉదయం 11గంటలకు ప్రోటోకాల్ విఐపిలకు బ్రేక్ దర్శనం చేయించి నంతరం మధ్యాహ్నం 12గంటలకు సర్వదర్శనం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఈసందర్భంగా ఆలయంలో జరగాల్సిన అష్టదళపాదపద్మారాధన సేవ రద్దయ్యింది. ఏడాదిలో ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, ఉగాది ఆస్థానం, వైకుంఠ ఏకాదశికి ముందువచ్చే మంగళవారాల్లో నాలుగుసార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టడం ఆనవాయితీ. ఆలయంలో (నేడు)బుధవారం ఉదయం నుండి రాత్రి వరకు సాలకట్ల ఆణివార ఆస్థానం నిర్వహిస్తారు. ఆలయం లోపల ఆనందనిలయంలోని గరుడాళ్వార్‌సన్నిధిలో ఈ వేడుక జరిపిస్తారు. సాయంత్రం ఉభయదేవేరులతో కలసి మలయప్పస్వామి సువాసనల పుష్పపల్లకిపై ఊరేగుతారు.

## అలిపిరి పాదాలమండపంలో ఆలయ శుద్ధి




**తిరుమల,జూలై 15ప్రభాత వార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి అలిపిరి వద్ద ఉన్న పాదాలమండపం శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో వేడుకగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు. మంగళవారం ఉదయం పాదాలమండపంలోని ఆండాల్ అమ్మవారి(గోదాదేవి) సన్నిధి, పెరియాళ్వార్‌సన్నిధి, లక్ష్మీనారాయణస్వామి సన్నిధిలలో మూలవిరాట్టులకు వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచి సుంగధపరిమళ జలంతో ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. ఆ తరువాత స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ విఆర్ శాంతి, ఎఇఒ ఏ.భాస్కర్‌నారాయణచౌదరి, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

## భక్తులకు సౌకర్యాలపై ఛైర్మన్ నాయుడు ఆరా



**తిరుమల,జూలై 15ప్రభాతవార్తప్రతినిధి:** సుదూరప్రాంతాల నుండి తిరుమలకు వచ్చిన భక్తులకు కొండపై వసతి,అన్నప్రసాదాలు, దర్శనం వంటి సౌకర్యాలు ఎలా ఉన్నాయని సామాన్యభక్తులను తానూ ఓ భక్తుడిగా మారి ఛైర్మన్ బిఆర్‌నాయుడు సమాధానాలు రాబట్టారు .మంగళవారం సాయంత్రం సహస్రదీపాలంకారసేవ అనంతరం ఆయన బోర్డు సభ్యులు సనబాకలక్ష్మి, శాంతారాం, నరేష్, జానకిదేవిలతో కలసి ఆలయం ముందు,లడ్డూప్రసాద వితరణ శాల, అన్నదానంభవనం ప్రాంతాల్లో భక్తులతో మమేకమయ్యారు. వారిలో ఓ భక్తుడిగా ఇక్కడ సదుపాయాలు ఎలా ఉన్నాయి?తాగునీరు శుభ్రత, అన్నప్రసాదాలు రుచి, క్యూలైన్లలో సక్రమంగా అందుతున్నాయా అని భక్తులను అడిగి తెలుసుకున్నారు. తిరుమలలో మెరుగుపడిన సదుపాయాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంకా క్యూలైన్లలో సౌకర్యాలు బావున్నాయన్నారు.

## తిరుమల గురించి మాట్లాడేందుకు బండి సంజయ్ ఎవరు?

### తిరుపతిలో మాజీమంత్రి డాక్టర్ చింతా మోహన్




**తిరుపతి,జూలై 15ప్రభాత వార్తప్రతి నిధి:** హిందూ ధార్మికసంస్థ తిరుమల గురించి వ్యా ఖ్యలు చేయడానికి బండి సంజయ్ ఎవరని?తిరుమలలో మల మూత్రాలు శుభ్రం చేస్తున్న వారిలో అనేకమంది అన్యమతస్తు లేనని, వారంతా ప్రతి ఆదివారం చర్చికి వెళుతున్నారని కాంగ్రెస్ పార్టీ మాజీకేంద్ర మంత్రి డాక్టర్ చింతామోహన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అన్యమతం పేరుతో వారందరినీ తీసేసి, తెలంగాణా నుండి 5వేలమంది కార్మికులను తీసుకువచ్చి తిరుమలలో మరుగుదొడ్లు శుభ్రం చేయించగలవా?కడిగించగలవా అనే ఘాటైన ప్రశ్నలు గుప్పించారు. బిజెపి నాయకులకు అభివృద్ధి గురించి పట్టదా?వేరే మాటలు రావా, ఎప్పుడూ పదేపదే అన్యమతం అంటూ రచ్చచేస్తారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కూటికి లేక ఉద్యోగాలు లేక ప్రజలు ప్రాణాలు పోతున్నాయని, వారి గురించి పట్టించుకుని ఆలోచన చేయాలని కోరారు. తిరుమల ఆలయంలో అంటరానితనం స్పష్టం కనిపిస్తోందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నపుడు తిరుమల ఆలయంలో పేష్కార్, డిప్యూటీ ఇఒ పోస్టులు ఎస్సీలకు ఇచ్చామని అన్నారు. కూటమిప్రభుత్వ పాలనలో ఆలయంలో ఒక ఎస్సీ అధికారి కూడా లేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. బిసిలకు పెద్దపీట వేశామని చెబుతున్న టిడిపి టిటిడిలో ఎంతమంది బిసిలకు పెద్దపీట వేశారో జవాబుచెప్పాలని డిమాండ్ చేశారు. టిటిడిలో పనిచేసే అర్చకులకు ఒక్కొక్కరికి 5సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని గత సంవత్సరకాలంలో 36 సార్లు ఆందోళన చేసినా పట్టించుకోలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెంటనే జోక్యం చేసుకుని టిటిడి అధికారులు, ఉద్యోగులు, అర్చకులకు 5సెంట్లు అలిపిరి వద్ద ఇవ్వాలని చింతామోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం ఉదయం టిటిడి పరిపాలన భవనం వద్ద ఆయన కాంగ్రెస్‌పార్టీ నేతలు యార్లపల్లిగోపి, రవి,తేజోవతి, మునిశోభ, బాలగురవయ్య తదితరులతో కలసి నిరసన తెలిపారు.

# పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంకు వైద్యపరికరాల సరఫరాకు ఇ టెండర్

**తిరుమల,జూలై 15ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలోని పద్మావతిచిన్నపిల్లల హృద యాలయం ఆస్పత్రికి అవసరమైన వైద్య పరికరాలను సరఫరా చేయడానికి అర్హులనుండి ఈ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు టిటిడి తెలిపింది. జూలై 25వతేదీ సాయంత్రం 4.30గంటలకు టెక్నికల్ బిడ్ ఉంటుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రోడ్లు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
నెం. 5/TO/2025-2026 తేది: 11.07.2025
EE (R&B) డివిజన్, పెద్దాపురంవారు రిజిస్టర్డ్ క్లాస్ IV మరియు V మరియు ఆపై సివిల్ కాంట్రాక్టరుల నుండి రూ.57.60 లక్షల విలువ గల 6 పనులకు టెండర్‌లు కోరుతున్నారు. మరియు పై పనులకు టెండర్‌ల స్వీకరణకు చివరి తేది 02.08.2025 సా.4.00గం. వరకు. తదుపరి వివరాలకు www.eprocurement.gov.in వీక్షించండి. ఫోన్ నం: 9440818526.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, (R&B) డివిజన్, పెద్దాపురం.
DIPR.NO. 16999/CL/ADVT/1/1/2022-23 తేది: 15.07.2025

వార్త

ఒక పని అంటే గాని, లేదా దానివల్ల కలిగే ఫలితాలంటే గానీ భయపడి, ఆ పని చేయడాన్ని మానుకోవడం చాలా చిన్నతనం.

-మహాత్మాగాంధీ

# పేదలకు అందని ప్రభుత్వ వైద్యం?

సీ

జన్ మారినప్పుడల్లా విజృంభిస్తున్న దోమలు వాటి వల్ల ప్రబలే రోగాలతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది విలవిల్లాడుతున్నారు. విషజ్వరాలు ఏమీ కొత్తకాదు. వర్షాకాలం ఆరంభంతో పాత నీరుపోయి, కొత్తనీరు రావడంతో రోగాలు విజృంభిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాలతోసహా దేశంలోని అనేక ప్రాంతాల్లో ప్రజలను అతలాకుతలం చేస్తున్నాయి. ఈ యేడాది ఇప్పటికే విషజ్వరాల బారినపడి బీదా, బిక్కి, ధనిక, అని తేడా లేకుండా అల్లాడిపోతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు, ప్రభుత్వ దవాఖానాలన్నీ కిటకిటలాడిపోతున్నాయి. ఈ వ్యాధులు సోకిన లక్షిప్రసన్నుల సంగతి అలా ఉంచితే మధ్యతరగతి, మరీ ముఖ్యంగా రెక్కాడితే డొక్కాడని రోజూ కూలీలు, చిన్నాచితక వ్యాపారాలపై ఆధారపడి జీవనం సాగించేవారి పరిస్థితి దారుణంగా ఉంది. ఇక ఏనాడో కూకటివేళ్లతో పెకిలించామని చెప్పుకుంటున్న వ్యాధులు కూడా అక్కడక్కడ కన్పిస్తున్నాయి. పాతరోగాలు తిరిగి మొలకెత్తి విస్తరిస్తుండడం ఆందోళన కలిగిస్తున్నది. ముఖ్యంగా భారత్ ఎదుర్కొంటున్న ప్రధాన ఆరోగ్య సమస్యల్లో మలేరియా ఒకటిగా చెప్పొచ్చు. ఒకనాడు ఈ వ్యాధి సోకిందంటే ప్రాణాలు పోయినట్లేనని భయాందోళనలు చెందేవారు. 1947లో దాదాపు ఏడు న్నర కోట్ల మందికి ఈ వ్యాధి సోకగా సుమారు ఎనిమిదిన్నర లక్షల మందికిపైగా మరణించారు. ప్రధానంగా జూన్, సెప్టెంబరుల మధ్యనే ఈ వ్యాధి విస్తరించేది. ఆనాటి నుంచే చేస్తున్న పరిశోధనలు, నూతన మందులు, చికిత్స విధానంలో మార్పుల ఫలితంగా తగ్గుముఖం పట్టాయనే చెప్పొచ్చు. గత యేడాది రెండు లక్షల ఇరవై ఏడువేల మందికి ఈ వ్యాధి సోకగా మరణాలసంఖ్య కేవలం ఇరవైమూడుకు తగ్గించగలిగారు. కేంద్రప్రభుత్వం 2006లో 'జాతీయ వ్యూహాత్మక మలేరియా నిర్మూలన ప్రణాళిక' ద్వారా ఆ వ్యాధి వ్యాపిస్తున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు చేపట్టింది. ఒడిశా, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో ప్రత్యేక చికిత్స విధానాన్ని చేపట్టి వ్యాధి ఒకరి నుంచి మరొకరికి రాకుండా అడ్డుకట్ట వేయగలిగారు. నగరాలు, పట్టణాల్లో కొంతవరకు నియంత్రించగలుగుతున్నా ఏజెన్సీ ప్రాంతాల్లో పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. జనాభాలో ఎనిమిది శాతానికిపైగా ఉన్న గిరిజనుల్లో మలేరియా బారినపడుతున్న వారి సంఖ్య సగానికి కంటే ఎక్కువగా ఉండొచ్చని అంచనా. మెదడులో వ్యాపించే ప్రమాదకర పాల్సీపారం మలేరియా మృతుల్లో అరవైఐదు శాతానికి పైగా గిరిజనులే. అడవుల్లో, కొండ ప్రాంతాల్లో తేమ వాతావరణం దోమల వ్యాప్తికి కారణమవుతున్నది. ఛత్తీస్‌గడ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి తెలుగు రాష్ట్రాల్లోకి ప్రవేశిస్తున్న దోమల్లో ఇమ్యూనిటీ పెరగడంవల్ల వాడుతున్న మందులు వాటిని నియంత్రించలేకపోతున్నట్లు డాక్టర్లే అంగీకరిస్తున్నారు. అన్నింటికంటే ముఖ్యంగా పారిశుధ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలకుతిలోదకాలు ఇవ్వడం వల్లదోమలు పెద్దఎత్తున ఉత్పత్తికావడం, రకరకాల వ్యాధుల విస్తరణకు కారణమవుతున్నాయి. సిబ్బంది, నిధుల కొరతతోగ్రామీణ ప్రాంతాల్లో ప్రధానంగా ఏజెన్సీల్లో పరిస్థితి రోజురోజుకూ దారుణంగా తయారవుతున్నది. ఉన్న సిబ్బందిని కూడా ఆయా ప్రాంతాలకు పంపించి చికిత్స అందించడంలో పాలకులు విఫలమవుతున్నారనే చెప్పొచ్చు. భారత్‌ను మలేరియా రహితంగా మార్చాలనే లక్ష్యం నెరవేరాలంటే గ్రామీణరంగంలో వైద్యాన్ని మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉంది. ప్రత్యేక నిధులను కేటాయించి పారి శుధ్యాన్ని మెరుగుపర్చాలి. ఇక కొత్తరోగాల గురించిప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. డెంగ్యూ, చికెన్‌గున్యా, స్వైన్‌ఫ్లూ లాంటి వ్యాధులు విజృంభిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో చికెన్‌గున్యా వ్యాధి గ్రామీణులను గడగడలాడిస్తున్నది. ఒకటి, రెండు రోజులు కాదు, నెలల తరబడి ఈ వ్యాధిసోకిన వారు మంచాన్ని వదలలేకపోతున్నారు. కొందరైతే రోజువారీ కాలకృత్యాలకు కూడా మరొకరి సహాయం లేకుండా చేసుకోలేకపోతున్నారు. ఈ వ్యాధివల్ల ప్రాణం పోకపోవచ్చు కానీ ఈ వ్యాధి ఇతర వ్యాధులకు తోడైతే ప్రాణాపాయం కలుగవచ్చునని వైద్యనిపుణుల అభిప్రాయం. ఇక డెంగ్యూ వ్యాధి ఇంకా వదలిపెట్టడం లేదు. ఇప్పటికీ డెంగ్యూతో మరణించేవారి సంఖ్య పెరుగుతూనే ఉన్నది. అన్నింటికంటే ముఖ్యంగా రోగ నిర్ధారణ ఒక మిథ్యగా మారుతున్నది. మామూలు జ్వరం లేక, డెంగ్యూనా, మరేదన్నా అనే విషయంకోసం పరీక్షలు చేయడంలోనే జాప్యం జరిగితే వ్యాధి ముదిరి ప్రాణాలకు ముప్పు తెస్తున్నది. ముఖ్యంగా వైద్యసహాయానికి ఆమడదూరంలో ఉండే మారుమూల ప్రాంతాల్లోని ప్రజల పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో ఊహించుకోవచ్చు. స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాల దాటినా నేటికీ కనీస ప్రాథమిక అవసరాలు తీర్చడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమ వుతున్నాయి. రాజ్యాంగం ప్రకారం ప్రజల జీవన ప్రమాణాలను పెంచి ఆరోగ్యాన్ని మెరుగుపరచడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యతల్లో ఒకటి. ఆరోగ్యం అనేది ప్రజల ప్రాథమిక హక్కు. దాన్ని ప్రజలకు సమకూర్చడంలో ప్రభుత్వాలు ఏమేరకు సఫలం అవుతున్నాయో చెప్పక్కర్లేదు. యేటా వేలాది కోట్ల రూపాయలు ఖర్చుపెడుతూ ఎన్నో సంస్కరణలు చేస్తూ ప్రభుత్వ వైద్యరంగం పురోగమిస్తుందని చెప్పుకుంటుంటే కేవలం కొందరి నిర్వాహకం వల్ల ప్రభుత్వ ఆస్పత్రుల పట్ల ప్రజల్లో నమ్మకం అంతకంత సన్నగిల్లుతున్నది. మొన్న కరోనా విజృంభణ సమయంలో దేశంలో వైద్యరంగం డొల్లతనం బయటపడింది. కనీసం ప్రాణవాయువు అందించలేకపోవడంతో ఎందరో ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఇప్పటికైనా పాలకులు ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతీసుకొని అవసరమైన చర్యలు చేపట్టాలి.

> లోకులు తొందరగా నిందిస్తారు. అంతే త్వరగా అభినందిస్తారు కూడా. అందువల్ల ఇతరులు నిన్ను గురించి అనుకునే మాటలకు అంత విలువ ఇవ్వొద్దు.
>
> రామకృష్ణ పరమహంస

> ప్రతి మనిషిలోనూ ఆవరించి ఉన్న పిశాచం స్వార్థం. స్వార్థంలో ప్రతి అంశం, ప్రతి భాగం పిశాచమే.
>
> స్వామి వివేకానంద

## ప్రజావాక్కు



### జనాభాను పెంచండి

ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి యువతరాన్ని ఎక్కువ మంది పిల్లలను కనమని సందేశం ఇచ్చారు. కొంతకాలం క్రితం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతులను చూసి వరి పంట పండించవద్దని హెచ్చరించారు. పై మూడు అంశాల్ని విడివిడిగా పరిశీలిస్తే విజయవాడలో గవర్నమెంట్‌హాస్పిటల్ పనిచేస్తున్న యువగైనకాలజిస్ట్ ముఖ్యమంత్రి గారితో ముఖాముఖిలో ఈ విషయంపై నిలదీశారు. ఉపాధి అవకాశాలతో తక్కువగా ఉన్న ఈ రోజుల్లో ఎక్కువమంది పిల్లల్ని కంటే ఎవరు పెంచుతారని ఆమె అడిగారు? వరి పంట పండిం చవద్దని, పొగాకు పత్తివంటి వ్యాపార పంటలను పండించ మనిపిలుపునిస్తూ అమరావతి రాజధాని పేరు పెట్టి కొన్ని వేల ఎకరాలు కాంక్రీట్ జంగిల్ చేయాలని చూస్తున్నారు.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### ఉపాధ్యాయులను వేధించవద్దు

మెగా పిటిఎంను జూలై 10వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అందరూ ఉపాధ్యాయులు తమకు శక్తి మేరకు విద్యార్థులు, తల్లిదండ్రులు, దాతలు, ప్రజాప్రతినిధులు, సహకారంతో విజయవంతం చేశారు. ఇప్పుడు అప్లోడ్ చేసిన ఫోటోలు వీడియోలు బాగోలేదు మరలసరిచూసి బాగున్నవి అప్లోడ్ చేయండి అని చెప్పడం సరికాదు. ఈ కార్యక్రమాలు నిర్వహించిన సందర్భంలోనే విద్యాశాఖ వారు మంచి సామర్థ్యం ఉన్న కెమెరాతో కెమెరామెన్ కూడా నియామకం చేస్తే బాగుండేది. ఉపాధ్యాయులు తమ శక్తి మేరకుతాము తీయించిన ఫోటోలు అప్లోడ్‌చేశారు. ఫోటోలు బాగో లేకపోతే రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయానికి వెళ్లి ఇవ్వాలి. సంజాయిషీలు తెలపాలి అనడం సరైనది కాదు.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

### ఎంజిఎం ఆసుపత్రిని పట్టించుకోండి

ఉత్తర తెలంగాణ జిల్లాలోవరంగల్ కేంద్రంగా ఉన్న ఎంజిఎం ఆసుపత్రికి నిత్యం వేలాది మంది వివిధ జబ్బులతో బాధపడుతూ రోగులురావడం జరుగుతుంది. కొన్ని విభాగాలలో డాక్టర్లు అందుబాటులో లేకపోవడం వల్లా వివిధ రోగాలతో బాధపడేవారు ఇబ్బందులు పడుతూ వున్నారు. ప్రభుత్వంస్పందించి డాక్టర్స్ సమయపాలన పాటించేలా, రోగులకు మంచి వైద్యం అందించేలా కృషి చేయాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### అమెరికా దుందుడుకు చర్య

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 2024లో మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ నినాదంతో భారీ విజయం సాధించి గద్దెనెక్కారు. ట్రంప్ అధ్యక్ష పదవి చేపట్టిన తరువాత ప్రపంచ దేశాల వాణిజ్య వ్యవహారాల విషయంలో అనుసరిస్తున్న తీరు వివాద స్పదమవుతోంది. ఆయా దేశాలపై విధిస్తున్న సుంకాల విషయంలో గడువు తేదీలుపెట్టడం, అమెరికా ఎగుమతి చేసే వాటిపై అధిక సుంకాలు విధిస్తూ, అమెరికా దిగుమతి చేసుకునే వాటిపై సుంకాలను తగ్గించుకునే విధంగా ప్రపంచ దేశాలను ఒత్తిడి చేయటం దుందుడుకు చర్య. 'రాను రాను రాజు గుఱ్ఱం గాడిద'గా మారిన చందంగా అమెరికా వ్యవహారశైలి ఉంటోంది. గతంలోనిఅమెరికా ప్రభుత్వాలు ప్రపంచదేశాలకు నిధులను మంజూరు చేసి ప్రపంచ దేశాలను తన గుప్పెట్లో పెట్టుకునేది. ఇప్పుడు, అప్పటి పరిస్థితులు లేవు. అన్ని దేశాలు కొద్దో గొప్పో అభివృద్ధి చెందాయి. ఆ కారణం చేత ప్రపంచ దేశాలపై సుంకాలు అధికంచేస్తోంది. ప్రతిదేశానికి వాణిజ్యపరమైన కొన్ని ప్రణాళికలు ఉంటాయి. ప్రపంచంలో అమెరికా మాత్రమే దేశం కాదు. అన్ని దేశాలు సమానంగా మనుగడ సాగించే వీలు ఉంటుంది.

-కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

### అందని యూరియా.. సాగు సాగేదెట్లా?

వానాకాలం మొదలయ్యి ఇప్పటికే నెలన్నర దాటింది. ఇప్పటికే లోటు వర్షాపాతంతో బాధపడుతున్న రైతన్నలకు యూరియా కరవు దిగులును మిగులుస్తుంది. దాన్ని అదనుగా తీసుకొని దళారి వ్యాపారులు నల్ల మార్కెట్‌కు తెరతీశారు. దీనివల్ల రైతు మరింత ఇబ్బందుల పాలయ్యే పరిస్థితి ఉంది. ప్రభుత్వం స్పందించి ఒక ఐఎస్ ఆఫీసర్‌ను నోడల్ ఆఫీసర్‌గా పెట్టి ఎక్కడికక్కడ పరిస్థితిని చక్కదిద్దాలి. లేకపోతే రైతులు మరింత నష్టపోయే ప్రమాదం పొంచి ఉంది.

- భారత అవినాష్, జనగామ

### తెలుగు, హిందీ, టీచింగ్‌పై నిర్లక్ష్యం

ప్రతి విద్యా సంస్థలలో, గురుకులాల్లో తెలంగాణ రాష్ట్ర మాతృ భాష అయిన తెలుగు, జాతీయ మాతృ భాష అయిన హిందీ భాషా నిర్లక్ష్యంచేయడం జరుగుతుంది. కాబట్టి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున 5వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుకుంటున్నవిద్యార్థులకు తెలుగు, హిందీ భాషలలో అక్షరాలు చదవడం రాయడం రావడం లేదు. కనీసం అక్షర జ్ఞానం లేని విద్యార్థులు ఉంటున్నారు. పార్ట్ టైం జాబ్ టీచర్స్ సమయ పాలన పాటించడం లేదు.


-రాపాక రవీందర్, జనగాం

# రాజకీయ నాయకులకూ 'విరమణ' అవసరమే!

**ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలు ఏ ఉద్దేశంతో చేసినవో గాని మొత్తానికి అన్ని రాజకీయ పార్టీలో ఈ అంశం పెద్ద రాజకీయ దుమారమే లేపిందనే చర్చ జోరుగా సాగుతుంది. రాజ్యాంగపరంగా రాజకీయాల్లో నాయకులకు రిటైర్మెంట్ వయసుకు సంబంధించిన అంశం ఎంతవరకు సాధ్యం అన్న విషయాన్ని పక్కన పెడితే, వయసు పైబడిపోతున్న కొందరు చివరి వరకు రాజకీయాల్లో అలాగే కొనసాగుతూ ఉండడం, ఆధునిక రాజకీయ వ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రూపాంతరం చెందిన నేటితరం యువ రాజకీయ నాయకత్వానికి కొన్ని సందర్భాల్లో తప్పితే చాలావరకు రాజకీయాల్లో మెరుగైన అవకాశాలు రాకపోవడానికి ఒక కారణం కావచ్చు అనే సంశయం కలగక మానదు. ఏదేమైనప్పటికీ దేశ రాజకీయ వ్యవస్థలో అన్ని రాజకీయ పార్టీలలో వయసులో పెద్దవారై రాజకీయాల్లో విశేష అనుభవం కలిగిన నాయకులు ఈతరం నాయకులకు మార్గదర్శకులుగా ఉంటూ, మంచి ఆలోచన వివేచన నిర్ణయాత్మక ధోరణిగల యువ నాయకత్వానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందనే వాదనలు సమాజంలో వినిపిస్తుండడం గమనార్హం.**

దాడిశెట్టి శ్యామ్ కుమార్

ఇటీవల ఒక సమావేశంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ అధినేత మోహన్ భగవత్ మాట్లాడుతూ రాజకీయాల్లో డెబ్భై ఐదు సంవత్సరాలు వయసు పైబడిన నాయకులు స్వచ్ఛందంగా హుందాతనంగా రాజకీయాల నుండి తప్పుకోవాలన్న సూచన, రాజకీయాలలో కొత్తవారికి ప్రాధాన్యత ఇవ్వాలన్న భావనకు దారితీస్తుందనే భిన్న అభిప్రాయాలు దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీల్లో సంచలనాలు రేపుతున్నాయి. అయితే రాజకీయాల్లో స్వచ్ఛంద విరమణ ప్రామాణికం డెబ్భైఐదు ఏళ్ల వయస్సు తర్వాతే ఎందుకని ఆర్‌ఎస్‌ఎస్ అధినేత వ్యాఖ్యలు ఉన్నాయన్న అంశంపై రాజకీయాల్లో విభిన్న వాదనలు తెరపైకి వస్తున్నాయి. ఈ క్రమంలో అసలు రాజకీయంలో వయస్సు పైబడిన వారికి రాజకీయాల నుండి నిష్క్రమణ ఎందుకు ఉండకూడదు అనే చర్చ మరోవైపు కొనసాగుతుంది. రాజ్యాంగ ప్రకారం ఎమ్మెల్యే, ఎంపీ కావాలన్నా ఒక ప్రత్యేకమైన వయసు పరిమితి నిర్ధారించిన భారత రాజ్యాంగం మరి రాజకీయాల నుండి తప్పుకోవడానికి రాజకీయ నాయకులకి ఏ వయసు వరకు పరిమితం కావాలని సూచించిన దాఖలాలు ఉన్నాయా లేవా అనే అంశాన్ని పక్కన పెడితే, రాజకీయ నాయకులు డెబ్భై ఐదు సంవత్సరాల జీవిత గమనంలో ప్రజల చేత ఎన్నుకోబడి ప్రజల సమస్యలకు స్వయంగా తీసుకునే నిర్ణయాలు సమస్య పరిష్కారానికి ఏ మేరకు ప్రభావితం చేయగలరనే సంశయం కొందరిలోనైన లేకపోలేదు. డెబ్భై ఐదు ఏళ్లు పూర్తయినా మనసు స్థిరంగా ఉన్నా, వయసు పైబడుతుంటే చాలావరకు శరీరం అనుకున్న స్థాయిలో సహకరించక పోవడం సహజం. అలాంటి పరిస్థితుల్లో కొత్త తరం యువ నాయకత్వంపై తప్పనిసరిగా దృష్టి సారించాల్సిన పరిస్థితులు ప్రత్యామ్నాయంగా అత్యవసరమవుతాయని అర్థం చేసుకోగల మనస్తత్వం అన్ని పార్టీలోని రాజకీయ నాయకులలో ఉండాల్సిందేమో. ప్రస్తుత ఆధునిక సాంకేతిక యుగంలో అనేక సంవత్సరాలు అనుభవం ఉన్న రాజకీయ నాయకత్వం కొత్త తరం యువ నాయకత్వానికి ప్రతిబింబంవలె గోచరిస్తూ, కొత్త తరం నాయకత్వానికి మార్గదర్శకులుగా ఉండి యువ నాయకత్వాన్ని సరేన దిశానిర్దేశంలోముందుకు నడిపించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందనే భావన అవకాశాలు రావటం లేదన్న కొత్తతరం యువ రాజకీయ నాయకులలో కొంతైన ఉంటుందని భావించే వారు లేకపోలేదు. ప్రస్తుతం దేశంలో వచ్చే ఎన్నికల వరకు అనేక రాజకీయ పార్టీలలో నాయకులు చాలావరకు పది పదులు దాటిన



వయసున్నవారే అధికంగా ఉండడం విశేషం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగస్తులకు పదవి విరమణ వయసు ఉన్నట్ల రాజకీయాల్లో కూడా పదవి విరమణ అనేది సాధ్యమవుతుందా కాదా అనే చర్చ సమాజంలో జోరుగా సాగుతుంది. నిజానికి గత ప్రభుత్వ ఉద్యోగులకు పదవి విరమణ పెన్షన్ విధానం ఉన్నట్లు ఎమ్మెల్యే, ఎంపీలకు కాలపరిమితితోపాటు వారి హోదాలను బట్టి నెలనెలా జీతాలు ఉంటాయి. తిరిగి వారు ఎన్నిక కాక పోయినా జీవితాంతం వారికి ప్రత్యేక పెన్షన్‌తో పాటు అనేక సదుపాయాలు ఉంటాయి. అలాంటప్పుడు రిటర్మెంట్ వయసు ఎందుకు ఉండకూడదు అనే సందేహం సమా జంలో లేకపోలేదు. రాజకీయ నాయకుల రిటైర్మెంట్ వయసు గురించి మోహన్ భగవత్ చేసిన సూచనలు ఏవిధంగా ఉన్నప్పటికీ, రాజకీయ నాయకులకు స్వచ్ఛంద రాజకీయ విరమణ విషయంలో అవసరమైతేతప్ప వ్యక్తి గతంగా రాజకీయాల నుంచి తప్పుకోవడానికి అవకాశం ఉంటుందేమో కానీ, రాజకీయంలోకి పోయిన తర్వాత ప్రజలు ఎన్నుకున్నంత కాలం నాయకులు రాజకీయాల్లో కొనసాగుతూ వస్తుండడం దేశ చరిత్రలో ఆనవాయితీగా వస్తూనే ఉంది. కాని మితిమీరిన వయస్సు ఎవరైనా సరే ఏ వృత్తిలోనైనా ఎల్లప్పుడూ అనుకున్న పనులు చేయుటకు శరీరం సహకరించదనే విభిన్న అభిప్రాయాలు సమాజంలో లేకపోలేదు. అధిక వయసులో ఉన్నవారు దేశ రాజకీయాల్లో ప్రాధాన్యత గల పదవుల్లో ఉన్నప్పుడు దేశ అంతర్జాతీయ విషయాల్లో సమర్థవంతమైన భావ వ్యక్తికరణ సరియైన మూర్తిమత్వాన్ని ప్రదర్శించాల్సి వచ్చినప్పుడు రాజకీయఅనుభవం ఒక మహా ఆయుధంగా కొన్ని సందర్భాల్లో ఉపయుక్తమైన, మరి కొన్ని సందర్భాల్లో అన్ని విధాల అర్హత కలిగి దేశ రాజకీయాల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచే యువనాయకత్వం కూడా అవసరమనే వాదనలు తెరపైకి రాకమానవు. ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలు ఏ ఉద్దేశంతో చేసినవో గాని మొత్తానికి అన్ని రాజకీయ పార్టీలో ఈ అంశం పెద్ద రాజకీయ దుమారమే లేపిందనే చర్చ జోరుగా సాగుతుంది. రాజ్యాంగపరంగా రాజకీయాల్లో నాయకులకు రిటైర్మెంట్ వయసుకు సంబంధించిన అంశం ఎంతవరకు సాధ్యం అన్న విషయాన్ని పక్కన పెడితే, వయసు పైబడిపోతున్న కొందరు చివరి వరకు రాజకీయాల్లో అలాగే కొనసాగుతూ ఉండడం, ఆధునిక రాజకీయ వ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రూపాంతరం చెందిన నేటితరం యువ రాజకీయ నాయకత్వానికి కొన్ని సందర్భాల్లో తప్పితే చాలావరకు రాజకీయాల్లో మెరుగైన అవకాశాలు రాకపోవడానికి ఒక కారణం కావచ్చు అనే సంశయం కలగక మానదు. ఏదేమైనప్పటికీ దేశ రాజకీయ వ్యవస్థలో అన్ని రాజకీయ పార్టీలలో వయసులో పెద్దవారై రాజకీయాల్లో విశేష అనుభవం కలిగిన నాయకులు ఈతరం నాయకులకు మార్గదర్శకులుగా ఉంటూ, మంచి ఆలోచన వివేచన నిర్ణయాత్మక ధోరణిగల యువ నాయకత్వానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందనే వాదనలు సమాజంలో వినిపిస్తుండడం గమనార్హం. ●

# స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ అమలు సాధ్యమేనా?

యం.అర్జున్

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న నిర్ణయం రాజకీయ, సామాజిక, చట్టపరమైన చర్చలకు దారి తీసింది. ఈ నిర్ణయం కేంద్రరాష్ట్ర సంబంధాలు, రాజ్యాంగ సవరణలు, న్యాయ సమీక్షలు, కులగణన ద్వారా సేకరించిన గణాంకాల వివరాలతో ముడిపడి ఉంది. రిజర్వేషన్లను 50 శాతానికి పరిమితం చేసే తీర్పులు ఉన్నందున ఏదైనా రాష్ట్రం పరిమితికి మించి రిజర్వేషన్లు అమలు చేసే ప్రయత్నం చేసినపుడు అవి న్యాయ సమీక్షకు వెళ్లే అవకాశం ఉంటుంది. అయితే, ఈ పరిమితిని అధిగమించేందుకు కాంగ్రెస్ సర్కార్ ఆర్డినెన్స్ జారీ చేయాలని నిర్ణయించినట్లు వార్తలు వస్తున్నాయి. ప్రభుత్వం తరుపున కేవియేట్ పిటిషన్ వేసినా రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధంగా ఉందంటూ ఆశావహ అభ్యర్థులు ఈ నిర్ణయంపై హైకోర్టు లేదా సుప్రీం కోర్టుకు వెళ్ళినపుడు న్యాయ సమీక్షకు గురయ్యే అవకాశం లేకపోలేదు. రాజ్యాంగ సవరణ ద్వారా 9వ షెడ్యూల్‌లో చేర్చడం ద్వారా మాత్రమే ఈ రిజర్వేషన్‌కు చట్టబద్ధ రక్షణ లభిస్తుందని న్యాయ నిపుణులు సూచిస్తున్నారు. 2024లో నిర్వహించిన కులగణన ఈ రిజర్వేషన్ పెంపులో కీలక పాత్ర పోషించనుంది. ఈగణన ప్రకారం, తెలంగాణ జనాభా 3.70 కోట్లుగా, బిసిలు 56.33 శాతంగా నమోదైంది. ఇందులో ముస్లింలు 10.08 శాతం, హిందువులు 46.25 శాతం ఉన్నారు. ఎస్సీ కేటగిరి 17.43.శాతం, షెడ్యూల్డ్ ట్రైబ్స్ (ఎస్టీ) 10.45 శాతం, ఓపెన్ కేటగిరీ 15.79శాతం, ముస్లింలు 2.48 శాతం ఉన్నారు. మొత్తం ముస్లింజనాభా 12.56 శాతం ఉన్నారు. ఈ సర్వేలో 3.54 కోట్ల మంది పాల్గొన్నారని మరో 16 లక్షల మంది సర్వేకు దూరంగా ఉన్నారని మొత్తం రాష్ట్ర జనాభా 3.70 కోట్లని ప్రభుత్వం తెలిపింది. ఈ గణాంకాలపై వివిధ కుల సంఘాలు సందేహాలు వ్యక్తం చేస్తున్నాయి. 2014లో చేసిన సమగ్ర కుటుంబ సర్వేలో ముస్లింలను బీసీల్లో కలిపి లెక్కించారా, లేదా అన్నదానిపై స్పష్టత లేదు. 2001-2011 దశాబ్దవృద్ధి రేటును, రాష్ట్రంలో ఉన్న ఆధార్ కార్డులు, ఓటర్ కార్డుల్ని పరిగణలోకి తీసుకున్నా రాష్ట్ర జనాభా నాలుగు కోట్లకు పైగా ఉంటుందన్నది వారి వాదన. 2011 జనగణన ప్రకారం తెలంగాణ జనాభా 3.50 కోట్లు, 2014 సమగ్ర కుటుంబ సర్వేప్రకారం 3.63 కోట్లుగా ఉంది. అంటే దాదాపు మూడు



న్నర ఏళ్లలో 13 లక్షల వరకు జనాభా పెరిగింది. కానీ, 2024 రాష్ట్ర జనాభా 3.70 కోట్లుగా తెలిపారు. 2014 నుంచి 2024 వరకు పదేళ్లలో కేవలం 7లక్షల జనాభా పెరిగినట్లు ఈ సర్వేద్వారా తెలుస్తోంది. ఇక్కడే పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ అంశం ఒకవేళన్యాయ సమీక్షకు వెళ్తే న్యాయస్థానాల్లో ఈ డేటా సమర్పించినప్పుడు, ఈ సర్వే విశ్వసనీయతపై ప్రశ్నలు తలెత్తే అవకాశం లేకపోలేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 2025 మార్చి 17న తెలంగాణ అసెంబ్లీ బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్‌ను 23 శాతం నుంచి 42 శాతానికి పెంచే బిల్లులను ఆమోదించింది. ఈ బిల్లు 50 శాతం పరిమితిని మించడం వల్ల, కేంద్రఆమోదం, రాజ్యాంగ సవరణ అవసరం. ఆర్డినెన్స్ ద్వారా రిజర్వేషన్ అమలు చేయడం న్యాయస్థానాల్లో నిలదొక్కుకోవడం కష్టమని ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీతో పాటు పలు కుల సంఘాల నేతలు అధికార కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు చేస్తున్నారు. సుప్రీం కోర్టు 1992 ఇంద్రా సాహ్నీకేసులో రిజర్వేషన్‌ను 50శాతంగా పరిమితం చేసింది. అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే ఈ పరిమితిని మించవచ్చని, దీనికి శాస్త్రీయమైన గణాంకాలు అవసరమని తీర్పును ఇచ్చింది. వివిధ రాష్ట్రాల్లో రిజర్వేషన్ పరిమితిని మించినప్పుడు న్యాయస్థానాలు జోక్యంచేసుకున్న సందర్భాలు చాలానే ఉన్నాయి. 2021లో మహారాష్ట్రలో మరాఠా రిజర్వేషన్ 50 శాతం పరిమితిని మించడంతో సుప్రీంకోర్టు దానిని రద్దుచేసింది. అసాధారణ పరిస్థితులను రుజువు చేయడంలో విఫలమైందని తీర్పు ఇచ్చింది. 2024లో బీహార్‌లో65శాతం రిజర్వేషన్‌ను పాట్నా హైకోర్టు రద్దు చేసింది. కులగణన డేటా సమర్థనీయం కాదని పేర్కొంది. తమిళనాడు 69శాతం రిజర్వేషన్‌ను 1994లో 9వ షెడ్యూల్‌లో చేర్చడం ద్వారా చట్టబద్ధ రక్షణ పొందింది. ఇదే విధమైన రాజ్యాంగ రక్షణ కల్పించాలని బిసి కుల సంఘాల నేతలు అభిప్రాయపడుతున్నారు. లేకుంటే గతంలో వెలువడిన తీర్పుల వల్ల తెలంగాణలో 42 శాతం రిజర్వేషన్ అమలు న్యాయస్థానాల్లో నిలదొక్కుకోవడం కష్టమని వాపోతున్నారు. కేంద్రం 2026లో జనగణనతో పాటు కులగణన చేపట్టనుంది. తెలంగాణ కులగణన గణాంకాలు, కేంద్రం సేకరించే డేటాతో సరితూగకుంటే, రిజర్వేషన్ అమలు సంక్లిష్టమవుతుంది. కేంద్ర ఆమోదం లేకుండా రాష్ట్రం ఏకపక్షంగా చేసే ప్రయత్నాలు చట్టపరమైన సమస్యలను తెచ్చిపెడతాయి. రాష్ట్రం తన డేటాను కేంద్రానికి సమర్పించి, 9వ షెడ్యూల్‌లో చేర్చడానికి ప్రయత్నిస్తున్నప్పటికీ, రాజకీయ ఒత్తిళ్లు, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల్లో వేర్వేరు పార్టీలు అధికారంలో ఉన్నపుడు ఈ ప్రక్రియను ఆలస్యం అయ్యే అవకాశం ఉంటుంది. రాజ్యాంగ సవరణ ద్వారా 9వ షెడ్యూల్‌లో చేర్చడం లేదా న్యాయ సమీక్షకు వెళ్ళినపుడు శాస్త్రీయమైన గణాంకాల్ని సమర్పించడం ద్వారా ఈ రిజర్వేషన్ చట్టబద్ధమైన రక్షణ పొందే అవకాశం ఉంటుంది. ●

# హస్త భూషణమా! మస్తక వ్యసనమా?



మేకిరి దామోదర్

ఆధునిక సమాజంలోని మనుషులు వివిధ రకాల భావజాలాలతో ఉంటారు. అలా మితవాదులు, అతివాదులు, హేతువాదులు వీరంతా వారివారి వాదాలను దృఢంగా నమ్ముతారు. కొన్నిసార్లు వారి వాదాలను పక్కనపెట్టి అందరికీ సమ్మతమైన మానవతావాద దృక్కోణంలో చూస్తారు. పూర్వకాలంలో పురాణాల్లో రాముడు కోదండపాణి ధారి, కృష్ణుడు చక్రధారి మరి ఆధునిక యుగంలో మనమంతా స్మార్ట్‌ఫోన్ ధారులం. పైన చెప్పిన వారి వాదాలకైనా, ఆయుధాలకైనా విరామం ఉంటుందేమో గాని విశ్వమానవాళి స్మార్ట్‌ఫోన్‌కు బానిసై నిర్విరామంగా అదే పనిగా చూస్తూ, అందులోనే మునిగిపోతున్నారు. వారి విలువైన కాలాన్ని వృధాగా గడిపేస్తున్నారు. ఎప్పుడో ముసలితనంలో మనిషికి 'చాదస్తం' అనే 'మూడో హస్తం' మొలుస్తుందంటారు. కానీ నేటి ఆధునిక టెక్నాలజీ యుగంలో చిన్నతనంలోనే స్మార్ట్‌ఫోన్ అరచేతిని ఆక్రమించింది. పుస్తకం 'హస్త భూషణం' అనేది పాత మాట, స్మార్ట్‌ఫోనే 'హస్తభూషణం' అనేది నేటిపాటగా మారింది. పొద్దస్తమానం ఆన్‌లైన్‌లో ఉంటారు. రింగ్‌రింగో అంటూ మ్రోగుతోంది. డ్రగ్స్, గంజాయి, మద్యం ఇవే కాదు డిజిటల్ రూపంలోనూ వ్యసనం యువతను, పిల్లల్ని వెంటాడుతోంది. వారు సెల్‌ఫోన్ వదల్లేకపోతున్నారు. చిన్నపిల్లలు అయితే మొబైల్ ఇస్తేనేతింటాం, చెప్పింది చేస్తామంటూ మారం చేస్తున్నారు. తల్లిదండ్రులు కూడా వారిని బుజ్జగించే క్రమంలో పిల్లల చేతిలో మొబైల్ పెట్టేస్తున్నారు. దీంతో ఆడుతూ పాడుతూ గడపాల్సిన బాల్యం స్మార్ట్‌ఫోన్ చెరలో బందీ అవుతోంది. పిల్లలు వారికి తెలియకుండా ఆవలలో చిక్కుకుంటున్నారు. వారించే ప్రయత్నం చేస్తే తల్లిదండ్రులని కూడా చూడకుండా క్రూరంగా దాడులకు తెగబడుతున్నారు. ఏ అలవాటైనా వ్యసనంగా మారినప్పుడు ఎవరైనా నిరోధించడానికి ప్రయత్నిస్తే తీవ్ర ప్రతిఘటనకు దారితీస్తుంది. ఆ కోపంలో దాడి చేసేందుకు కూడా వెనకాడరని మానసిక నిపుణులు చెప్తున్నారు. ఇలాంటి వారికి ఒకపద్ధతి ప్రకారం నచ్చచెబుతూ వాటినుంచి దూరం చేయాలని సూచిస్తున్నారు. రోజులో ఒక ఖచ్చితమైన సమయంలో ఫోన్ చూసేందుకు అనుమతించాలి. అరగంటలేదా గంట గడువు పెట్టాలి. ఇది పిల్లలు స్క్రీన్‌పై ఎక్కువ సమయం గడపకుండా నిరోధిస్తుంది. దినచర్యలో నిర్ణీత సమయం భాగమైనప్పుడు వ్యసనం కూడా అడ్డుకట్ట వేయవచ్చు. ప్రస్తుతం చాలా మంది పిల్లలు ఆటలకు దూరం అవుతున్నారు. పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యానికి ఆటలు ఎంతో ముఖ్యం. రోజూ ఒక గంటపాటు అవుట్ డోర్ ఆటల వైపు మళ్ళించడం వల్ల ఫోన్, ఇతర వ్యసనాల బారిన పడకుండా చూసుకోవచ్చు. హోంవర్క్ చేస్తే, అన్నం తింటేఫోన్ ఇస్తానని పిల్లలకు కొందరు తల్లిదండ్రులు ఆశ చూపుతుంటారు. ఆ పని చేసిన వెంటనే ఆడుకోవడానికి ఫోన్ ఇచ్చేస్తుంటారు. ఇలా చేయడం కూడా వారిని వ్యసనం వైపు మళ్లి



స్తుందని గుర్తించాలి. చాలామంది తల్లిదండ్రులు స్మార్ట్‌ఫోన్‌లో ఎక్కువ సమయం గడుపుతూ పిల్లలకు మాత్రం ఉపయోగించ వద్దని సూచిస్తుంటారు. దీనివల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. ముందు మీరు క్రమశిక్షణ పాటించాలి. దీంతో పిల్లలు మిమ్మల్ని చూసి అనుసరిస్తారు. సామాజిక మాధ్యమాల వినియోగం తగ్గించేలా ఆటలు, ఈత, మ్యూజిక్, డాన్స్‌వంటి వాటిపై దృష్టి సారించేలా చేయాలి. చిన్నప్పటి నుంచి ప్రత్యేక లక్ష్యం దిశగా పిల్లల్ని నడిపించాలి. డ్రగ్స్, గంజాయి, మద్యం వంటి వాటికి అలవాటు పడితే బయటపడడం చాలా కష్టం. ఆపాలని చూసినా కొందరు చాలా క్రూరంగా మారిపోతారు. ఇప్పుడు స్మార్ట్‌ఫోన్ కూడా వ్యసనంగా మారుతోంది. పిల్లలకు అర్థమయ్యేలా చెప్పి ఒప్పించడంలో తల్లిదండ్రులదే కీలకపాత్ర. కచ్చితంగా కొంత సమయమే వినియోగించేలా చూడటం. పిల్లలతో ఎక్కువ సమయం గడపడం, అవసరమైతే కౌన్సిలర్ సలహా తీసుకోవడం వంటి చర్యలతో వ్యసనం నుంచి క్రమేపి దూరం చేయాలి. స్మార్ట్ ఫోన్ అతి వినియోగానికి అడ్డుకట్టుట వేయడం ద్వారా భావితరం జీవితాలు ప్రమాదంలో పడకుండా చూడాల్సిన బాధ్యత మనందరిది. ప్రపంచ దేశాలలో సామాజిక మాధ్యమాల వినియోగంపై కఠిన నిబంధనలు ఉన్నాయి. ఆస్ట్రేలియాలో 16 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియా వినియోగించడం పై నిషేధం విధించింది. దేశంలోని పిల్లల మానసిక ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఈ చర్యలు తీసుకుంది. స్వీడన్‌లో 13 నుంచి 18 ఏళ్లలోపు పిల్లలు మూడు గంటల కంటే ఎక్కువ సమయం సామాజిక మాధ్యమాలను వినియోగించకూడదు. దక్షిణకొరియాలో 16 ఏళ్లలోపు పిల్లలు మధ్య రాత్రి నుంచి ఉదయం 6 గంటల వరకు ఆన్లైన్ గేమ్‌లు ఆడకూడదు. చైనాలో రోజుకు 40 నిమిషాలకు మించి టిక్‌టాక్ ఆన్లైన్ గేమింగ్‌పై నిషేధం. ఇంగ్లాండ్‌లో 16 ఏళ్లలోపు పిల్లలకు సామాజిక మాధ్యమాల వినియోగానికి తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి. స్పెయిన్‌లో 16 ఏళ్ల వరకు సోషల్ మీడియా వినియోగంపై బ్యాన్ విధించింది. ఇలా ఇతర దేశాలవలె పిల్లల సామాజిక మాధ్యమాల వినియోగంపై కఠిన నిబంధనలు రావాలి. మన దేశంలో కూడా డిజిటల్ డేటా, ప్రొటెక్షన్ యాక్ట్2023 ప్రకారం పిల్లలు సామాజిక మాధ్యమాలను వినియోగించాలంటే తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి. కానీ తల్లిదండ్రులే వయసు తారతమ్యం లేకుండా పిల్లలనుంచి వృద్ధుల వరకు స్మార్ట్ ఫోన్లో బానిసలై వ్యసనపరులుగా మారిన దుర్భర స్థితి మన దేశంతో పాటు విశ్వమానవ సమాజాన్ని వెంటాడుతోంది. స్మార్ట్‌ఫోన్ తయారీ అధినేత తన పిల్లలను 14 ఏళ్లు దాటేదాకా స్మార్ట్ ఫోన్‌కు దూరంగా ఉంచారు. 16 సంవత్సరాల వయసువరకు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంచాలని ఆయన సూచన. ఈ వ్యసనం భావోద్వేగాలపై తీవ్ర ప్రభావం చూపుతుందనే సోయి కూడా మర్చిపోతున్నారు. మనుషుల కోరికలకు సమాజ కట్టుబాట్లకు, ఆరోగ్యానికి మధ్యసంఘర్షణను..అనుబంధాల సంక్లిష్ట గాఢతను ఫోన్ దూరం చేస్తోంది. వ్యక్తి స్వేచ్ఛ, సామాజిక బాధ్యతలను విస్మరించిన మనిషి ఫోను మోజులో పడి ఎంతో నలిగిపోతూ ఒత్తిడికి గురవుతున్నాడు. స్మార్ట్‌ఫోను అవసరానికి వాడితే ఫర్వాలేదు. అతి చేసి మితిమీరి గతి తప్పితే మతి చెడుతుంది. నేటి, రేపటి తరంలో స్వీయ మనోవికాసం తగ్గి, సృజనాత్మకత, వినూత్నత కొరవడుతుంది. ●

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# రష్యా చమురుకొంటే 100% అదనపు సుంకాలే!

## ప్రత్యేక బిల్లు తెస్తున్న అమెరికా

**మాస్కో,జూలై 15:** రష్యా నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేస్తున్న భారత్, చైనా, బ్రెజిల్ సహా ఇతరదేశాలకు షాక్ ఇచ్చేందుకు అగ్రరాజ్యం అమెరికా సిద్ధమవుతోంది. రష్యాతో వ్యాపారాన్ని కొనసాగిస్తే భారత్ సహా ఇతర దేశాలపై 500 శాతం టారిఫ్‌లు విధిస్తామని హెచ్చరించింది. రష్యా అధ్యక్షుడు పుతిన్ 50 రోజుల్లో ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ముగించడంలో విఫలమైతే మాస్కోపై 100 శాతం సెకండరీ టారిఫ్‌లు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన తర్వాత యూఎస్ సెనేటర్లు లిండ్స్ గ్రాహం, రిటర్డ్ బ్లూమెంటర్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. రష్యాతో వ్యాపారాన్ని కొనసాగిస్తే భారత్ సహా ఇతర దేశాలపై కూడా భారీ ఆర్థిక ఆంక్షలు విధిస్తామని లిండ్స్ గ్రాహం, రిటర్డ్ బ్లూమెంటర్ హెచ్చరించారు. అలాగే రష్యాపై 100 శాతం సెకండరీ టారిఫ్‌లు విధిస్తామన్న ట్రంప్ నిర్ణయాన్ని స్వాగతించారు. అమెరికా అధ్యక్షుడి నిర్ణయాన్ని ప్రశంసిస్తూ, దీన్ని కీలకమైన ముందడుగుగా అభివర్ణించారు. ఈ క్రమంలో యూఎస్ సెనేటర్లు లిండ్స్ గ్రాహం, రిటర్డ్ బ్లూమెంటర్ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. చైనా, భారత్, బ్రెజిల్, ఇతర దేశాలు రష్యా నుంచి చౌకగా చమురు, గ్యాస్ కొనుగోలు చేస్తున్నాయి. ఈ దేశాలు రష్యా యుద్ధ పరిస్థితులను ఆసరాగా చేసుకుంటున్నాయి. రష్యాకు సహాయం చేసే దేశాలపై 500 శాతం వరకు సుంకాలు విధించాలి. రష్యా ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించడానికి అంతిమ అవకాశం చైనా, భారత్, బ్రెజిల్ వంటి దేశాలపై సుంకాలు విధించడమే. రాబోయే 50రోజుల్లో శాంతి ఒప్పందం కుదరకపోతే రష్యన్ చమురు, గ్యాస్‌ను కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం సుంకాలను అమలు చేయాలనే అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయాన్ని గౌరవిస్తున్నాం. వీటి లక్ష్యం పుతిన్ శాంతి ఒప్పందానికి వచ్చేలా చేయడమే. రష్యా నుంచి చమురు, గ్యాస్ ను కొనుగోలు చేసి ఉక్రెయిన్‌కు సహాయం చేయని దేశాలపై 500 శాతం వరకు సుంకాలను అమలు చేసే మా ద్వైపాక్షిక రష్యా ఆంక్షల చట్టంపై వైట్‌హౌస్‌తో కలిసి పనిచేస్తామని గ్రాహం, బ్లూమెంటల్ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. దక్షిణ కరోలినా రిపబ్లికన్ సెనేటర్ గ్రాహం, డెమొక్రటిక్ సెనేటర్ బ్లూమెంటల్ ఈ ఏడాది ప్రారంభంలో కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టిన ద్వైపాక్షిక బిల్లుపై 85 సహ స్పాన్సర్లకు నాయకత్వం వహించారు. ఈ బిల్లును మాస్కోపై ఆంక్షలను అమలు చేసేందుకు రూపొందిచారు. భారత్, చైనా, బ్రెజిల్, ఇతర దేశాలను పుతిన్ యుద్ధతంత్రానికి ఆజ్యం పోయకుండా నిరోధించడానికి సెనేటర్ గ్రాహం, నేను రష్యా ఆంక్షల బిల్లు కోసం ఒత్తిడి చేస్తూనే ఉంటామని రిచర్డ్ బ్లూమెంటల్ తన సోషల్ మీడియా హ్యాండిల్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుత్తెతో సమావేశం అనంతరం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. తాను రష్యా వైఖరిపట్ల చాలా అసంతృప్తిగా ఉన్నానన్నారు. 50రోజుల్లో శాంతి ఒప్పందం కుదరకపోతే రష్యాపై 100శాతం సెకండరీ టారిఫ్‌లను విధిస్తామని హెచ్చరించారు. రష్యా వైఖరి పట్ల



తాము చాలా అసంతృప్తిగా ఉన్నామని తెలియజేయడానికే నాటో చీఫ్‌తో భేటీ అయ్యానని తెలిపారు. రష్యాపై ఆంక్షలు విధించే అమెరికా బిల్లు గురించి ఇటీవలే భారత విదేశాంగ మంత్రి జైశంకర్ స్పందించారు. రష్యాపై బిల్లుకు సంబంధించి భారత రాయబార కార్యాలయం సెనేటర్ గ్రాహంతో సంప్రదింపులు జరిపిందన్నారు. ఇంధనం, భద్రతపై భారత్ తమ ఆందోళనలు, ఆసక్తులను గ్రాహంకు వివరించిందని పేర్కొన్నారు. సెనేటర్ లిండ్సే గ్రాహం రూపొందించిన బిల్లు భారత ప్రయోజనాలను ఏమైనా ప్రభావితం చేస్తుందా అనేది తెలుసుకుంటున్నాం. అందుకే మేము సెనేటర్ లిండ్సే గ్రాహంతో సంప్రదింపులు జరుపుతున్నాం. అమెరికాలోని భారత రాయబారి ఆయనతో చర్చలు జరిపారు. ఇంధనం, భద్రతపై భారత్ ఆందోళనలు, ఆసక్తులను ఆయనకు తెలియజేశామని జైశంకర్ తెలిపారు.

# యుద్ధాలను ఆపాలంటే నన్ను మించినవారు లేరు..


## అమెరికా అధ్యక్షుడు ట్రంప్

**వాషింగ్టన్,జూలై 15:** దేశాల మధ్య యుద్ధాలను ఆపడంలో తనను మించిన వారు లేరని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. ప్రపంచంలో ప్రస్తుతం నెలకొన్న యుద్ధ వాతావరణాన్ని తన చాతుర్యంతో తప్పించానని చెప్పారు. భారత్ పాకిస్థాన్ ల మధ్య అణు యుద్ధం జరిగే ప్రమాదాన్ని తానే తప్పించేశానని మరోమారు పేర్కొన్నారు. ఇటీవల ఆ రెండు దేశాలు పరస్పరం దాడులు చేసుకున్నాయని, యుద్ధం ముదిరి అణ్వాయుధ ప్రయోగానికి దారి తీసే ముప్పు ఏర్పడిందని ఆయన గుర్తు చేశారు. దీంతో తాను జోక్యం చేసుకుని ఇరు దేశాలను గట్టిగా హెచ్చరించినట్లు తెలిపారు. యుద్ధం ఆపకపోతే వాణిజ్య ఒప్పందాలను రద్దు చేసుకుంటామని, భవిష్యత్తులో ఎలాంటి ఒప్పందాలు కుదుర్చుకోబోమని ఒత్తిడి చేశానని వివరించారు. దీంతో ఇరు దేశాలు వెనక్కి తగ్గాయని, ప్రపంచానికి మరో అణు యుద్ధ ముప్పు తప్పిందని ట్రంప్ తెలిపారు. రువాండా కాంగోల మధ్య గడిచిన 30 ఏళ్లుగా కొనసాగుతున్న వివాదం గురించి ప్రపంచం మొత్తానికీ తెలుసని ట్రంప్ గుర్తు చేశారు. ఇందులో సుమారు 70 లక్షల మంది చనిపోయారని ట్రంప్ చెప్పారు. ఈ వివాదాన్ని కూడా తాను సమసిపోయేలా చేశానని చెప్పుకున్నారు. ఈమేరకు సోమవారం అమెరికా అధ్యక్ష భవనం వైట్ హౌస్‌లో ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

# చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో జైశంకర్ భేటీ

## ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు

**బీజింగ్,జూలై 15:** భారత విదేశాంగ మంత్రి జైశంకర్ మంగళవారం చైనా అధ్యక్షుడు జిన్ పింగ్‌ను కలిశారు. ఇటీవలి కాలంలో ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాల్లో జరిగిన పరిణామాల గురించి ఆయనకువివరించారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ తరఫున ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. 2020లో గల్వాన్ ఘటనతో ఇరుదేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తిన విషయం తెలిసిందే. ఇది జరిగిన తర్వాత భారత విదేశాంగశాఖ మంత్రి చైనాలో పర్యటించడం ఇదే మొదటిసారి. ఈ రోజు ఉదయం బీజింగ్‌లో నా తోటి షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) విదేశాంగ మంత్రులతో కలిసి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను కలిశాను. ఇటీవల ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాల పురోగతి గురించి ఆయనకు వివరించాను. ద్వైపాక్షిక సంబంధాలను ముందుకు తీసుకెళ్లడంలో దేశ నాయకత్వాల నిరంతర మార్గదర్శకత్వం ఎంతో అవసరమని వివరించాను. 2020 గల్వాన్ ఘర్షణ తర్వాత తొలిసారి షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్ సదస్సు కోసం జైశంకర్ చైనాలో



పర్యటిస్తున్నారు. చైనా ఉపాధ్యక్షుడు హాన్ జెంగ్ , విదేశాంగమంత్రి వాంగ్ యీతో భేటీ అయిన ఆయన, చైనాభారత్ సంబంధాలు క్రమంగా బలపడుతున్నట్లు వివరించారు. ద్వైపాక్షిక సంబంధాలు, సహకారాలను మరింత బలోపేతం చేసుకోవడం వల్ల ఇరుదేశాలతో పాటు ప్రపంచానికి కూడా ప్రయోజనకరమని అభిప్రాయపడ్డారు. చైనా వైపు నుంచి ప్రవహించే సరిహద్దు నదుల్లో నీటికి సంబంధించిన సమాచారాన్ని అందించడంపై జైశంకర్ వారితో చర్చించారు. సరిహద్దు సమస్యలను పరిష్కరించడం, ప్రజల రాకపోకలను అనుమతించడం, నిర్బంధ వాణిజ్య చర్చలను, అడ్డంకులను నివారించడం మా బాధ్యత. పరస్పర గౌరవం, ఆసక్తులు, సున్నితత్వం ఆధారంగా ద్వైపాక్షిక సంబంధాలు సానుకూల పథంలో అభివృద్ధి చెందుతాయని ఆశిస్తున్నాము. రేపు టియాంజియన్‌లో జరిగే ఎస్‌సీఓ విదేశాంగ మంత్రుల సమావేశానికి హాజరుకావడానికి ఎదురుచూస్తున్నాము. మంచి ఫలితాలు, నిర్ణయాలను నిర్ధరించడానికి భారత్ కట్టుబడి ఉందని జైశంకర్ అన్నారు. సింగపూర్ పర్యటన ముగించుకున్న జైశంకర్ ఎస్‌సీఓ సమావేశంలో పాల్గొనేందుకు చైనా వెళ్లారు. ఈ సందర్భంగా ఇరుదేశాల మధ్య విమానాల పునరుద్ధరణ సహా భారత్ పాక్ ఉద్రిక్తతలు, దలైలామా వారసత్వంపై ఇటీవల చెలరేగిన వివాదం మొదలైన అంశాల గురించి ఆయన చర్చించే అవకాశం ఉందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. జూన్ నెలలో భారత రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్‌లు చైనాలో పర్యటించారు. అప్పుడు రాజనాథ్ సింగ్ చైనాలోని క్వింగ్డావోలో జరిగిన షాంఘై సహకార సంస్థ సభ్యదేశాల రక్షణ మంత్రిత్వ స్థాయి సదస్సుకు హాజరయ్యారు.



# ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన నగరం సింగపూర్

**సింగపూర్‌సిటీ, జూలై 15:** విలాసానికి అవధులుండవు. కానీ, దానిని అనుభవించాలంటే కచ్చితంగా డబ్బు కావాల్సిందే. మీరు ఖర్చుకు వెనకాడని వ్యక్తి అయితే ప్రపంచంలో బోలెడు ఖరీదైన నగరాలున్నాయి. సకల సౌకర్యాలను అనుభవించడంతోపాటు ఎంచక్కా మీకు కావాల్సిన ఖరీదైన వస్తువులను కూడా కొనుక్కోవచ్చు. జూలియస్ బేర్ వార్షిక నివేదిక ప్రకారం ప్రపంచంలోనే అత్యంత ఖరీదమైన నగరంగా సింగపూర్ నిలిచింది. వరుసగా మూడో యేడాది ఈ ఘనతను సింగూర్ దక్కించుకోవడం విశేషం. మరోవైపు రెండో స్థానంలో ఉన్న హాంగ్‌కాంగ్‌ను పక్కను నెట్టి ఆ స్థానాన్ని లండన్ కైవసం చేసుకుంది. హాంగ్‌కాంగ్ మూడో స్థానానికి పరిమితమైంది. కనీసం 1 మిలియన్ డాలర్ల బ్యాంక్ బ్యాలెన్స్ కలిగిన వ్యక్తులు కొనుగోలు చేస్తున్న వివిధ రకాల ఉత్పత్తులు, వారు అనుభవిస్తున్న విలాసాల ఆధారంగా వారి జీవన వ్యయాన్ని జూలియస్ బేర్ లైఫ్‌స్టయిల్ ఇండెక్స్ విశ్లేషించి ఈ నివేదికను తయారుచేసింది. ఈ యేడా ఫిబ్రవరి–మార్చి మధ్య డేటాను పరిగణనలోకి తీసుకున్నట్లు జూలియస్ బేర్ వెల్లడించింది. **ఖరీదైన నగరంగా సింగపూర్ ఎందుకు?** సింగపూర్ ఆర్థిక, రాజకీయ పరిస్థితులు అందరికీ అనుకూలంగా ఉన్నాయి. దీంతో పలువురు అంతర్జాతీయ వ్యాపారులు సింగపూర్ కేంద్రంగానే తమ బిజినెస్‌ను నిర్వహించేందుకు మొగ్గు చూపుతున్నారు. అంతేకాకుండా గతంలో వెళ్లిపోయిన వ్యాపారులను కూడా తిరిగి రప్పించేందుకు సింగపూర్ కొన్ని సంస్కరణలు చేపట్టింది. దీంతో అక్కడి జీవన వ్యయం అమాంతం పెరిగిపోయింది. ఇక్కడి ప్రజలు ఎక్కువగా బంగారం కొనుగోలు చేసేందుకు ఇష్టపడతారు. ఇదే సింగపూర్‌ను అత్యంత ఖరీదైన నగరంగా నిలిచేలా చేసిందని రిపోర్టు పేర్కొంది. అంతేకాకుండా స్థానికులు ఎక్కువగా ఆహారం, బూట్లు, హెల్త్‌కేర్ ప్రొడక్ట్స్, విద్యపై ఎక్కువగా ఖర్చు చేస్తున్నట్లు జూలియస్ బేర్ నివేదిక పేర్కొంది. తాజా ఫలితాల ప్రకారం కరోనా మహమ్మారి తీవ్రత సాధారణ స్థితికి వచ్చినప్పటికీ.. ద్రవ్యోల్బణం, పెరుగుతున్న జీవన వ్యయాలు, భౌగోళిక రాజకీయ పరిస్థితులు ప్రపంచవ్యాప్తంగా ధరలను ప్రభావితం చేస్తూనే ఉన్నాయని నివేదిక పేర్కొంది.

**హాంగ్‌కాంగ్‌ను వెనక్కి నెట్టి..** గతేడాది ఫలితాలతో పోల్చుకుంటే లండన్ మహానగరం ఓ మెట్టు ఎక్కింది. రెండో స్థానంలో ఉన్న హాంగ్‌కాంగ్‌ను వెనక్కి నెట్టి ఆ స్థానాన్ని కైవసం చేసుకుంది. జ్యూరిచ్ సహా ఇతర ఐరోపా నగరాలు కూడా ర్యాంకింగ్స్‌లో మెరుగుపడ్డాయి.

**టాప్ 10 ఖరీదైన నగరాలు ఇవే:** 1. సింగపూర్ 2. లండన్ 3. హాంగ్‌కాంగ్ 4. షాంఘై 5. మొనాకో 6. జ్యూరిచ్ 7. న్యూయార్క్ 8. పారిస్ 9. సావోపాలో 10. మిలాన్.

# ఉక్రెయిన్ ప్రభుత్వంలో ప్రక్షాళన





## ప్రధానిగా ఆర్థిక మంత్రి యూలియా స్విరిడెంకో నియామకం

### ప్రస్తుత ప్రధాని డెనిస్ ష్మీహాల్‌ను రక్షణమంత్రిగా నియమించుకున్న జెలెన్‌స్కీ

**కీవ్(ఉక్రెయిన్), జూలై 15:** మూడేళ్లుగారష్యాతో జరుగుతున్న యుద్ధంతో సతమతం అవుతున్న ఉక్రెయిన్‌లో ఇపుడు ప్రభుత్వ ప్రక్షాళన సాగుతోంది. అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్‌స్కీ కొత్తప్రధానమంత్రిని నియమించారు. అంతేకాకుండా ఇప్పటివరకూ ప్రధానిగా కొనసాగిన డెనిస్ ష్మీహాల్‌ను తన కేబినెట్‌లో రక్షణ మంత్రిగా నియమించుకున్నారు. కొత్తప్రధాన మంత్రిగా ఇప్పటివరకూ మొదటి డిప్యూటి ప్రధానిగా కొనసాగిన యూలియా స్విరిడెంకోను నియమిస్తున్నట్లు ప్రకటించారు. సోషల్‌మీడియా టెలిగ్రామ్‌లో డెనిస్ తన రాజీనామా లేఖను కూడా పోస్టు చేసారు. తనను ఇప్పటిరకూ సమర్థించినవారికి రుణపడి ఉంటానని, ఇపుడు మరింత కీలక స్థానంలోకి వస్తున్నామని, ఉక్రెయిన్‌ను శత్రుమూకలనుంచి రక్షించేందుకు అధ్యక్షుడు జెలెన్‌స్కీతో కలిసి పనిచేస్తామన్నారు. డిప్యూటి ప్రధానిగా ఉన్న యూలియా ఎకానమి మంత్రిగా కూడా పనిచేసారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం అనుకోని సవాళ్లను తెచ్చింది. దీనికి తోడు అంతర్జాతీయంగా కూడా దౌత్యబంధాల పటిష్టతకు దోహదంచేసేవిధంగా ఉండాలని రష్యా పూర్తిస్థాయిలో మూడేళ్లుగా సాగిస్తున్న యుద్ధానికి చెక్‌పెట్టేందుకే ఈ విధానం అనుసరిస్తున్నట్లు వెల్లడి అయింది. జెలెన్‌స్కీ అధికార సోషల్‌మీడియా ఛానెళ్లు ప్రభుత్వానికి కొత్త ఉత్తేజం తీసుకురావాల్సిన అవసరం ఉందన్న వార్తలుప్రసారంచేసాయి. అందువల్లనే జెలెన్‌స్కీ యూలియా స్విరిడెంకోను ప్రధానిగా నియమించా రని చెపుతున్నారు. అలాగే విశేష అనుభవం ఉన్న ప్రస్తుత ప్రధాని డెనిస్‌ను రక్షణమంత్రిగా నియమించుకోవడం జెలెన్‌స్కీకి ఎంతోమేలు చేస్తుందన్న భావన వ్యక్తం అవుతోంది. ఉక్రెయిన్ ఆర్థిక నాయకత్వంలో కీలక పాత్రపోషించిన 39 ఏళ్ల స్విరిడెంకో అమెరికాతో చర్చల్లోకూడా కీలకపాత్రపోషించారు. అత్యంత కీలకమైన మిలిటరీ భాగస్వామితో జరిగిన చర్చల్లోకూడా ఆమె పాల్గొని కీలకపాత్రపోషించారు.

# ఆత్మహత్యకాదు వ్యవస్థీకృత హత్య: విద్యార్థిని మృతిపై భగ్గుమన్న విపక్షాలు



**భువనేశ్వర్,జూలై 15:** ఒడిశాలో ప్రొఫెసర్ లైంగిక వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని మృతి చెందడంతో ప్రతిపక్ష పార్టీలు భగ్గుమన్నాయి. ఇది ఆత్మహత్య కాదని, వ్యవస్థీకృత హత్య అని దుయ్యబట్టాయి. మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో పాటు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బిజెపి తీరును తీవ్రంగా ఖండించారు. ఒడిశాలో ప్రొఫెసర్ లైంగిక వేధింపులు తాళలేక నిప్పంటించుకున్న 22 ఏళ్ల విద్యార్థిని 3 రోజులుగా ప్రాణాలతో పోరాడి ఓడిపోయింది. 95శాతం కాలిన గాయాలతో ఐసీయూలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆమెకు మూత్రపిండాల మార్పిడి కూడా చేసినట్లు ఎయిమ్స్ భువనేశ్వర్ వైద్యులు తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థ వైఫల్యం వల్ల ఒక ప్రాణం పోయిందని తలుచుకుని ఆవేదన చెందుతున్నాం. ఇది అత్యంత బాధాకరమైన విషయం. వాస్తవానికి ఇది ప్రమాదం కాదు. ఆమెకు సాయం చేయకుండా సైలెంట్‌గా ఉన్న వ్యవస్థ వైఫల్యం వల్లే ఇలా జరిగింది. కళాశాల అధికారులు పట్టించుకోకపోయినా ఆమె ధైర్యం కోల్పోలేదు. న్యాయం కోసం కేంద్ర విద్యాశాఖ మంత్రిని, ముఖ్యమంత్రిని న్యాయం చేయాలని అడిగింది. బాలేశ్వర్ ఎంపీని స్వయంగా కలిసింది. ఎవరైనా ఒకరు బాధ్యత తీసుకుని ఉంటే ఆ విద్యార్థిని బతికే అవకాశం ఉండేదని మాజీ సీఎం నవీన్ పట్నాయక్ అన్నారు. కాగా, ఈ ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. ఇది ఆత్మహత్య కాదని, వ్యవస్థీకృత హత్య అని బిజెపిపై మండిపడ్డారు. బాధితురాలిని రక్షించడంలో ఒడిశాలోని బీజేపీ ప్రభుత్వం విఫలమైందంటూ రాహుల్ మంగళవారం ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం కోసం బాధిత విద్యార్థిని ధైర్యంగా, లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా తన గొంతుకను వినిపించింది. అందుకు, ఆమెకు న్యాయం చేయడానికి బదులుగా బెదిరించి, హింసించారు. పదేపదే అవమానించారు. ఎప్పటిలాగే బిజెపివ్యవస్థ నిందితుడిని కాపాడేందుకు ప్రయత్నిస్తోంది. ఒక అమాయకురాలైన విద్యార్థిని తనకు తాను నిప్పంటించుకునేలా చేసింది. ఇది ఆత్మహత్య కాదు వ్యవస్థీకృత హత్య. మోడీజీ ఒడిశా లేదా మణిపూర్‌లో అయినా దేశంలో కుమార్తెలు కాలిపోతున్నారు, ప్రాణాలు కోల్పోతున్నారు. మీరు ఇంకా మౌనంగానే ఉంటారా దేశానికి మీ మౌనం అవసరం లేదు. వీటన్నింటికీ సమాధానాలు కావాలి. భారతదేశ మహిళలకు భద్రత, న్యాయం కావాలని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

# న్యూయార్క్, న్యూజెర్సీలను ముంచెత్తిన ఆకస్మిక వరదలు

**వాషింగ్టన్, జూలై 15:** అమెరికాలోని న్యూయార్క్, న్యూజెర్సీ నగరాలకు వరదలు ముంచెత్తాయి. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షాల కారణంగా ఆకస్మిక వరదలు సంభవించాయి. ఈ వరదలకు అనేక ఇళ్లు నీట మునిగాయి. ప్రధాన రహదారులు సాధారణ జనజీవనం స్తంభించిపోయింది. రవాణా ఆగిపోయింది. ఈ ప్రభావం విమానాల రాకపోకలపై కూడా తీవ్ర ప్రభావం పడింది. భారీ వర్షాలు, ఆకస్మిక వరదల నేపథ్యంలో న్యూజెర్సీ గవర్నర్ ఫిల్ మర్ఫీ రాష్ట్రంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు, అధిక వర్షపాతం కారణంగా అత్యవసర పరిస్థితి ప్రకటిస్తున్నట్లు తెలిపారు. నివాసితులు ఇళ్లలోనే ఉండాలని, అనవసర ప్రయాణాలను పెట్టుకోవద్దని ప్రజలకు సూచించారు. మరోవైపు న్యూయార్క్ సిటీలోని మన్‌హటన్, బ్రూక్లిన్, క్వీన్స్, స్టేటెన్ ఐలాండ్ ప్రాంతాలకు నేషనల్ వెదర్ సర్వీస్ ఆకస్మిక వరద హెచ్చరికలు జారీ చేసింది. ఇప్పటికే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు న్యూయార్క్ సిటీ మెట్రో వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నది. సబ్‌వేల్లోకి వరద పోటెత్తింది. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోయింది. దీంతో అనేకమంది నివాసితులు అంధకారంలో ఉండిపోయారు. పలు ప్రాంతాలను వరదలు చుట్టుముట్టడంతో



వేలాది మంది నివాసితులు జలదిగ్బంధంలో చిక్కుకుపోయారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు విమాన రాకపోకలపై తీవ్ర ప్రభావం చూపాయి. వరదలు, వర్షాల కారణంగా పలు విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి.

# సంజయ్‌దత్ తలుచుకుంటే ముంబయి పేలుళ్లు ఆపేవారు

## ప్రముఖ న్యాయవాది ఎంపి ఉజ్వల్‌నికమ్



**ముంబయి, జూలై 15:**మహానగరం ముంబైలో 1993లో జరిగిన పేలుళ్ల కేసును వాదించిన ప్రముఖ న్యాయవాది ఉజ్వల్ నికమ్ తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ తలుచుకుని ఉంటే ఆ పేలుళ్లను ఆపి ఉండేవాడని ఆయన పేర్కొన్నారు. న్యాయవాదిగా పలు సంచలన కేసులను వాదించిన ఉజ్వల్ నికమ్ ఆ తర్వాత రాజకీయ అరంగేట్రం చేశారు. మీడియా ఇంటర్వ్యూల్లో ఆయన ముంబై పేలుళ్ల గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. 1993, మార్చి 12న ముంబైలో వరుస పేలుళ్లు జరిగాయి. ఆ పేలుళ్లకు కొన్ని రోజుల ముందు సంజయ్ ఇంటికి ఆయుధాలతో నిండిన ఓ వ్యాన్ వచ్చింది. గ్యాంగ్‌స్టర్ దావూద్ ఇబ్రహీం అనుచరుడు అబూ సలేం తీసుకొచ్చిన ఆ వ్యాన్‌లో హ్యాండ్ గ్రనేడ్లు, ఏకే 47 తుపాకులు, బాంబులు ఉన్నాయి. వాటిని సంజయ్ పరిశీలించారు. వాటిల్లో నుంచి ఒక ఏకే 47 తుపాకీని తీసుకుని తన దగ్గర ఉంచుకున్నారు. అయితే ఆ ఆయుధాల వ్యాన్ గురించి పోలీసులకు సంజయ్ సమాచారం ఇచ్చి ఉంటే ఆ పేలుళ్లు జరిగి అంత మంది చనిపోయి ఉండేవారు కాదు అని ఉజ్వల్ పేర్కొన్నారు. ముంబై పేలుళ్లతో సంబంధం ఉందనే కారణంతో సంజయ్‌పై అప్పట్లో టాడా కేసు నమోదైంది. సంజయ్ ఉగ్రవాది అని ఆరోపణలు వచ్చాయి. కోర్టు మాత్రం సంజయ్‌ను నిర్దోషిగా ప్రకటించింది. అయితే అక్రమంగా ఆయుధాలు కలిగి ఉన్నాడనే అభియోగం మాత్రం రుజువు కావడంతో సంజయ్‌ను దోషిగా నిర్ధారిస్తూ కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. పుణెలోని యరవాడ జైల్లో శిక్ష అనుభవించిన సంజయ్ 2016లో విడుదల అయ్యాడు. కాగా, న్యాయవాది ఉజ్వల్ నికమ్ బిజెపిలో చేరి 2024లో ముంబై నార్త్‌సెంట్రల్ లోక్‌సభ స్థానానికి పోటీ చేసి ఓడిపోయారు. తాజాగా ఆయనను బిజెపిరాజ్యసభకు నామినేట్ చేసింది.

# మారథాన్ యోధుడు రోడ్డుప్రమాదంలో దుర్మరణం

**జలంధర్,జూలై 15:** మారథాన్‌ను పూర్తి చేసిన అత్యధిక వయస్కుడిగా ప్రపంచ రికార్డు సృష్టించిన ఫౌజా సింగ్ ఓ రోడ్డు ప్రమాదంలో మరణించారు. సోమవారం జలంధర్ పఠాన్ కోట్ జాతీయ రహదారిపై ఆయనను ఓ కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన ఫౌజా సింగ్‌ను స్థానికులు హుటాహుటిన దగ్గర్లోని ఆసుపత్రిలో చేర్పించారు. ఈ ప్రమాదంలో ఫౌజా సింగ్ తలకు తీవ్ర గాయమైందని, రక్తస్రావం కారణంగా ఆయన తుదిశ్వాస వదిలారని వైద్యులు ప్రకటించారు. విదేశాల్లో ఉంటున్న ఆయన పిల్లలు వచ్చే వరకూ ఫౌజా సింగ్ మృతదేహాన్ని మార్చురీలో ఉంచుతామని వారు చెప్పారు. పంజాబ్ లోని జలంధర్ జిల్లా బేయాస్ గ్రామంలో 1911 ఏప్రిల్ 1న ఫౌజా సింగ్ జన్మించారు. ఆయనకు ప్రస్తుతం 114 ఏళ్లు. భార్య, కొడుకు మరణం తర్వాత ఫౌజా



సింగ్ రన్నింగ్ ప్రాక్టీస్ చేశారు. 89 ఏళ్ల వయసులో మొదలు పెట్టిన పరుగును వందేళ్లు దాటినా ఆపలేదు. ఈ వయసులోనూ ఫౌజా సింగ్ ఉత్సాహంగా పరుగులు తీసి రికార్డులకెక్కారు. పలు మారథాన్లను పూర్తిచేసిన ఘనతను సొంతం చేసుకున్నారు. లండన్, న్యూయార్క్, టొరంటోలలో జరిగిన మారథాన్ లలో ఫౌజా సింగ్ పాల్గొన్నారు. ఫౌజా సింగ్ మరణంపై పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా విచారం వ్యక్తంచేశారు. వందేళ్లు దాటి నా ఉత్సాహంగా పరుగులు తీస్తూ యువతకు ఆయన స్ఫూర్తిగా నిలిచారని అన్నారు.

# సంక్షిప్తంగా

## రైతుల భూమిసేకరణపై వెనక్కి తగ్గిన కర్ణాటక సర్కార్

**బెంగళూరు, జూలై 15:** కర్ణాటకలోని దేవనహళ్లి తాలూకా చెన్నరాయపట్న హుబ్లి వద్ద 1,777 ఎకరాల రైతు భూములను సేకరించాలన్న ప్రభుత్వ ప్రతిపాదనను పూర్తిగా ఉపసంహరించుకున్నట్టు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మంగళవారంనాడు ప్రకటించారు. బెంగళూరు రూరల్ జిల్లా చెన్నరాయపట్న హుబ్లి, సమీప గ్రామాల్లో 1,777 ఎకరాల సారవంతమైన వ్యవసాయ భూములను సేకరించాలన్న కర్ణాటక ప్రభుత్వ ప్రతిపాదనకు వ్యతిరేకంగా మూడున్నర ఏళ్లుగా రైతులు, ల్యాండ్ రైట్ యాక్టివిస్టులు తీవ్ర నిరసనలు సాగిస్తున్నారు. ఈ ప్రాంతంలో హైటెక్ డిఫెన్స్, ఏరోస్పేష్ పార్క్ పెట్టాలని ప్రభుత్వ ఆలోచనగా ఉంది. రైతుల సుదీర్ఘ



ఆందోళన నేపథ్యంలో సిద్ధరామయ్య అధ్యక్షతను మంగళవారం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ అధికారులు, రైతు సంఘాలు, భూముల యజమానులు, ల్యాండ్ రైట్స్ యాక్టివిస్టులు విధానసౌధలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. భూసేకరణకు సంబంధించిన తుది నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని ఈ సమావేశంలో ప్రభుత్వం నిర్ణయించింది.

## సైన్యంపై వ్యాఖ్యల కేసులో రాహుల్‌గాంధీకి బెయిల్

**లక్నో, జూలై 15:** ఇండియన్ ఆర్మీపై పరువునష్టం కలిగించే వ్యాఖ్యలు చేశారన్న కేసులో కాంగ్రెస్ ఎంపి రాహుల్‌గాంధీకి ఊరట లభించింది. ఆయనకు ఎంపి/ఎమ్మెల్యే కోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. రూ. 20,000 వ్యక్తిగత పూచీకత్తు, రెండు ష్యూరిటీలు సమర్పించాలని అడిషనల్ చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ అలోక్‌వర్మ ఆదేశించారు. తదుపరి విచారణకు ఆగస్టు 13వ తేదీకి వాయిదా వేశారు. రాహుల్ మంగళవారం కోర్టు ముందు హాజరుకాగా, గతంలో ఐదుసార్లు ఆయన విచారణకు గైర్హాజరయ్యారు. 2020లో భారత్, చైనా బలగాల మధ్య ఘర్షణలు సమయంలో భారత సైనికుల మనోభావాలను దెబ్బతీసేలా రాహుల్ వ్యాఖ్యలు చేశారంటూ బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్ మాజీ డైరెక్టర్ ఉదయ్‌శంకర్ శ్రీవాస్తవ ఈ పిటిషన్ వేశారు. భారత్ జోడో యాత్ర సమయంలో సరిహద్దుల్లోని పరిస్థితిని రాహుల్ ప్రస్తావిస్తూ అరుణాచల్ ప్రదేశ్‌లో భారత సైనికులను 'కొడుతుంటే' మీడియా ఎలాంటి ప్రశ్నలు వేయడం లేదని అన్నట్లు పిటిషనర్ పేర్కొన్నారు.

## ఎన్నికల్లో పార్టీ బలంతోనే ప్రభుత్వం ఏర్పాటుచేస్తాం: పళనిసామి



**చెన్నై,జూలై 15:** బీజేపీ తదితర పార్టీల కలయికతో ఏర్పడిన పొత్తు పటిష్టమని, సొంత బలంతోనే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వస్తామని మాజీముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిసామి మరోమారు ధీమా వ్యక్తంచేశారు. సేలం అసెంబ్లీ నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటుచేసిన పార్టీ కార్యాలయాన్ని సోమవారం ఉదయం ప్రారంభించిన ఈపీఎస్ అక్కడినుంచి ఎన్నికల ప్రచారానికి బయలుదేరారు. ఈపీఎస్ మీడి యాతో మాట్లా డుతూ, అన్నాడీఎంకే కూటమి ఏకాభిప్రాయంతో దృఢంగా, విజయం సాధిస్తా మన్న నమ్మకంతో ఉందని, అందువల్ల 2026లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తమ కూటమి ఘన విజయం సాధించి తీరుతుందని అన్నాడీఎం సొంత బలంతోనే అధికార పీఠమెక్కుతుందని ధీమా వ్యక్తం చేశారు.

## విద్యార్థినిపై లెక్చరర్ల అఘాయిత్యం: తల్లిదండ్రుల ఫిర్యాదుతో అరెస్ట్

**బెంగళూరు, జులై 15:** విద్యార్థులకు విద్య నేర్పి మంచి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురువులే మానవ మృగలలా ప్రవర్తించారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ దారుణం జరిగింది. బెంగళూరులోని ఓ ప్రైవేట్ కాలేజీలో నరేంద్ర అనే వ్యక్తి ఫిజిక్స్ లెక్చరర్‌గా, సందీప్ బయాలజీ లెక్చరర్‌గా, అనూప్ నాన్‌టీచింగ్ స్టాఫ్‌గా పనిచేస్తున్నారు. అదే కాలేజీలో ఇంటర్ చదువుతున్న విద్యార్థినిని నరేంద్ర అకడమిక్ నోట్స్ షేరింగ్ పేరుతో పరిచయం చేసుకున్నాడు. ఆ తర్వాత అనూప్ ఇంటికి పిలిపించుకుని ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. నరేంద్ర విషయం బయటపెడతానని బ్లాక్‌మెయిల్ చేసి కొన్ని రోజుల తర్వాత సందీప్ కూడా అత్యాచారం చేశాడు. ఆ ఇద్దరితో కలిసేందుకు తన రూమ్‌కు పలుమార్లు వచ్చిన సిసి ఫుటేజ్ ఉందని బెదిరించి అనూప్ కూడా అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇలా ముగ్గురూ ఆమెను బెదిరిస్తూ దఫాలుగా అఘాయిత్యానికి ఒడిగట్టారు. చివరికి ఆ విద్యార్థిని తనను కలిసేందుకు వచ్చిన తల్లిదండ్రులతో విషయం చెప్పగా వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. బాధితురాలికి వైద్యపరీక్షలు చేయించారు.

# 18న గుంతకల్లు రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలక మండలిఎన్నికలు

**గుంతకల్లు రైల్వే, జూలై 15,ప్రభాతవార్త** రైల్వేలో నిత్యం రేయింబవళ్లు చెమటోడ్చి కష్టపడి పనిచేసే శ్రామికులకు కాలక్షేపం నిమిత్తం, మానసిక ఒత్తిడిని తగ్గించి ప్రశాంతతను అహ్లాదభరిత వాతావరణాన్ని కల్పించడం కోసం నాటి ఆంగ్లేయులు రైల్వేలో అధికారుల కోసం ఆఫీసర్స్ క్లబ్‌లు, సిబ్బంది కోసం రైల్వే ఇన్స్‌స్టిట్యూట్‌లను ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణకు సభ్యుల నుంచి సభ్యత్వ రుసుము, రైల్వే నుంచి స్టాఫ్ బెనిఫిట్ ఫండ్‌లు ఆయా ఇన్స్‌స్టిట్యూట్‌లకు మంజూరు చేస్తారు. లలిత కళల ప్రోత్సాహకానికి కళాపోషణలకు అధిక ప్రాధాన్యతనిచ్చే రాయలసీమ, సీడెడ్ ఏరియాలో రైల్వే లలితకళల ప్రోత్సాహ వేదిక అయిన గుంతకల్లు రైల్వే ఇన్స్‌స్టిట్యూట్‌కు రానున్న రెండేళ్ల కాలవ్యవధికిగాను కొత్త పాలక మండలిని ఎన్నుకునేందుకు రైల్వే శాఖ ఈ నెల 18న సార్వత్రిక ఎన్నికలను నిర్వహించేందుకు చేపట్టిన ఎన్నికల ప్రక్రియ దాదాపుగా ముగింపు దశకు చేరుకుంది. దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజనల్ కేంద్రంలోని రైల్వే ఇన్స్‌స్టిట్యూట్‌లో ఒకానొక సమయంలో 8వేలపైచిలుకు సభ్యులు ఉన్న ఓటర్ల సంఖ్య ప్రస్తుతం 943కు పడిపోయింది. వీటికి ప్రధాన కారణమేంటో రైల్వేలో సర్వీసు చేసి పదవి విరమణ చేసిన ఎనభయ్యో దశకంలో ఉన్న సీనియర్ సిటిజన్స్ అయిన ప్రతి రైల్వే కార్మికులకి తెలిసిన విషయమే. 1990వ దశకం వరకు లలిత కళల పట్ల ఆసక్తి, అభిరుచి గల ఔత్సాహికులు,సాహితీ బంధువులు,కళాకారులు,క్రీడాకారులు మొత్తానికి లలిత కళల పట్ల ఆసక్తి, అభిరుచి గల ఔత్సాహిక అభిమానులు మాత్రమే ఇన్ ్స టిట్యూట్ పాలక మండలికి జరిగే ఎన్నికల్లో పోటీ చేసేవారు. కాలక్రమేనా రైల్వే ఇన్స్‌స్టిట్యూట్ పాలక మండలిలకు జరిగే ఎన్నికలలో రైల్వేలోనూ కార్మిక సంఘాలు తమ తమ ప్యానెల్స్‌ను పోటీకై నిలపడం ఆరంభమైంది. ఏటా సాహితీ, సంప్రదాయ, సాంస్కృతిక క్రీడల పోటీలు నిర్వహించే విధానానికి స్వస్తిపలికి, జయాపజయాలతో తమ ఉనికిని పరిరక్షించుకునేందుకు ఒక చక్కని అవకాశంగా కార్మిక సంఘాలు భావించి తమ తమ ప్యానెల్స్‌ను నిలపడం ప్రారంభించాయి. నాటి నుండి రైల్వే ఇన్స్‌స్టిట్యూట్‌లు అంటే కేవలం వివాహాది శుభకార్యాలకు అద్దెకు ఇచ్చే ఫంక్షన్ హాల్స్‌గా తయారయ్యాయి. వీటిని నిర్వహించుకునేందుకు ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికలు జరగబోతున్నాయి.

## వైసిపి నేత, మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిపై హైకోర్ట్ అసహనం

**విజయవాడ,జూలై 15,ప్రభాతవార్తప్రతినిధి:** మహిళా ఎమ్మెల్యేపై ఆ వ్యాఖ్యలు ఏంటి? అని నిలదీసింది. మాజీ ఎమ్మెల్యే, మహిళా ఎమ్మెల్యేకు ఇచ్చే గౌరవం ఇదేనా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఖిఅలాంటి వ్యాఖ్యలను ఉపేక్షించలేం అంటూ.. వైసీపీ నేత ప్రసన్నకుమార్ రెడ్డి వ్యాఖ్యలను హైకోర్టుతప్పుపట్టింది కోవూరు టీడీపీ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వైసీపీ నేత నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిని ఏపీ హైకోర్టు తీవ్రంగా మందలించింది. మహిళా ఎమ్మెల్యే పై ఆ వ్యాఖ్యలు ఏంటని హైకోర్ట్..నిలదీసింది. మాజీ ఎమ్మెల్యే ఆయి ఉండి.. ప్రస్తుత ఎమ్మెల్యే పై అనుచిత వ్యాఖ్యలు ఎలా చేస్తారు? అని ప్రశ్నించింది. మహిళా ఎమ్మెల్యేను గౌరవించేది ఇలాగేనా అని ప్రశ్నించింది. అలాంటి వ్యాఖ్యలు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని హైకోర్ట్ ఆగ్రహం వ్యక్తం చేసింది.అనుచిత వ్యాఖ్యలు చేయకుండా అంతేకాదు.. మీ వ్యాఖ్యతో న్యూసెన్స్ చేశారని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించిన హైకోర్ట్.. ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని ప్రసన్నకుమార్ రెడ్డి తరపు న్యాయవాది సుభోద్ అభ్యర్ధనను తోసిపుచ్చింది. సీనియర్ న్యాయవాది వాదనలు వినిపిస్తారని, పిటిషనర్ పై పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు అన్నీ ఏడేళ్లలోపు శిక్షకు వీలున్నవేనని న్యాయవాది సుభోద్ కోర్టు దృష్టికి తెచ్చే ప్రయత్నం చేశారు. విచారణను బుధవారానికి వాయిదా వేయాలని న్యాయవాది విజ్ఞప్తి చేశారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై లక్ష్మణరావు నల్లపురెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్ పై విచారణను బుధవారానికి వాయిదా వేశారు.

## దుర్గమ్మ ఆలయంలో 16న హుండీ లెక్కింపు



ప్రసాదం పోటు విభాగంతో కలిసి సారెను తీసుకొస్తున్న ఇఓ



ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మ

**ఇంద్రకీలాద్రి, జూలై 15, ప్రభాతవార్త** దుర్గమ్మవారి ఆలయంలో ఈనెల 16న హుండీల లెకి ్కంపు నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. బెజవాడ కనకదుర్గమ్మవారి ఆలయంలో ప్రసాదం పోటు విభాగం వారు మంగళవారం శ్రీ అమ్మవారికి ఆషాఢం సారెను సమర్పించారు. వారితో కలిసి ఇఓ పాల్గొన్నారు. అలాగే దుర్గమ్మవారి ఆలయంలోని కేశఖండనశాల విభాగానికి చెందిన 400 మంది నాయీ బ్రాహ్మణులు

శ్రీ అమ్మవారికి ఆషాడం సారెను, వస్త్రాలను తీసుకురాగా వారితో కలిసి ఇఓ వికె శీనా నాయక్ పాల్గొని శ్రీ అమ్మవారికి సారెను సమర్పించారు.

## మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె ప్రభుత్వం స్పందించాలి : సిపిఎం

**విజయవాడ.జూలై15,ప్రభాతవార్తప్రతినిధి:** జీతాల పెంపు, సంక్షేమ పథకాల అమలు తదితర డిమాండ్ల పరిష్కారం కోసం మూడు రోజులుగా సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు సిపిఎం రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాము అధికారంలోకి వస్తే 25 వేల రూపాయల జీతం ఉన్న వారందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన వాగ్దానం అమలు చేయాలని ఈ ప్రకటనలో కోరారు. ఇంజనీరింగ్ కార్మికులు కోరుతున్న విధంగా జిఓ నెంబరు 26 ప్రకారం జీతాలు పెంచి చెల్లించాలని సూచించారు. ఇంజనీరింగ్ కార్మికుల నైపుణ్యానికి అనుగుణంగా జీతాలు చెల్లించకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారని, నిత్యావసర సరుకుల ధరలు కరెంటు ఛార్జీలు తదితర భారాలు మోయలేక కుటుంబాలు అర్థాకలితో గడుపుతున్నాయని తెలిపారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తల్లికి వందనం పథకం అమలు కోసం జారీచేసిన 26వ నెంబరు జిఓలో ఆదాయ పరిమితిని రూ.25 వేలకు పెంచకుండా, ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయకుండా పారిశుధ్య కార్మికులను, నిరుద్యోగులను మోసం చేశారని పేర్కొన్నారు. గత సంవత్సరం మున్సిపల్ కార్మికులు నిర్వహించిన 17 రోజుల పోరాటం సందర్భంగా ఇచ్చిన హామీలను

అమలు చేయకపోవడంతో కార్మికులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగా ఇంజనీరింగ్ కార్మికులు సమ్మెబాట పట్టాల్సి వచ్చిందని, ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధపెట్టి మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## అనారోగ్యంతో మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు స్వాంతన పథకంలో రూ.3 లక్షలు ఆర్థిక సాయం

**- మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి**



**విజయవాడ, జూలై 15, ప్రభా తవార్తప్రతి నిధి:** అనారోగ్యంతో మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు స్వాంతన పథకంలో రూ.3 లక్షలు ఆర్థిక సాయం అందిస్తున్నామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరంజనేయస్వామి తెలిపారు. సచివాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి మంగళవారం సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వసతి గృహాలను గ్రామ, వార్డు సచివాలయాల శాఖ వెల్ఫేర్ అసిస్టెంట్లు తప్పనిసరిగా తనిఖీ చేయాలన్నారు. విద్య, ఆరోగ్యం, భద్రత అంశాల్లో కూటమి ప్రభుత్వం రాజీపడదన్నారు. గురుకులాలు, వసతి గృహాల్లో మిగిలిన సీట్లను భర్తీ చేయాలని, 10వ తరగతి విద్యార్థులకు ముందుగానే స్టడీ మెటీరియల్ పంపిణీ చేయాలని అన్నారు. పిఎం అజరు పథకంలో నిర్మిస్తున్న నూతన వసతి గృహాల నిర్మాణం వేగవంతం చేయాలని, గురుకులాలు, హాస్టళ్ల మరమ్మతులు త్వరిగతిన పూర్తి చేయాలని చెప్పారు. పరిశుభ్రత, పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని ఆదేశించారు. ఐఐటి, నీట్ ఎక్సలెన్సీ సెంటర్ల సంఖ్యను 10కి పెంచామన్నారు. విద్యార్థులకు కావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని చెప్పారు.

## నైపుణ్యం పోర్టల్‌ను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టండి: మంత్రి నారా లోకేష్


**విజయవాడ,జూలై15,ప్రభాతవార్తప్రతినిధి:** యువత , పరిశ్రమలను అనుసంధానించేలా కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న నైపుణ్యం పోర్టల్‌ను ఆగష్టు నాటికి పూర్తిచేసి సెప్టెంబర్ 1న ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారులతో మంత్రి సమీక్షించారు. డిస్ట్రిక్ట్ ఎంప్లాయింట్ ఆఫీసర్ ను డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ అండ్ స్కిల్ ఆఫీసర్ గా మార్చి.. వారి ఆధ్వర్యంలో జాబ్ మేళాలు, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారి ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలో 3 నెలలకు ఒకసారి జాబ్ మేళాలు నిర్వహిస్తున్న తీరును అధికారులు మంత్రికి వివరించారు. నైపుణ్య శిక్షణ ద్వారా విదేశాల్లో మెరుగైన ఉపాధి అవకాశాలను ఓంక్యాప్ ద్వారా కల్పించాలని ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. అదేవిధంగా ఉపాధి కోసం విదేశాలకు వెళ్తున్న వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వారికి తగిన సహాయక మార్గదర్శకాలను రూపొందించాలని ఆదేశించారు. వారికి ఏమైనా ఇబ్బందులు తలెత్తితే హెల్ప్ లైన్ నెంబర్ 08632340678, లేదా వాట్సాప్ నెంబర్ 8500027678 ను సంప్రదించాలని సూచించారు. ఇటీవల థాయ్ ల్యాండ్ లో ఉద్యోగాల పేరుతో ఏజెన్సీల చేతిలో మోసపోయిన వారిని ఓంక్యాప్, ఎన్ఆర్ టి ద్వారా స్వదేశానికి రప్పించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

## కాంగ్రెస్ యువ నాయకుడి దారుణహత్య

### శరీరంలో రెండు బుల్లెట్‌లు..

### ఘటనాస్థలంలో నాలుగు లభ్యం

**సంగారెడ్డి బ్యూరో, కొల్చారం జూలై 15, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు దారుణ హత్యకు గురైన సంఘటన మెదక్ జిల్లా కొల్చారం మండలం వరిగుంతం సబ్‌స్టేషన్ సమీపంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పైతర గ్రామానికి చెందిన మారెల్లి అనిల్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా నాయకుడిగా పని చేస్తున్నాడు. సోమ వారం గాంధీభవన్‌కు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశంను మధ్యలో దించి, ఒంటరిగా వెళ్తుండగా.. అప్పటికే కారులో వెంబడించిన గుర్తు తెలియని వ్యక్తులు అనిల్‌పై కాల్పులు జరిపారు. దీంతో అక్కడిక్కడే అనిల్ మృతి చెందాడు. స్థానికులు మెదక్‌లోని ప్రైవేట్ హాస్పిటల్ కు తరలించగా... అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుని శరీరంపైన బుల్లెట్ గాయాలు ఉన్నాయని వైద్యులు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలంలో పరిశీలించగా, నాలుగు బుల్లెట్‌లు లభ్యం అయ్యాయి. అనుమా నాస్పద మృతిగా కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.భూ తగాదా విషయంలో కక్ష ్య పెంచుకున్న వారే ఈ దారుణానికి పాల్పడి ఉండొ చ్చని స్థానికులు, అనిల్ సన్నిహితులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అనిల్ మృతి ప్రమాదంగా భావించినప్పటికీ హత్యగా తేలడంతో, మంగళవారం మెదక్ జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఫోరెన్సిక్ నిపుణులు అనిల్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, బుల్లెట్‌లను తొలగించారు. మారెల్లి అనిల్ హత్య కేసును త్వరలోని ఛేదించి, నిందితులను అదుపులోకి తీసుకుంటామని జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు అన్నారు. మంగళవారం ఆయన కొల్చారం పోలీస్ స్టేషన్ లో మీడియాతో మాట్లాడుతూ.. బుల్లెట్ గాయాలు ఉండటంతో హత్య గా నిర్ధారణకు రావడం జరిగిందన్నారు. ఈ కేసు విచారణకు 4 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



## తిరుమల స్వామికి రూ.44.81 లక్షల విరాళం

### చెక్కు అందజేసిన గ్రామీణ బ్యాంక్ చైర్మన్

**గుంటూరు,జులై15,ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల తిరుపతి దేవస్థానానికి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ ప్రమోద్ కుమార్ రెడ్డి 44 , 81 , 059 రూపాయల విలువైన చెక్కును విరాళంగా అందజేశారు. భక్తుల భద్రతను దృష్టిలో పెట్టుకుని అలిపిరి చెక్పోస్ట్ వద్ద ఏర్పాటు చేయబోయే సెక్యూరిటీ లగేజ్ స్కానర్ కోసం ఈ విరాళాన్నిఅందజేస్తున్నట్లు ప్రమోద్ కుమార్ రెడ్డి తెలిపారు .తిరుమల తిరుపతి దేవస్థానం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వెంకయ్య చౌదరి కార్యాలయంలో ఈ చెక్కును అందజేసినట్లు గ్రామీణ బ్యాంకు చైర్మన్ తెలిపారు. తిరుమలకు వచ్చే భక్తుల భద్రతను మరింత మెరుగుపరిచేందుకు బ్యాంకు తన వంతు సేవగా వివరాలు అందించిందని ఆయన పేర్కొన్నారు.

సమాజానికి సేవ చేసే లక్ష ్యంతో ముందుకెళుతున్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ప్రధాన లక్ష ్యం గా కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ప్రాంతీయ మేనేజర్ ప్రకాష్ రత్నబాబు కూడా

## కలెక్టర్లకు ర్యాంప్ అమలు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

**విజయవాడ,జూలై15,ప్రభాతలవార్తప్రతినిధి:** సూక్ష్మ,చిన్న,మధ్య తరహా పరిశ్రమలను బలోపేతం చేసేందుకు రూపొందించిన ర్యాంప్ (రైజింగ్,యాక్సిలరేటింగ్ ఎంఎస్ఎంఈ ఫెర్మా ర్మెన్స్) పథకం అమలు,పర్యవేక్షణ భాధ్య తలను జిల్లా కలెక్టర్లకు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పథకం క్రింద ఎంఎస్ఎంఈలకు ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌పై అవ గాహన, మార్కెట్ లింకేజి,ఇన్వాయిస్ ఫైనాన్సింగ్, స్వయం ఉపాధికి శిక్షణ, పర్యావరణహిత ప్యాకింగ్ సదుపాయం,ఎగుమతులకు ప్రోత్సాహం, బిజినెస్ డెవలప్‌మెంట్ ప్రొసీజర్స్‌కు సంబంధించి నిర్వహించే అవగాహన కార్యక్రమాలకు అవసరమయ్యే నిధులను కలెక్టర్ల ఖాతాకు బదిలీ చేసేందుకు అనుమతించింది. ఈ పథకం అమలుకు ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషణ్ నోడల్ ఏజెన్సీగా వ్యవహారిస్తుందని, కార్యక్రమాల నిర్వహణ భాధ్యతలను కార్పొరేషన్ సిఈఓకు అప్పగిస్తున్నట్లు పేర్కొంది.

## కవి సమ్మేళనం గోడపత్రికను ఆవిష్కరించిన కలెక్టర్

**విజయవాడ.జూలై15,ప్రభాతవార్తప్రతినిధి:** అంబేద్కర్ స్మృతివనం ఆవరణలో జరుగనున్న ప్రణామ్య కవి సమ్మేళనం గోడపత్రికను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా జి. లక్ష్మీశ మంగళవారం ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. సమాజం కోసం నిరంతరం శ్రమిస్తూ ఒక తపస్సుతో కవిత్వం రాస్తున్న కవుల సమ్మేళనానికి నేను తప్పకుండా వచ్చి, కార్యక్రమాన్ని ప్రారంభిస్తానని, నిర్వాహకులుగా మీరు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని మల్లెతీగ బృందానికి సూచించారు. విజయవాడ నగరం నడిబొడ్డున అంబేద్కర్ స్మృతివనం ఆవరణలో డా అంబేద్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం పాదాల చెంతన, రోజంతా జరుగనున్న ఈ కవి సమ్మేళనాన్ని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ప్రారంభిస్తారని, వివిధ ప్రాంతాలకు చెందిన కవులు పాల్గొని భాష, సామాజిక స్పృహ, దేశభక్తి, ప్రపంచశాంతి, పర్యావరణం అంశాలపై తమ కవితల్ని వినిపించవచ్చని మల్లెతీగ అధ్యక్షుడు కలిమిశ్రీ తెలిపారు. పాల్గొన్న కవులందరికీ ప్రశంసా పత్రం, బుక్ ఆఫ్ భారత్ రికార్డ్స్ చిరు జ్ఞాపికతో సత్కారం వుంటుందని, మధ్యాహ్నం భోజన ఏర్పాటు, అంబేద్కర్ స్మృతివనం పార్కు సందర్శన టికెట్స్ కూడా అందజేస్తామని మల్లెతీగ ఉపాధ్యక్షుడు చొప్పా రాఘవేంద్రశేఖర్ తెలిపారు. పూర్తి వివరాలకు 92464 15150 నెంబరులో సంప్రదించవచ్చు.

## పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

### టూరిజం మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ,జూలై15,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకొని, విస్తృత ప్రచారం కల్పించి మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలని రాష్ట్ర పర్యాటక, సాంస్క ృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అధికారులకు సూచించారు. మంగళవారం వెలగపూడి సెక్రటేరియట్ రెండవ బ్లాక్ లోని తన పేషిలో ఈ మేరకు రాష్ట్ర పర్యాటక శాఖ అధికారులతో మంత్రి కందుల దుర్గేష్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుత పర్యాటక ప్రాజెక్టుల స్థితిగతులు, కొత్త ప్రాజెక్టులకు డీపీఆర్ ల తయారీ, క్యారవాన్, హోమ్ స్టే పాలసీ విధివిధానాలు, ఇతర రాష్ట్రాల్లో ప్రచారం, కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా వచ్చే నిధులు, రీజినల్ సమ్మిట్ లు, శాఖాపరమైన సమావేశాలు, ఇటీవల కుదుర్చుకున్న ఎంవోయూలు, క్షేత్రస్థాయి పర్యటనల షెడ్యూల్ తదితర అంశాలపై మంత్రి దుర్గేష్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఏపీలో 25 వేల కోట్ల పర్యాటక పెట్టుబడులు, 50వేల గదుల ఏర్పాటు లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర పర్యాటక రంగానికి విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరాన్ని అధికారులకు వెల్లడించారు. ఈ క్రమంలో హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై, కలకత్తా, ముంబయిలలో రోడ్ షోలు ఏర్పాటు చేసి రాష్ట్ర పర్యాటక ప్రాంతాలకు ప్రాచుర్యం కల్పించాలని ఆదేశించారు. అదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా 22 దేవాలయాల్లో టెంట్ సిటీలతో పాటు ఇగ్లూ తరహా ఇళ్ల విషయం ఆలోచించాలన్నారు. అనంతరం విశాఖపట్నంలోని రుషికొండ బ్లూఫ్లాగ్ బీచ్ సుందరీకరణ అంశంపై చర్చించారు. పర్యాటకుల సంఖ్య క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రమాణాలకు అనుగుణంగా పర్యాటకుల భద్రత, బీచ్ పరిశుభ్రత విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. నిరుపయోగంగా ఉన్న నిర్మాణాలను తొలగించి పర్యాటకులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.లేపాక్షి, లంబసింగి పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన సరైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి దుర్గేష్ అధికారులను ఆదేశించారు.

## బాంబే స్టాక్‌ఎక్ఛేంజీకి బాంబు బెదరింపు

**ముంబయి, జూలై 15:** ప్రతిష్టాత్మకమైన ఈక్విటీ స్టాక్ ఎక్ఛేంజి కంపెనీ బాంబేస్టాక్ ఎక్స్ఛేంజికి బాంబు బెదిరింపులు వచ్చాయి. ఇమెయిల్‌ద్వారా ఈ హెచ్చరిక అందడంతో పోలీసులు విస్తృత గాలింపు చేపట్టారు. చివరకు బోగస్ బెదిరింపుకాల్ అని పోలీసులు నిర్ధారించారు. బిఎస్ఇ ఉదోనయగి ఒకరికి ఆదివారం ఒక మెయిల్ వచ్చింది. దక్షిణాదిలోని ఒక రాజకీయ నాయకుడిపేరుతో ఈ మెయిల్ వచ్చింది. ఈ మెయిల్‌లోనే ఆర్డీఎక్స్, ఐఇడిలను బిఎస్ఇ భవనంలో ఉంచామని, సోమవారం మధ్యాహ్నాం 3 గంటలకల్లాభవనం పేలిపోతుందని ఆ మెయిల్‌లో ఉంది.

దీనితో ఆ ఉద్యోగి వెంటనే స్టాక్ ఎక్ఛేంజి అధికారులను అప్ర మత్తంచేసి ముంబయి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాంబ్ డిటెక్షన్‌బృందం, ముంబయి పోలీసులు వెంటనే బిఎస్ఇ హైటవర్‌వద్దకు చేరు కుని విస్తృత గాలింపు జరిపారు. అయితే అను మానాస్పద వస్తువు ఏదీ కనిపించలేదని తేలింది.

## నోరుంది కదాని ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదు : మంత్రి కొల్లు రవీంద్ర



**విజయవాడ,జూలై15,ప్రభాతవార్తప్రతినిధి:** వైసిపి నాయకులు నోరుంది కదాని ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదని, మాజీ పేర్ని నాని మాట్లాడే ముందు నోరు అదుపులో పెట్టుకోవాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. మచిలీపట్నం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలోమంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పేర్ని నాని వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారసత్వంగా వచ్చిన వ్యాపారాలను అవినీతి సంపాదన అని చెప్పడానికి వైసీపీ నేత పేర్ని నానికి సిగ్గుండాలన్నారు. తల్లిని, తండ్రిని రోడ్డున పడేశాడు. కొడుకుతో గంజాయి వ్యాపారం చేయించి నియోజకవర్గంలో యువత జీవితాలను బుగ్గి చేసిన నీచుడు పేర్ని నాని అన్నారు. మా తాత ముత్తాతల నుండి ఉన్న ఆస్తుల్ని చూపించి నేను అవినీతి సొమ్ము కూడబెట్టుకున్నానని చెప్పడంపై మండిపడ్డారు. ఐదారు దశాబ్దాల క్రితమే వందలాది మందికి మా నాన్న ఉపాధి కల్పించారు. వారు కష్టార్జితంతో ఎంతో మందికి ఉపాధి కల్పించిన చరిత్ర మా కుటుంబానిది. ఇసుకలో దోపిడీ చేశానని చెబుతున్న పేర్ని నాని రామాలయంలో ప్రమాణం చేయడానికి సిద్ధమా? అని ప్రశ్నించారు. మా నాన్న రాసిన వీలునామా ప్రకారం ఆస్తులు పంచుకున్నాం. దాన్ని కూడా రాద్ధాంతం సృష్టించి కుటుంబాల మధ్య గొడవలు సృష్టించేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటు. లంకిశెట్టి భూములకు 2016లో రిజిస్ట్రేషన్ చేయించి రూపాయికి మూడు రూపాయలు కట్టించింది మీరు కాదా? ఇళ్లు కట్టుకోవాలనుకున్నవారికి పర్మిషన్లు ఇవ్వడానికి కూడా డబ్బులు డిమాండ్ చేసిన పేర్ని నాని కూడా మాట్లాడడం హాస్యాస్పదం గా ఉందన్నారు. మచిలీపట్నంలో రెడీ మిక్స్ ప్లాంట్స్ లేకపోవడంతో మేఘా నుండి కాంక్రీట్ తెప్పించుకుంటే దానిపైనా విమర్శలు చేశారు. రాజారత్నపురం ప్రాంతంలో మా నాన్న, తాత భూములు సేకరించి అక్కడ రైస్ మిల్లు ఏర్పాటు చేశారు. చెరువుల కారణంగా ఇబ్బంది ఎదురైతే వాటిని ఐస్ ఫ్యాక్టరీగా మార్చారు. వాటిని మా అన్న, వారి కుమారులు నడుపుతున్నారు. దాన్ని కూడా రాద్ధాంతం చేయాలని ప్రయత్నించడం పేర్ని నాని నీచ మనస్తత్వానికి నిదర్శనం. నా కుటుంబం గురించి గానీ, కుటుంబ సభ్యుల గురించి గానీ తేడాగా మాట్లాడితే క్షమించేది లేదు. మచిలీపట్నంలో చిన్న పరిశ్రమ పెట్టుకుని పది మందికి ఉపాధి కల్పించేందుకు ప్రయత్నిస్తున్న నా కొడుకు గురించి తేడాగా మాట్లాడుతావా? నీ కొడుకులా నా కొడుకు గంజాయి వ్యాపారం చేయడం లేదు. మర్యాదగా మాట్లాడినపుడు మర్యాదగా వ్యవహరిస్తాం.. తేడాగా మాట్లాడితే ఒప్పుకునేది లేదని ఆయన వ్యాఖ్యానించారు. నేను సంపాదించే ప్రతి రూపాయికి, ఖర్చు చేసే ప్రతి పైసాకు లెక్క ఉంది. అవినీతి చేస్తున్నామని మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు.

## అత్యున్నత ప్రమాణాలతో పారదర్శకంగా ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక

### ప్రతి హైస్కూల్‌కు ఇంటర్నెట్, కంప్యూటర్ ల్యాబ్

### పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యపై సమీక్షలో మంత్రి నారా లోకేష్



పాఠశాల విద్య, సమగ్ర శిక్ష, ఇంటర్మీడియట్ విద్య ఉన్నతాధికారులతో మంత్రి నారా లోకేష్ సమీక్ష

**విజయవాడ,. జూలై 15,ప్రభాత వార్తప్రతినిధి:** ఉపాధ్యాయుల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థి అభ్యసన సామర్థ్యాల పెంపునకు గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్(ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) కార్యక్రమం చేపట్టాలని విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో పాఠశాల విద్య, సమగ్ర శిక్ష, ఇంటర్మీడియట్ విద్య ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు. స్కూల్ ఎన్ రోల్ మెంట్ డ్రైవ్ ద్వారా ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అసెంబ్లీలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రతిపాదించిన విధంగా గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమ వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. విద్యార్థి ప్రాథమిక స్థాయిలోనే గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని చేపట్టాలని ఆదేశించారు. ఇటీవల విడుదల చేసిన పరాక్ సర్వేలో జిల్లా స్థాయి ర్యాంకులను, రాష్ట్రస్థాయి ర్యాంకులను మెరుగుపర్చేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అకడమిక్ ఫోరమ్ లను బలోపేతం చేసి, ఉపాధ్యాయులను ప్రేరేపించడం ద్వారా అభ్యసన ఫలితాలు మెరుగుపర్చాలని సూచించారు. అత్యున్నత ప్రమాణాలతో పారదర్శకంగా ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిసెప్టెంబర్ 5న ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికను అత్యున్నత ప్రమాణాలతో పారదర్శకంగా చేపట్టాలి. ప్రతి హైస్కూల్ కి ఇంటర్నెట్ సదుపాయం కల్పించడంతో పాటు కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటుచేయాలని ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ను పునర్ వ్యవస్థీకరించి నిపుణులను భాగస్వామ్యం చేయాలని, త్వరలోనే బోర్డ్ మీటింగ్ నిర్వహించాలని ఆదేశించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్స్(తిగిలి) ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సమర్థవంతంగా స్టెమ్ యాక్టివిటీస్ చేపట్టాలని ఆదేశించారు. హైస్కూల్ ప్లస్ వ్యవస్థ బలోపేతానికి చర్యలు రాష్ట్రంలో హైస్కూల్ ప్లస్ ల పనితీరుపై సమగ్రంగా చర్చించారు. హైస్కూల్ ప్లస్ వ్యవస్థ బలోపేతానికి చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

## సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టుల కట్టడికి చర్యలు: సుప్రీం

**న్యూఢిల్లీ, జూలై 15:** సోషల్ మీడియాలో కొందరు యూట్యూబర్లు, స్టాండప్ కమెడియన్లు, కళాకారులు ఇష్టానుసారం అభ్యంతరకర పోస్టులు చేస్తున్నారని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అలాంటి పోస్టుల కట్టడికి తప్పనిసరిగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంది. సోషల్ మీడియాలో ఏం చేసినా, ఏం చెప్పినా చెల్లిపోతుందనే ధోరణి పలువురిలో కనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇటువంటి ఘటనలు తరచుగా చోటుచేసుకుం టున్నాయని మండిపడింది. ప్రధాని నరేంద్రమోడీ, ఆరెస్సెస్‌పై వేసిన కార్టూన్ అభ్యంతరకరంగా ఉండటంతో తనపై నమోదైన కేసులో అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని కార్టూనిస్ట్ హేమంత్ మాలవీయ వేసిన పిటిషన్‌పై విచారణ సమయంలో సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. భావ ప్రకటనా స్వేచ్ఛను దుర్వినియోగం చేయవద్దని హెచ్చరిస్తూ కార్టూనిస్ట్ హేమంత్ మాలవీయకు అరెస్టు నుంచి సుప్రీంకోర్టు రక్షణ కల్పించింది. అయితే ఇదే విధంగా సోషల్ మీడియాలో అభ్యంతకరమైన పోస్టులను షేర్ చేస్తే చట్ట ప్రకారం అతడిపై చర్యలు తీసుకునే అధికారం రాష్ట్రానికి ఉందని జస్టిస్ సుధాంశు ధులియా, జస్టిస్ అరవింద్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం హెచ్చరించింది. ప్రధాని నరేంద్రమోడీ, ఆరెస్సెస్‌పై వేసిన కార్టూన్ అభ్యంతరకరంగా ఉండటంతో కార్టూనిస్ట్ హేమంత్ మాలవీయపై న్యాయవాది, ఆర్ఎస్ఎస్ కార్యకర్త వినయ్ జోషి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. మాలవీయ సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన విషయాలను అప్‌లోడ్ చేయడం ద్వారా హిందువుల మతపరమైన మనోభావాలను దెబ్బతీశారని జోషి ఆరోపించారు. ఈ కేసులో అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ హేమంత్ మాలవీయ మధ్యప్రదేశ్ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ వేయగా న్యాయస్థానం దాని తోసిపుచ్చడంతో ఆయన సుప్రీంను ఆశ్రయించారు.

తూర్పుగోదావరి, కాకినాడ
డా.బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

బుధవారం 16 - జూలై - 2025



# సమస్యల పరిష్కారానికే మండల సమావేశం : ఎంపిపి దొరబాబు



**గండేపల్లి , జులై 15 , ( ప్రభాతవార్త ) :**
గండేపల్లి మండల పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం మండల పరిషత్ అధ్యక్షులు చల్లగళ్ల పద్మనాభుడు అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సమావేశములో వ్యవసాయం, విద్య, వైద్యం, రెవెన్యూ, పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా, గృహ నిర్మాణం, ఉపాధి హామీ పథకం, డిఆర్డిఏ, ఐసీడీఎస్ , హార్టికల్చర్, ఏపీ ట్రాన్స్ కో ,వెటర్నరీ తదితర ప్రభుత్వ శాఖల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీపీ దొరబాబు మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు వారి శాఖకు సంబంధించిన సమస్యలు లేదా అవసరాలు ఏమైనా ఉంటే మండల పరిషత్ దృష్టికి తీసుకు వస్తే స్థానిక ఎమ్మెల్యే సహకారంతో జిల్లా స్థాయి అభివృద్ధి సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకు వెళ్ళి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. సభ్యులు ఆయా గ్రామాల సమస్యలను వివరించగా సంబంధిత శాఖల అధికారులు సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు.మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె. చంద్రరావు పి4 పథకం లో భాగంగా బంగారు కుటుంబాల దత్తత గురించి సభ్యులకు వివరించారు. సభ్యులందరినీ బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవలసినది గా కోరారు. ఈ సమావేశంలో తాహశీల్దార్ శ్రీనివాస్, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# వాడపల్లి దేవస్థానంలో శరవేగంగా అభివృద్ధి పనులు




**పరిశీలించిన డిప్యూటీ కమీషనర్, ఈఓ, నల్లం సూర్య చక్రదరరావు**

**ఆత్రేయపురం, జులై 15 , ( ప్రభాతవార్త ) :**
ఏడువారాల వెంకన్న గా ప్రసిద్ధిచెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆలయ డిప్యూటీ కమిషనర్ మంగళవారం పరిశీలించారు. రోజు రోజుకు పెరుగుతున్న భక్తుల దృష్ట్యా వారికి మరిన్ని వసతులు కల్పించేలా వకుళ మాత అన్నదాన భవనం, మరుగుదొడ్లను ఆయన పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని గుత్తేదారులను చక్రధరరావు ఆదేశించారు.

# కోనసీమ తిరుమల వాడపల్లి'వెంకన్న'కు అష్టోత్ర పూజలు

**- స్వామివారికి రూ,3,14,184లు ఆదాయం**

**ఆత్రేయపురం, జులై 15 , ( ప్రభాతవార్త ) :**
ప్రముఖ పుణ్యక్షేత్రం గా విరాజిల్లుతున్న కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తులు మంగళవారం అశేష సంఖ్యలో విచ్చేసి స్వామి వార్ని దర్శించుకున్నారు. దీంతో వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ,3,14,184లు ఆదాయం సమాకూరినట్లు దేవస్థానం అధికారులు ఒక ప్రకటన ద్వారా తెలియజేసారు. ఉదయం మేలుకొలుపు, లక్ష్మి ఐశ్వర్య హెూమం, అష్టోత్తర



శతనామావళి నిత్య కళ్యాణం బాలభోగం నివేదన పవళింపు సేవ తదితర కార్యక్రమాలు అర్చకులు ఘనంగా నిర్వహించారు. శ్రీ స్వామివారి దర్శించుకొని అన్నప్రసాదాలను స్వీకరించారు.


# వైసీపీ అధినేత జగన్ ను కలిసిన మందపాటి దంపతులు



**అంబాజీపేట, జులై 15 , ( ప్రభాతవార్త ) :**
పి.గన్నవరం నియోజవర్గ వైసిపి మాజీ కో-ఆర్డినేటర్ మందపాటి కిరణ్ కుమార్- అనిత దంపతులు వైసీపీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని విజయవాడలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పి.గన్నవరం నియోజకవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న కార్యక్రమాలు, పార్టీ అభివృద్ధి తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారని కిరణ్ కుమార్ తెలిపారు. పార్టీ బలోపేతంలో భాగంగా వైసీపీ అధిష్టానం నిర్దేశించిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని, పార్టీని నియోజకవర్గంలో ముందుకు తీసుకువెళ్లాలని సూచించారని కిరణ్ కుమార్ తెలిపారు. పార్టీ అధినేత ఆదేశాలను శిరస్సా వహించి, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని కిరణ్ కుమార్-అనిత దంపతులు తెలిపారు.

# కోనసీమ తిరుమలకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించేలా చర్యలు : ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

**ఆత్రేయపురం, జులై 15 , ( ప్రభాతవార్త ) :**
ఏడువారాల వెంకన్నగా భక్తుల కోర్కెలు తీర్చే స్వామి గా పేరొందిన కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర స్వామి వారి దర్శనానికి ప్రతీ శనివారం రాష్ట్రం నలుమూలల నుంచి తరలివస్తున్న ప్రతిభక్తుడు స్వామివారిని కనులారా దర్శించి సంతృప్తి చెందేలా . భక్తులకు ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అధికారులకు సూచించారు. గత శనివారం అధిక సంఖ్యలో 70 వేలకు పైగా భక్తులు తరలి వచ్చిన నేపథ్యంలో మంగళవారం ఆర్డిఓ పి శ్రీకర్ తహసీల్దార్ టి ఆర్ రాజేశ్వరరావు ఎంపీడీవో బి కే ఎస్ ఎస్ వెంకట రామన్ ఆలయ డిప్యూటీ కమిషనర్ . కార్య నిర్వహణా



ధికారి నల్లం సూర్యచక్రధర్ రావు తదితరులతో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా పార్కింగ్ స్థలాలు రోడ్లు పరిశీలించారు. ఆలయ పరిసరాల్లో క్యూలైన్ల పెంపు, భక్తులకు అవసరమైన తాగునీరు తదితర సౌకర్యాలు ఏర్పాట్లు గురించి ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటుపై వైద్యాధికారులకు, భద్రత తదితర అంశాలపై పోలీసు అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుటమి నాయకులు ముదునూరి వెంకట రాజు , ముదునూరి రాంబద్ర రాజు,కాయల జగన్నాథం, రావుల పాలెం రూరల్ సి ఐ, సి హెచ్, విద్యాసాగర్, ఆత్రేయపురం ఎస్ ఐ, రాము, గ్రామస్తులు ఆలయ సిబ్బంది ఉన్నారు.

# ఈనెల 17న జరిగే బిసి ఆత్మీయ సమావేశం విజయవంతం చెయ్యండి : మట్టా వీరబాబు గౌడ్

**ఆత్రేయపురం, జులై 15 , ( ప్రభాతవార్త ) :**
ఈనెల 17న జరగబోయే బీసీ ఆత్మీయ సమావేశానికి బీసీలంతా తరలి రావాలని రాష్ట్ర బీసీ కోఆర్డినేటర్ మట్టా వీరబాబు గౌడ్ పిలుపు నిచ్చారు.మంగళవారం అయన పలు గ్రామాల్లో పర్యటించారు. ఆత్రేయపురం మండలంలోని 17 గ్రామాల బీసీ సోదరులందరు పోల్గనాలని పిలుపు నిచ్చారు.ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ రావులపాలెం సి ఆర్ సి లో జరగబోయే బీసీ సమావేశానికి ముఖ్య అతిథిగా బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ పాల్గొంటారని తెలిపారు. బీసీలంతా ఐక్యతతో ముందుకు సాగాలని పార్టీలకతీతంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ పాల్గొంటారని ఈ సమావేశాన్ని బీసీలంతా తరలి వచ్చి సమావేశం విజయవంతం చేయాలని కార్యక్రమంలో బీసీలంతా ఒక తాటిపైకి వచ్చి మన హక్కుల



పోరాటానికి సాధించుకునేందుకు రాజకీయాలకు అతీతంగా మనం అందరం ఈ ఆత్మీయ సమావేశంలో చర్చించుకున్నందుకు బీసీలంతా కలిసిమెలిసి ఉండాలని ఆయన అన్నారు అలాగే బీసీలకు రాజ్యాధికారం దిశగా స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించే దిశగా పోరాడాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో బెజవాడ సతీష్ ,వంక వీరభద్రరావు,చిటికెన సత్యనారాయణ,అత్తిలి రామాంజనేయులు,గుడాల నాగేంద్ర , బుడంపర్తి ప్రసాద్ ,వేముల శ్రీనివాస్, మేడపాటి దుర్గారావు, నరమామిడి సత్యనారాయణ, కోవెల రామకృష్ణ,వేముల ప్రసాద్,మట్ట నాగేశ్వరరావు, బుడ్డిగా సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 19న పలు ప్రైవేట్ బ్యాంకుల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

**- నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి : మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపు**

**కోనసీమ బ్యూరో , జులై 15 , ( ప్రభాతవార్త ) :**
నిరుద్యోగాన్ని రూపుమాపేందుకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఉపాధి ప్రాజెక్టు డైరెక్టర్ రామ్ కుమార్ సంయుక్త ఆధ్వర్యంలో వారం వారం జాబ్ మేళాలో భాగంగా ఈనెల 19న ఉదయం 10 గంటలకు రామచంద్రపురం లోని ఉపాధి భవన్లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు మంత్రి సుభాష్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ జాబ్ మేళాలో ఐ ప్రాసెస్ ద్వారా ఐసిఐ సిఐ లో అలాగే 18 నుండి 34 సంవత్సరాలు కలిగి ఏదైనా డిగ్రీ చేసిన అభ్యర్థులు బ్యాక్ ఎండ్ ప్రాసెస్ మరియు సేల్స్ సపోర్ట్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాల కోసం నెలకు 17000 నుండి 25000 జీతముతో ఆంధ్రప్రదేశ్ లో



ఎక్కడైనా ఉద్యోగమూ చేసే విధముగా ఐ ప్రాసెస్ ద్వారా ఐసిఐసిఐ లో. అలాగే టైం ప్రో ద్వారా యాక్సిస్ బ్యాం కు 18 నుండి 27 సంవత్సరాలు కలిగి ఏదైనా డిగ్రీ మరియు డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన అభ్యర్థులకు సేల్స్ ఆఫీసర్ ఉద్యోగాల కోసం రూ. 2.4 నుండి 2.8 ఎల్. పి. ఏ జీతముతో ఆంధ్రప్రదేశ్ లో ఎక్కడైనా ఉద్యోగమూ చేసే విధముగా టైం ప్రో ద్వారా ఆక్సిస్ బ్యాంకుల్లో అవకాశాలు ఉన్నట్టు తెలిసింది.ఆసక్తి కలిగి ఉత్సాహవంతులైన వారు రామచంద్రపురం లోని కెవిఆర్ ఆసుపత్రి వెనుక ఉన్న ఉపాధిభవన్లో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం : 99489 19949, 95154 81671 సెల్ నెంబర్లలో సంప్రదించగలరు.

# జగన్‌ను కలిసిన సుధాకర్



**మండపేట రూరల్ , జులై 15 , ( ప్రభాతవార్త ) :**
వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో మంగళవారం దళిత నేత పార్టీ ఏడిద గ్రామ కమిటీ అధ్యక్షులు పలివెల సుధాకర్ మర్యాద పూర్వకంగా కలిశారు. అలాగే బాపట్ల మాజీ ఎంపీ నందిగామ సురేష్‌ను కలిశారు. ఈ సందర్భంగా జగన్, సురేష్ లు సుధాకర్‌ను యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సుధాకర్ మాట్లాడుతూ ఏడాదికే కూటమి పాలన పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని, భవిష్యత్తులో రాష్ట్రంలో జగన్ సీఎం, మండపేట ఎమ్మెల్యేగా తోట త్రిమూర్తులు గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

# షుగర్ పేషెంట్ కు రూ.20,100లు ఆర్థిక సహాయం



**మామిడికుదురు, జులై 15 , ( ప్రభాతవార్త ) :**
మామిడికుదురు మండలం పాశర్లపూడి గ్రామానికి చెందిన మల్లవరపు దయామణికి షుగర్ కారణంగా కాళ్లు తొలగించారు.ఆమె ఉండడానికి ఇల్లు లేక చర్చిలో ఉంటున్నారు. ఆమె కృత్రిమ కాలు కోసం రాజోలు నియోజకవర్గం ఫ్రెండ్స్ ఫర్ సర్వీస్ ప్రతినిధులు రూ. 14,100 సహాయం అందించారు.మన రక్షకుని సహకారం గ్రూపు సభ్యులు రూ. 6000 లు వెరసి మొత్తం రూ. 20,100లు సహాయం చేశారు.ఈ కార్యక్రమం జాలెం రమేష్,చామంతి పండు ఆధ్వర్యంలో జరిగింది.

# రామచంద్రపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం



**కిర్లంపూడి,, జులై 15 , ( ప్రభాతవార్త ) :**
మండలంలోని రామచంద్రపురం గ్రామంలో ఏవో సుధా మాధురి ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏవో సుధా మాధురి మాట్లాడుతూ సార్వా సీజన్ ప్రారంభం కావడంతో రైతులందరూ దమ్ములు చేపట్టి నారుమడులు వేసుకోవాల్సిందిగా రైతులకు సూచించారు.అలాగే రైతులు విత్తనాలు విత్తే ముందు విత్తన శుద్ధి పాటించాలని,కౌలు రైతులు తప్పకుండా కౌలు కార్డులు తీసుకోవాలని మరియు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద అందరూ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని రైతులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు పాఠంశెట్టి హరికృష్ణ,పి వెంకటలక్ష్మి మరియు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# వ్యక్తిగత మరుగుదొడ్లనే వినియోగించాలి..వక్కలంకలో కేంద్ర బృందం పర్యటన

**అంబాజీపేట, జులై 15 , ( ప్రభాతవార్త ) :**
పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యతని, వ్యక్తిగత మరుగుదొడ్లను వినియోగించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కేంద్ర బృందం ప్రతినిధులు యం ప్రకాష్,కె. శ్రీనివాసరావు, పి.ప్రవీణ్ కుమార్ లు అన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని వక్కలంక గ్రామంలో కేంద్ర బృందం ప్రతినిధులు మంగళవారం పర్యటించి, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను తనిఖీ చేశారు.గత ప్రభుత్వంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలకు సంబంధించి 16 మంది లబ్ధిదారులను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిందని బృందం సభ్యులు తెలిపారు. వీరంతా మరుగుదొడ్ల నిర్మాణం చేట్టారా ,ఎలా ఉన్నాయి, వాటికి అయిన ఖర్చు తదితర అంశాలపై పరిశీలన చేసి వివరాలను సేకరించారు. అలాగే దీనితో పాటు గ్రామపంచాయతీ, దేవాలయం ,చర్చి,మసీదుల్లో ఒక్కొక్కటి మరుగుదొడ్డు నిర్మించాలన్నారు.అంగన్వాడీ



కేంద్రం, ప్రాథమిక పాఠశాల, హెల్త్ క్లీనిక్ వద్ద పారిశుధ్యం,నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. గ్రామంలో అమలవుతున్న తడి,పొడి చేత్త సేకరణ,పారిశుద్ధ్యం, మురుగు కాలువల శుభ్రత, అభివృద్ధి తదితర అంశాలపై వివరాలను నమోదు చేసుకున్నారు. అనంతరం ఈ నివేదికను కేంద్రానికి అందిస్తామని బృంద సభ్యులు తెలిపారు. నివేదిక ఆధారంగా పంచాయతీలకు ర్యాంకులను ఇస్తారన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మంగళవారం వక్కలంక గ్రామంలోనే పర్యటించామని, స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ సంస్థ ఆదేశాలతోనే గ్రామాల ఎంపిక జరుగుతుందన్నారు. అనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాలలో పారిశుధ్యం,ప్లాస్టిక్ వినియోగం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.కేంద్ర బృందం వెంట డిప్యూటీ ఎంపీడీఓ కె.శ్రీనివాస్, ఎంఈఓ మోకా ప్రకాష్, సర్పంచ్ వాసంశెట్టి రేవతి, ఎంపీటీసీ సభ్యురాలు పిల్లి సత్యవేణి, కార్యదర్శులు వి.తాతాజీ, కె.వి.వి.సత్యనారాయణలు ఉన్నారు.

# పిఆర్సీ అమలు కోరుతూ పెన్షనర్స్ ధర్నా



**కాకినాడ టౌన్ , జులై 15 , ( ప్రభాతవార్త ) :**
అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సమాఖ్య పిలుపు మేరకు, దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్ర కలక్టరేట్ల వద్ద జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా కాకినాడ జిల్లా, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు యం. వి. వీరభద్ర స్వామి, జనరల్ సెక్రటరిఎస్. యం. రామారావు ఆద్వర్యంలో మహధర్నా నిర్వహించడం జరిగింది. జిల్లా పెన్షనర్స్ సంఘం గౌరవ సలహాదారు ఆచంట రామారాయుడు, రాష్ట్ర సెక్రటరి జగదీశ్వరరావు మాట్లాడుతూ పెన్షన్ వేలిడేషన్ అమెండ్ మెంట్ బిల్లు రద్దు చేయాలని, కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ 'పే' కమిషన్ వెంటనే నియమించి ఐఆర్ ప్రకటించాలని, డి.ఏ బకాయిలు చెల్లించాలని, కాంప్రహెన్రివ్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్ అమలు చేయాలని, రైల్వే, విమాన రాయితీలు పునరుద్ధ రించాలని, డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమానికి మద్దతుగా ఏపీటీఆరేసే రాష్ట్ర అధ్యక్షుడు పాము శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి శశికుమార్,ఏపీ ఎన్జీవో సంఘనాయకులు వనుపులేటి శ్రీనివాస్, కార్యదర్శి పేపకాయల వెంకట కృష్ణ, ఉపాధ్యక్షుడు మూర్తి బాబు, ట్రజరి రిటైర్డ్ సంఘ జిల్లా అద్యక్షుడు కాదా వెంకట రమణ,కార్యదర్శి ఎ. శ్రీనివాసరావు, ఎద్యుకేషన్ ఉద్యోగ సంఘ అధ్యక్షుడు మొండీ రవికుమార్, రిటైర్డ్ ఇంటర్ మీడియట్ ఎద్యుకేషన్ రీజనల్ సెక్రటరీ పేర్రాజు. సెక్రటరీ శివకుమార్, పాల్ చంద్రరావు,ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు ఎ.సత్తిరాజు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కె.నగేష్, ఎమ్.శ్రీనివాస్, ప్రదీప్ కుమార్,జేఏసీ జిల్లామాజీ చైర్మన్ బూరిగ ఆశీర్వాదం ప్రసంగించారు. ఈధర్నా కార్యక్రమంలో పెన్షనర్స్ సంఘ నాయకులు నాయకులు జి. అప్పారావు, ఎమ్.నారాయణరావు, పిల్లి నాగరాజు, ఎ.భారతి దేవి, కమలాదేవి, నల్లా ఉషారాణి ఇతర జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# శక్తి యాప్ అవగాహన సదస్సులో పాల్గొన్నట్రైనీ డిఎస్పి

**కె.గంగవరం , జులై 15 , ( ప్రభాతవార్త ) :**
కె గంగవరం మండలం పామర్రు గ్రామంలో జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు రామచంద్రపురం డిఎస్పీ బి.రఘువీర్ ఉత్తర్వులతో ట్రైనింగ్ డిఎస్పి ప్రదీప్తి,సి.ఐ వెంకటనారాయణ, పామర్రు ఎస్సై షేక్ జానీ బాషా పామర్రు జిల్లా పరిషత్ హైస్కూల్, గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ సుమారు 250 మంది మహిళ విద్యార్థినిలకు శక్తి యాప్ యొక్క ప్రాధాన్యత, ఆవశ్యకత,వినియగం గురించి తెలియజేయడం జరిగింది.ఈ అవగాహన సదస్సులో భాగంగా ట్రైనీ డీఎస్పీ విద్యార్థులకు మహిళలపై జరిగే గృహహింస,వరకట్న వేధింపులు, అత్యవసర సమయాల్లో శక్తి యాప్ యొక్క వినియోగం, అత్యవసర సమయాల్లో పోలీస్ సేవలు ఏవిధంగా వినియోగించు కోవాలి ,112 కాల్స్ యొక్క ప్రాధా



న్యత,మహిళలపై పిల్లల మీద జరిగే లైంగిక వేధింపులు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అనే అంశంపై అవగాహన, సైబర్ నేరాలు మొదలగు అంశాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసి విద్యార్థులకు తెలియజేయడం జరిగింది.శక్తి యాప్ యొక్క ప్రాధాన్యత,ఏ విధంగా ఉపయోగి ంచు కోవాలి అవగాహన ఏర్పాటు చేసివిద్యార్థులకు వివరంగా చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# తెలుగుదేశం పార్టీలో వాసిరెడ్డి ఏసుదాసు కు ప్రత్యేక గుర్తింపు

## - రూరల్ టిడిపి కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరం



**కాకినాడ రూరల్ , జులై 15 , ( ప్రభాతవార్త ) :** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసుకు ఎప్పుడు పార్టీ లో ప్రత్యేక గుర్తింపు,సముచిత స్థానం తగిన గౌరవం ఉంటుందని ఆ పార్టీకి చెందిన శాసనసభ్యులు,ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. దాసు జన్మదిన సందర్భంగా మంగళవారం ఆయనకు పలువురు ప్రజాప్రతినిధులు కూటమి పార్టీలకు చెందిన నేతలు కార్యకర్తలు హాజరై భారీ ఎత్తున శుభాకాంక్షలు చెప్పారు. స్థానిక రమణయ్యపేట రోడ్డులో టీడీపీ కాకినాడ రూరల్ పార్టీ కార్యాలయం వద్ద దాసు జన్మదినం సందర్భంగా కిరణ్ కంటి ఆసుపత్రి వారిచే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జన్మదినం సందర్భంగా ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం చాలా ఆనందకరమని వారు వ్యక్తం చేశారు. దాసుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), నిమ్మకాయల చిన రాజప్ప, టీడీపీ నాయకులు చిక్కాల రామచంద్రరావు, పిల్లి అనంతలక్ష్మి, పిల్లి సత్యనారాయణ మూర్తి, పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్, నురుకుర్తి వెంకటేశ్వరరావు, రామదేవు సీతయ్య దొర, దేవి వెంకన్న, మల్లిపూడి వీరు బీజేపీ నాయకులు చిలుకూరి రామ్ కుమార్, ఎనిమిరెడ్డి మాల కొండయ్య, రంబాల వెంకటేశ్వరరావు, గట్టి సత్య నారాయణ తదితరులు హాజరై దాసుకు పూల మాలలు వేసి శాలువాలను కప్పి సన్మానించారు. సుదూర ప్రాంతాల నుంచి హాజరై జన్మదిన శుభాకాంక్షలు చెప్పడం పట్ల వారికి దాసు ధన్య వాదాలు ప్రకటించారు. తన జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన వారందరికీ వాసిరెడ్డి యేసుదాసు కృతజ్ఞతలు తెలిపారు.

పుట్టినరోజు పురస్కరించుకొని కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం పట్ల ఏసుదాసు సంతోషం వ్యక్త పరిచారు.

# పేద ప్రజలను మభ్య పెడుతున్న కూటమి సర్కార్

## - జగన్ మళ్ళీ సీఎం కావాలని వైసిపి మహిళా నేతల ఆధ్వర్యంలో అమ్మవారికి సారె

**కాకినాడ రూరల్ , జులై 15 , ( ప్రభాతవార్త ) :** కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రాష్ట్రంలోని పేద ప్రజలను మభ్యపెడుతూ మోసం చేస్తుందని కూటమి సర్కార్ ను వైసిపి రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి విమర్శించారు. రాష్ట్రంలో సంక్షేమం అభివృద్ధి జరగాలంటే మళ్ళీ జగనే సీఎం కావాలని వైసిపి మహిళ విభాగం ఆధ్వర్యంలో విజయవాడ కనకదుర్గ అమ్మవారికి సారె అందించి పూజలు నిర్వహించినట్లు నాగమణి తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ఇప్పటికే పేద ప్రజలు ఒక ఏడాది వారికి అందాల్సిన సంక్షేమ ఫలాలన్నింటినీ కోల్పోయారని రాష్ట్రాన్ని రాష్ట్ర ఖజానాను తాకట్టుపెట్టి అప్పుల ఆంధ్రగా మార్చేసారని పాలన



చేతకాక ప్రతిపక్ష నేతలపై ప్రత్యక్ష దాడులకు దిగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వానికి తెలుగుదేశం బిజెపి జనసేన పార్టీలో ఉన్న మహిళలే మహిళలుగా కనిపిస్తున్నారని వారికి రక్షణ కల్పించేందుకే ప్రభుత్వం పని చేస్తుందని మిగతా పార్టీల్లో ఉన్న మహిళలను నివేదించేందుకు ప్రభుత్వం తన అధికారాన్ని ఉపయోగిస్తుందని ఆమె విమర్శించారు. రాష్ట్రంలో పేదలకు మహిళలకు యువతకు బాల బాలికలకు రక్షణ కరువైందని ఈ కీచక పాలన పోవాలంటే మళ్లీ జగనన్న అధికారంలోనికి రావాలని ఆమె అన్నారు. ఈ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని అభివృద్ధిని విస్మరించి పెత్తందారులకు పట్టం కట్టే ప్రభుత్వమని అన్నారు. అందుకే పేదలకు మహిళలకు రక్షణ కల్పించాలని విజయవాడలోని కనకదుర్గమ్మ ఆలయానికి వెళ్లి రాష్ట్రంలోని వైసిపి మహిళా విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి సారెను సమర్పించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షులు వరుదు కళ్యాణి వివిధ జిల్లాల నుండి వచ్చిన మహిళ ప్రజా ప్రతినిధులు మహిళా కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

# ఈదరపల్లి వంతెన సుంద రీకరణకు ప్రణాళిక : కలెక్టర్ మహేష్ కుమార్

**కోనసీమ బ్యూరో, జులై 15 , ( ప్రభాతవార్త ) :** ఈదరపల్లి వంతెన ఎగువన దిగువన ఉన్న జంక్షన్ల అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసినట్లు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడించారు. మంగళవా రం స్థానిక కలెక్టరేట్ నందు మున్సిపల్ ఆర్ అండ్ బి రెవెన్యూ ఏపీ ఈడీసీఎల్ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించి ఇటీవల ఆధునికరించిన ఈదరపల్లి వంతెన ఎగువ దిగువ జంక్షన్ లను అ మ్ముడ మున్సిపల్ శాఖల సమన్వయంతో సుంద రీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు. ఎగువ దిగువ జంక్షన్లో



అభివృద్ధికి అధికారుల సమన్వయంతో పాటుపడాలని సూచిం చారు మ్యాప్ ఆధారంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సుందరీ కరణ పనులను పర్యవేక్షిం చారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి ఆర్డిఓ కే మాధవి,ఏపీఈడీసీఎల్ ఎస్సీ రాజకుమారి ఆర్ అండ్ బి ఎస్సీ రాము తదితరులు పాల్గొన్నారు.

# వాడపల్లి వెంకన్న'ను దర్శించుకున్న బీజేపీ జాతీయ నాయకులు పురిఘళ్ల రఘురామ్



**ఆత్రేయపురం , జులై 15 , ( ప్రభాతవార్త ) :** బీజేపీ జాతీయ నాయకులు పురిఘళ్ల రఘురామ్ కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మంగళవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు వేద పండితులు ఆలయం మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు దర్శనం అనంతరం వేద ఆశీర్వచనం అందించి ఆలయ చరిత్ర ,విశిష్టతను వివరించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ . కార్య నిర్వహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు శ్రీ స్వామివారి చిత్రపటం ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం, నియోజకవర్గం కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబు గౌడ్, అసెంబ్లీ కో కన్వీనర్ కోటిపల్లి దామోదర్ జిల్లా కార్యవర్గ సభ్యులు మద్దంశెట్టి శ్రీనివాసరావు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఫోనుగుపాటి శ్రీనివాస్,మండల అధ్యక్షులు వెంకటేశ్వరరావు, వి కిరణ్, బొర్రా ఆంజనేయులు,మంగేనా సురేష్ తదితరులు ఉన్నారు.

# కూటమి పాలనతో పేదల బతుకుల్లో వెలుగులు

## - సుపరిపాలనలో తొలి అడుగు లో ఎమ్మెల్యే సత్య ప్రభ

**శంఖవరం , జులై 15 , ( ప్రభాతవార్త ) :** కూటమి పాలనతో పేదల బతుకుల్లో వెలుగులు విరుజిల్లుతున్నాయని, ప్రత్తిపాడు శాసనసభ్యులు వ రుపుల సత్యప్రభ పేర్కొన్నారు.సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం శంకవరం మండలం లోని మండపం గ్రామంలో ఇంటింటా ప్రచారం చేసి కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. ప్రజల అభిప్రాయాలను మై టిడిపి యాప్ లో పొందుపరిచారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్య ప్రభ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం



అధికారంలోకి వచ్చిన ఈ ఏడాదిలో అభివృద్ధి, సంక్షేమానికి సమానం ప్రాధాన్యం ఇస్తూ పాలన సాగిం చడం జరుగుతుందని, కూటమి పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని, గత ఐదేళ్ళ వైసీపీ పాలనలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఇంటింటికీ వెళుతుంటే చైతన్యవంతులైన ప్రజలు ఆశీర్వదించి ఆదరిస్తున్నారని అన్నారు. ప్రచారంలో పాల్గొనేందుకు విచ్చేసిన ఆమెకు స్థానిక టిడిపి నేత పాలం చిన్న ఘన స్వాగతం పలికారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు మెట్ల రమణబాబు సీనియర్ టిడిపి నేత పర్వత సురేష్ రాష్ట్ర టిఎన్టియుసి ఉపాధ్యక్షులు వెన్న శివ టిడిపి నేత బద్ది రామారావు గాబు కృష్ణ రాజాల చిట్టిబాబు ఈగల దేవుళ్ళు బొమ్మిడి సత్తిబాబు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు

# కత్తిపూడి సొసైటీ అధ్యక్షులుగా కృష్ణమూర్తి

**శంకవరం , జులై 15 , ( ప్రభాతవార్త ) :** మండలంలోని కత్తిపూడి లో గల సొసైటీ అధ్యక్షులుగా గాబు కృష్ణమూర్తిని నియమించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక శాసన సభ్యురాలు పరుపుల సత్యప్రభ నియోజకవర్గంలో గల ఐదు సొసైటీల త్రీ సభ్య కమిటీ సభ్యులను ప్రకటించారు రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఆమె ఆకాంక్షించారు కత్తిపూడి సొసైటీ చైర్మన్ గా నియమించిన గాబు కృష్ణమూర్తి మాట్లాడుతూ రైతు శ్రేయస్సుకే కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని సొసైటీ ద్వారా రైతులు కనిపిస్తున్న అనేక పథకాలను రైతులు కు అందించడం జరుగుతుందన్నారు సొసైటీని మరింత బలోపేతం చేస్తూ రైతులు అన్ని సేవలను అందుబాటులో కి తేవడం జరుగుతుంది పేర్కొన్నారు గతంలో గ్రామ సర్పంచ్ గా ప్రజలకు సేవలు అందించడం జరిగిందని అదే అనుభవంతో ముందుకు సాగడం జరుగుతుందన్నారు తనపై నమ్మకంతో తనకి ఈ అవకాశం కల్పించిన స్థానిక శాసన సభ్యురాలు వరుపుల సత్య ప్రభ కు స్థానిక టిడిపి నేత వెన్న శివ తో పాటు పలువురు నేతలకు కృతజ్ఞతలు తెలియ



జేశారు సొసైటీ అధ్యక్షులుగా నియమించిన కృష్ణమూర్తిని పలువురు పూలమాలతో అభినందించారు అదే విధంగా శంకవరంలో గల సొసైటీకి గ్రామానికి చెందిన పర్వత వెంకట సత్యనారాయణ ను నియమించడం జరిగిందని తెలిపారు.

# కలెక్టరేట్ లో బెంచీల ఏర్పాటు



**కాకినాడ టౌన్ , జులై 15 , ( ప్రభాతవార్త )** భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బిఐ) తన సామాజిక బాధ్యతలో(సీఎస్సార్) భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి 25 సిమెంటు బెంచీలను అందించింది. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల వేదికకు జిల్లా వ్యాప్తంగా వందలాది మంది తమ సమస్యలను జిల్లా అధికారులకు విన్నవించేందుకు వస్తారు. జిల్లా పాలనా యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేసినా కుర్చీలు సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. దీనితో జిల్లా కలెక్టర్ సూచనలు మేరకు ఎస్బిఐ 25 సిమెంటు బల్లలు అందించింది.వీటిని కలెక్టరేట్ వెనుక లాన్ లో ఏర్పాటు చేశారు.

# 17న ఉపతపాలా కార్యాలయ భవన ప్రారంభోత్సవం

**కాకినాడ టౌన్ , జులై 15 , ( ప్రభాతవార్త ) :** ఈ నెల 17వ తేదీ గురువారం పెద్దాపురం మున్సిపల్ సెంటర్ వద్ద ఉప తపాలా కార్యాలయ ప్రారంభోత్సవం నిర్వహిస్తున్నట్టు కాకినాడ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కేంద్ర సమాచార, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వర్చువల్ గా ఉదయం 11 గంటలకు ప్రారంభిస్తారని అన్నారు.

జిల్లా ఇంచార్జి మంత్రి పొంగూరు నారాయణ, రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, ఎమ్మెల్సీలు నాగబాబు, కర్రి పద్మశ్రీ , పెద్దాపురం మున్సిపల్ చైర్మన్ బి. తులసి మంగతాయారు, ఎంఎల్ఏ నిమ్మకాయల చినరాజప్ప, చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్, బి.పి. శ్రీదేవి, ఐ పీ వో డి.యస్.వి.ఆర్.మూర్తి, జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తదితరులు హాజరు కానున్నారు.

# ఆదిత్య "సురేష్" కు డాక్టరేట్



**గండేపల్లి , జులై 15 , ( ప్రభాతవార్త ) :** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ మేనేజ్మెంట్ స్టడీస్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న "సురేష్ పర్ల"ఆదికవి నన్నయ యూనివర్సిటీ రాజమహేంద్రవరం నుండి డాక్టరేట్ సాధించినట్లు ఆదిత్య యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదికవి నన్నయ యూనివర్సిటీ రాజమహేంద్రవరం కు చెందిన ప్రొఫెసర్ డా. పి.ఉమామహేశ్వరి దేవి నేతృత్వంలో సురేష్ సమర్పించిన "థీసిస్ శీర్షిక: ఏ స్టడీ ఆన్ "ఫైనాన్సింగ్ ఛాలెంజెస్ ఆఫ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ప్రైజెస్'- విత్ రిఫరెన్స్ టు సెలెక్ట్ డిస్ట్రిక్ట్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్" అనే అంశంపై డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పొందారని తెలిపారు. డా. సురేష్ భవిష్యత్ లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ ఎన్. శేషారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్. ప్రో. ఎం.బి. శ్రీనివాస్. ప్రో. వైస్ ఛాన్సలర్.డా. ఎస్. రమాశ్రీ, డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, డా. రవి తంగజన్, రిజిస్ట్రార్ డా జి.సురేష్, మేనేజ్మెంట్ విభాగాధిపతి,వివిధ విభాగాల విభాగాధిపతులు ఉపాధ్యాయ సిబ్బంది సురేష్ కు అభినందనలు తెలిపారు.

# ఒమ్మంగి సొసైటీ చైర్మన్గా సత్యంశెట్టి సీతారామం



**ప్రత్తిపాడు , జులై 15 , ( ప్రభాతవార్త ) :** ఒమ్మంగి సొసైటీ చైర్మన్గా సత్యంశెట్టి సీతారామం నియమితులయ్యారు.సహకార పరపతి సంఘాలకు నూతన అధ్యక్షులతో పాటు సభ్యులను ప్రకటిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.రాష్ట్ర అగ్రికల్చర్ కోపరేటివ్ శాఖ చీఫ్ సెక్రటరీ బి రాజశేఖర్ జారీ చేసిన ఉత్తర్వులు మంగళవారం ఆయా సొసైటీలకు అందాయి. దీంతో మండలంలోని ఓమ్మంగి సొసైటీ చైర్మన్ గా సత్యంశెట్టి సీతారామం, పర్సన్ (డైరెక్టర్లు) కొప్పన శ్రీనివాసరావు, దేవర రామకృష్ణ యాదవ్, లంపకలోవ సొసైటీ చైర్మన్ గా వరుపుల రామకృష్ణ, పర్సన్ (డైరెక్టర్లు) మదినే వెంకన్న దొర, కంచిపాటి సూరిబాబు లు కూటమి ప్రభుత్వంలో మూడు పార్టీలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ నూతన అధ్యక్షులు,సభ్యులను ఎంపిక చేయడం జరిగిందని ఈ సందర్భంగా నూతన పాలకవర్గం అధ్యక్షులు, సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.

# కరెన్సీ నోట్లపై అంబేద్కర్ బొమ్మ ముద్రించాలి

**మామిడికుదురు., జులై 15 , ( ప్రభాతవార్త ) :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రాన్ని కరెన్సీ నోట్లపై ముద్రించేలా రాష్ట్రంలోని ఎస్సీ,ఎస్టీ పార్లమెంటు సభ్యులు పోరాటం చేయాలని కోరుతూ మండలంలోని ఈదరాడ గ్రామానికి చెందిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పోరాట సమితి అధ్యక్షుడు నల్లి శ్రీనివాస్ పార్లమెంట్ సభ్యులకు లేఖలు రాసినట్టు మంగళవారం మామిడికుదురులో విలేకరులకు తెలిపారు. ఆరవ తరగతి నుంచి డిగ్రీ వరకు అంబేద్కర్ జీవిత చరిత్రను భారత రాజ్యాంగాన్ని పాఠ్యాంశాలలో చేర్చాలని లేఖలో కోరారు.రాష్ట్రంలో ఎస్సీ,ఎస్టీ లపై దాడులు జరుగుతుంటే ఎంఎల్ఏ లు మౌనంగా ఉండటం మన సమాజాన్ని, రాజ్యాంగాన్ని అవమాన పరచడమే అన్నారు.ఎస్సీ,ఎస్టీ కార్పొరేషన్,సబ్ ప్లాన్నిధులు దారి మళ్లించినా మాట్లాడక



పోవడం అంబేద్కర్ ఆశయాలకు ద్రోహం చేసినట్టేనని శ్రీనివాస్ పేర్కొన్నారు.ఈ విష యాలపై ప్రజా ప్రతినిధులు గళవొత్తాలని ఆయన డిమాండ్ చేశారు.

# సుపరిపాలనలో తొలి అడుగుకు తెలుగు తమ్ముళ్లు వెనకడుగు

## - పి.గన్నవరం నియోజకవర్గంలో అయోమయంలో పడ్డ టిడిపి శ్రేణులు

**అంబాజీపేట , జులై 15 , ( ప్రభాతవార్త ) :** రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయిన సందర్భంగా సాధించిన విజయాలు,అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల అభిప్రాయాలు, సూచనలు తెలుసుకునేందుకు తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి పి.గన్నవరం నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్లు వెనకడుగు వేస్తున్నారు. రాజకీయంగా ఎంతో చైతన్యం కలిగిన పి. గన్నవరం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలమైన కేడర్ తో ముందుకు వెళ్తోంది. టిడిపి అధిష్టానం ఆదేశాలను పాటిస్తూ ఏ పక్షంలో ఉన్నా (అధికార, ప్రతిపక్ష) పాటించడమే వారి విధి. 2019-24 వరకు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం చేపట్టిన ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను వ్యతిరేకించి పోరాడిన చరిత్ర పి.గన్నవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీది. రాష్ట్రంలో 2024లో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పి.గన్నవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీలో మండల కమిటీల నియామకం రూపంలో వర్గ పోరు బహిర్గతమయి,రెండు వర్గాలుగా చీలిపోయింది. నియోజవర్గంలోని అంబాజీపేట,అయినవిల్లి, మామిడికుదురు మండలాల్లో గ్రామ కమిటీల అధ్యక్ష, కార్యదర్శుల ఓట్ల రూపంలో మండల కమిటీలు ఎంపిక నిర్వహించి,పి.గన్నవరం మండల కమిటీ ఎంపికను వాయిదా వేసినట్లు తెలిసింది.ఈనెల రెండు నుండి ప్రారంభించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నియోజకవర్గంలో అట్టహాసంగా ప్రారంభించి మూడు రోజులు నిర్వహించి, నాల్గవ రోజు నుంచి తెలుగు తమ్ముళ్లు గ్రామాల్లో కనిపించకుండా పోయారు. నియోజవర్గ టిడిపి కన్వీనర్ గా వ్యవహరిస్తున్న రాజోలు నియోజకవర్గంనకు చెందిన నాయకుడి ప్రమేయం తమకక్కర్లేదని,పి.గన్నవరం నియోజవర్గంలో తెలుగుదేశం పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనకుండా ఆయనను కట్టడి చేసే వరకు తాము పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనమని ఒక వర్గం పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తే, కొత్తపేట నియోజకవర్గం చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడి ప్రమేయం పి.గన్నవరం నియోజకవర్గంలో ఉన్నంతవరకు తాము పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటామని మరో వర్గం పార్టీ అధిష్టానానికి ఫిర్యాదులు చేశారని తెలిసింది. తెలుగుదేశం పార్టీ చేపడుతున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించకుండా మూడు రోజుల్లోనే మూలన పెట్టేశారు. అధికారం లేనప్పుడు ఐక్యంగా ఉండి, అధికారం చేపట్టిన తర్వాత వర్గాలుగా విడిపోవడంతో కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు.

జెండా పట్టుకుని ముందుకు నడిచే కార్యకర్త పార్టీ అభివృద్ధే కోరుకుంటాడని, పార్టీని తామే నడిపిస్తున్నామని భ్రమల్లో ఉండే మండల,నియోజవర్గ స్థాయి నాయకులే పార్టీ అభివృద్ధిని నీరుగారుస్తున్నారని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారం చేపట్టే ఏడాదైనా అయినా మండలాలు, నియోజకవర్గంలో పార్టీని నడిపించే నాయకత్వం లోటు కనిపిస్తోంది.ఎస్సీ రిజర్వ్ నియోజకవర్గమైన పి. గన్నవరంలో తెలుగుదేశం పార్టీకి గత ఆరేడేళ్ళుగా ఇన్చార్జి లేకపోవడం గమనార్హం. నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు, ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలలోకి తీసుకువెళ్లి, బలమైన వాణిని వినిపించగలిగే నాయకుడిని ఇన్చార్జిగా నియమించాల్సిన అవసరం తెలుగుదేశం పార్టీకి ఎంతైనా ఉంది. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ద్వారా ప్రభుత్వం తొలి ఏడాది సాధించిన విజయాలను ప్రజలకు చేరవేసి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి సిద్ధం కావాల్సిన తరుణంలో పి.గన్నవరం నియోజకవర్గంలో వర్గాల పోరు తెలుగుదేశం పార్టీకి నష్టం కలగజేస్తుందని పార్టీకి చెందిన సీనియర్ నాయకులు, కార్యకర్తలు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. ఇప్పటికైనా పార్టీ అధిష్టానం కల్పించుకుని పి.గన్నవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీలో ఏర్పడిన సమస్యను వీలైనంత తొందరగా పరిష్కరించి, పార్టీ నాయకులను, కార్యకర్తలను ఒక తాటిపైకి తీసుకురావాలని ఆ పార్టీ శ్రేణులు కోరుకుంటున్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,"Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

# ఫోన్ కేస్‌తోనూ ముప్పే !

అవసరం, వ్యాపకం.. అమ్మాయిలకు ఫోన్ ఇంతకే పరిమితం కావడం లేదు. అది వాళ్లకో ఫ్యాషన్ స్టేట్‌మెంట్ కూడా. అందుకే క్యూట్ బొమ్మలు, చెయిన్లు, స్టోన్లంటూ భిన్న ఫోన్‌కేస్‌లతో అలంకరించేస్తుంటారు. అయితే అది అందానికి చేటవుతోందని గుర్తించారా మరి?



ఒక్కసారి ఊహించుకోండి... ఉదయం లేచి ఫోన్ చేతిలోకి తీసుకున్న దగ్గర్నుంచి... దాన్ని ఎక్కడెక్కడ పెడతాం! మంచం, డెస్క్‌టాప్, టీపాయ్, మనం ఎక్కడుంటే దాన్ని అందుబాటులో పెట్టాల్సిందే. వీటిల్లో తెర కాస్త మేలు దానిమీద దుమ్ము కనిపించినా, జిడ్డుగా తోచిన శుభ్రం వేసేస్తాం. కానీ వెనకా శుభ్రం చేయాలన్న ఆలోచనే రాదు.

దీంతో అది కాస్త సూక్ష్మజీవులకు ఆవాసంగా మారుతుంది. వాటిని తాకి ఆ చేతులతో ముఖాన్ని తాకితే అవి కాస్త మన చర్మంలోకి చేరతాయి. దీనితో యాక్నే, నైట్‌వాడ్స్, బ్లాక్‌హెడ్స్ వంటి సమస్యలన్నీ. పైగా అన్నీ తయారయ్యేది సింథటిక్ పదార్థాలు, ప్లాస్టిక్‌తోనే, అంటే తయారీలో రసాయనాలు వాడాల్సిందే. ఈ అలర్జీలు, కాంటాక్ట్ డెర్మటైటిస్‌లకు కారణం. అంతేనా, కొన్నిసార్లు ఏదో పనిచేసుకుంటూ భుజానికి ముఖానికీ మధ్య ఫోన్ బంధించి ఉంచుతాం. లేదా మాట్లాడేటప్పుడు అనుకోకుండా చెవికి, చెంపకీ ఫోన్ అదిమి పెడతాం ఈ రాపిడి అక్కడి హెయిర్ ఫాలికల్స్ మీద ప్రభావం చూపడమే కాదు, యాక్నేకీ కారణమవుతుంది. కాబట్టి, ఈ సమస్యలు తప్పాలంటే ఫోన్‌తోపాటు దాని కేసుని తరచుగా శుభ్రం చేయాలి. అలాగే ఇప్పుడు ఆంటీబ్యాక్టీరియల్ మెటీరియల్‌తో తయారవుతోంది. వాటిని తెచ్చుకుంటే సరిగ్గా ఎప్పుడూ హెడ్‌ఫోన్‌లు, ఇయర్ పాడ్స్ నిడివి వాడినా యాక్నే, అలర్జీల నుండి దూరంగా ఉండొచ్చు. వీటితోపాటు స్కిన్ కేర్ హైజీన్... అంటే బయటికి వెళ్లొచ్చాక ముఖం శుభ్రం చేసుకోవడం, మేకప్ తొలగించుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకుంటే తిప్పలే ఉండవు. □

# మహిళలకు పథకాలపై అవగాహన కల్పిస్తూ..

**రైతులు, గిరిజనులు, మహిళలనే కాకుండా పల్లెల్లో అందరి కోసం అన్నీ తానై పనిచేస్తున్నారు లచ్చిపతిని శాంతి. దీని కోసం 'దీక్షా' స్వచ్ఛంద సంస్థను స్థాపించి వేల కుటుంబాల్లో మార్పు తెచ్చారు. అధికారులు సైతం ఈమె కృషికి అభినందనలు తెలుపుతున్నారు. ఆ ప్రయాణం గురించి తెలుసుకుందాం..**




అమ్మవాళ్లది రాజమహేంద్రవరం సమీపంలోని నీలధరాపుపేట. పెళ్లి తర్వాత విజయనగరం జిల్లా బాడంగి మండలం, వీరసాగరం వచ్చాక ఇక్కడి రైతులు, మహిళలు పడుతున్న ఇబ్బందుల్ని గమనించా. వీళ్లకోసం ఏదైనా చేయాలనుకున్నా. అప్పట్లో మా గ్రామ రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు లేక, బ్యాంకు రుణాలు అందేవి కాదు. అధికారుల సాయంతో పాసు పుస్తకాలు చేయించా. మహిళల కోసం 'అక్షర విజయం' కార్యక్రమాన్ని నిర్వహించా. నేనూ దూరవిద్యలో పిజి పూర్తి చేశా.

**నాబార్డ్ మెచ్చింది..**

గ్రామం కోసం కలసికట్టుగా పనిచేయాలని 1999 'దీక్షా మహిళా సంక్షేమ సంఘం' స్థాపించా. మొదట రోడ్లు, వీధులు, చెరువుల్ని బాగు చేసుకున్నాం. తర్వాత 'మన సంరక్షణ సమితి'లో భాగమై ప్రస్తుత పార్వతీపురం మన్యం జిల్లాలోని ఐదు గిరిజన గ్రామాల్లో చెట్ల సంరక్షణ, పోడు వ్యవసాయం, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన.. వంటివి చేపట్టాం. 2005లో గ్రామాల్లోని రైతులకు ప్రకృతి వ్యవసాయంపైన అవగాహన కల్పించా. మా గురించి తెలుసుకున్న నాబార్డ్.. రైతు క్లబ్‌లు పెట్టమంటూ 2012లో సూచించింది. మొత్తం 45 గ్రామాల్లో క్లబ్‌లు ఏర్పాటుచేశాం. వీటిద్వారా రైతులు తమ సమస్యల్ని చర్చించి అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించు కుంటారు. మా ప్రాంతంలో రైతుల నుంచి దళారులు తక్కువ ధరకు వ్యవసాయ ఉత్పత్తుల్ని కొనడమే కాకుండా, ఆ డబ్బు సమయానికి ఇచ్చేవారు కాదు. పరిష్కారంగా 'రైతుల జట్టు' ఉత్పత్తిదారుల కంపెనీని నాబార్డ్ సహకారంతో ఏర్పాటుచేసుకున్నాం. దీన్లో 10 గ్రామాలకు చెందిన రైతులు సభ్యులు 2017 నుంచి బెల్లం ప్రాసెస్ చేసి, మార్కెటింగ్ చేస్తున్నాం. అనకాపల్లి పరిశోధన కేంద్రం నుంచి బెల్లం పొడి, క్యూబ్స్, చాక్లెట్లు.. తయారీపైన శిక్షణ తీసుకున్నాం. రాగి లడ్డూలు, పల్లీ ఉండలు, సున్నుండలు తయారుచేస్తున్నాం. బెల్లం ప్రాసెసింగ్ పరిశ్రమ కోసం ఎంపి ఫుడ్ ప్రాసెసింగ్‌లో దరఖాస్తు చేయగా.. డిసిసిబి, యాప్ ద్వారా రూ.5 కోట్ల రుణం వచ్చింది. ఈ యూనిట్ అందుబాటులోకి వస్తే బెల్లంతో మరిన్ని ఉత్పత్తులు తెస్తాం. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం. అనుబంధ సంస్థలైన ఎఆర్ఎస్, కెవికెల ద్వారా పంట రైతులకు యాజమాన్య పద్ధతుల్లో శిక్షణ ఇచ్చి జీడి, పసుపు, తృణధాన్యాల్ని ప్రాసెసింగ్ చేయిస్తున్నాం.

**పథకాలపై అవగాహన...**

'దీక్షా' నిర్వహణలో రైతుల జట్టు, అక్షయ ధరణి, రైతు నేస్తం ఎఫ్‌పిసిలు ఉన్నాయి. మొత్తం 3500 మంది రైతులు వీటిలో అంకితభావంతో పనిచేస్తున్నారు. విశాఖకు చెందిన వై.లక్ష్మి, రైతుల జట్టుకు సిఇఒ, 'అక్షయ సిఇఒ లక్ష్మి.. మొదట్నుంచీ నాతో కలిసి ప్రయాణిస్తున్నారు. ఈ ఎఫ్‌పిసిలకు వ్యవసాయశాఖ, ఉద్యాన శాఖల నుంచి నిరంతర సహకారం, ప్రోత్సాహం అందుతున్నాయి. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నందుకు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పురస్కారం అందించడంతోపాటు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ (ఆర్ఇఎసి) సభ్యురాలిగా, ఆర్ఎఆర్ఎస్ గుంటూరు సలహాదారుగా నియమించింది. 750 మంది మహిళలకు టైలరింగ్‌లో, వివిధ వ్యవసాయ ఉత్పత్తులపై విలువ ఆధారిత ఉత్పత్తుల్ని తయారుచేసుకునేలా నాబార్డ్ సహకారంతో శిక్షణ ఇచ్చాం. వీరందరికీ డిసిసిబి ద్వారా రుణాలనూ అందించాం. మేం పనిచేసే ప్రతిచోటా ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు అందేలా అవగాహన కల్పిస్తున్నాం. గిరిజన గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తూ వాలంటీర్లకు 'గూంజ్' స్వచ్ఛంద సంస్థ సహకారంతో గృహోపకరణాల కిట్లు అందిస్తున్నాం. ఉచిత నేత్ర శిబిరాలు నిర్వహించి ఇప్పటివరకూ 30 వేల క్యాటరాక్ట్ ఆపరేషన్లు చేయించాం. 'లీఫార్మసీ-విశాఖపట్నం సంస్థ ద్వారా రక్తహీనత ఉన్న 1500 మంది గిరిజన గర్భిణులకు ప్రతి నెలా పౌష్టికాహారం అందిస్తున్నాం. □

# శాకాహారుల మెనూలో..




**శరీరంలో జీవక్రియలు సక్రమంగా జరగాలన్నా, కండరాలు బలోపేతం కావాలన్నా ప్రొటీన్లు ఎంతో అవసరం. ప్రత్యేకించి ఉదయాన్నే నిద్ర లేచింది మొదలు.. ఊపిరి సలపని పనులతో నిత్య బిజీగా ఉండే మహిళలు అలుపు లేకుండా ఉత్సాహంగా ఉండాలంటే ప్రొటీన్లు అధికంగా ఉండే** ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి. అయితే ఇవి ఎక్కువగా లభించే మాంసాహారం, కోడిగుడ్లను పక్కన పెట్టి శాకాహారానికే ప్రాధాన్యమిస్తుంటారు కొందరు. ఇలాంటి వారు ప్రొటీన్లు పొందాలంటే ఈ పదార్థాల్ని మెనూలో చేర్చుకోవాలంటూన్నారు నిపుణులు.



**పప్పుధాన్యాలు....** కందులు, పెసలు, మినుములు మొదలైన వాటిలో ఉండే పోషకాలతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. పప్పుధాన్యాల్లో ప్రొటీన్లు అధికంగా ఉంటాయి. వీటిలోని పీచు పదార్థాలు కూడా శరీర బరువును క్రమబద్ధీకరిస్తాయి. అదేవిధంగా వీటిలో ఉండే ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు గుండె సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ డయాబెటిస్ లాంటి దీర్ఘ కాలిక వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయి.



**చిక్కుళ్లు...** కిడ్నీ బీన్స్ (రాజ్మా), బ్లాక్ బీన్స్.. వంటి చిక్కుడు జాతికి చెందిన పదార్థాల్లో ప్రొటీన్లు అధికంగా ఉంటాయి. వీటిని ఆహారంలో భాగం చేసుకుంటే ప్రొటీన్లతో పాటు బి-విటమిన్, ఫైబర్ శరీరానికి పుష్కలంగా అందుతాయి. అలాగే వీటిలోని యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు.. గుండె జబ్బులు, క్యాన్సర్ లాంటి వ్యాధుల నుంచి రక్షణనిస్తాయి.



**నట్స్...** ప్రొటీన్లతో నిండి ఉండే బాదం పప్పు, పిస్తా, అక్రోట్ వంటి గింజలను ప్రతిరోజూ తీసుకుంటే గుండెకు ఎంతో మేలు కలుగుతుంది. వీటితో పాటు కొన్ని రకాల విటమిన్లు ఫైబర్ శరీరానికి అందుతాయి. అయితే నట్స్‌లో క్యాలరీలు కూడా ఎక్కువగానే ఉంటాయి. కాబట్టి మితంగా తీసుకోవడం మంచిదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

**.పచ్చి బఠాణీలు..**ఒక కప్పు పచ్చి బఠానీల్లో 8 గ్రాముల వరకు ప్రొటీన్ ఉంటుంది. వీటిలోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు శరీరం లోని చెడు కొలెస్ట్రాల్ స్థాయుల్ని తగ్గిస్తాయి. తద్వారా క్యాన్సర్, డయాబెటిస్ లాంటి దీర్ఘకాలిక వ్యాధుల నుంచి దూరంగా ఉండచ్చు. ఇక వీటిలో 'ఎ'. 'కె', 'సి'.. విటమిన్లు, ఫైబర్ వంటి పోష కాలు కూడా సమృద్ధిగా లభిస్తాయి.

**సోయా బీన్స్...** సోయా బీన్స్‌లో మాంసాహారానికి సరిసమానమైన స్థాయిలో ప్రొటీన్లు ఉంటాయి. ఇందు లోని బి, డి, ఇ- విటమిన్లు, క్యాల్షియం, ఐరన్, జింక్, అన్‌శ్యాచురేటెడ్ ఫ్యాటీ ఆమ్లాలు శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయులను తగ్గించి.. రక్తపోటును నివారి స్తాయి. సోయాలో ఉండే యాంటీ ఆక్సిడెంట్ సమ్మేళనాలు మహిళల్లో మెనోపాజ్ దుష్ప్రభావాల్ని తగ్గించడంతో పాటు రొమ్ము క్యాన్సర్ నుంచి కూడా రక్షణ కల్పిస్తాయి. □

## చెలి చిట్కా

✦ సూప్‌ను స్టవ్‌మీద నుండి దించి రెండుచెంచాల పాలమీగడ కలపండి రుచిగా ఉండటమే కాక చిక్కదనం వస్తుంది. ✦ బ్రష్‌ను ఉప యోగించేముందు ఉప్పునీటిలో కొంచెం నానబెట్టండి. వేడినీరు వాడండి. ✦రాత్రి పడుకోబోయే ముందు మౌత్‌వాష్ చేసుకోవాలి. □

# చింతించడానికీ ఓ సమయం..

మనిషో చోట... మనసో చోట... చాలామంది అమ్మాయిలూ, మహిళలు ఎదుర్కొన్న పరిస్థితే ఇది, దీనంతటికీ కారణం మైండ్‌ఫుల్‌నెస్ లేకపోవడం. చేస్తోన్న పని మీద మనసు నిలవకపోవడం దీనికన్నా ముఖ్యమైన విషయాలు మనసుని వేధిస్తూ ఉండటం.



ఇకపై ఇలా కాకూడదంటే... వ్యాయామాలకీ అల్పాహారానికి, భోజనానికి, పని సమయాన్ని ఎలా కేటాయిస్తామో.... సమస్యల కోసం ఆలోచించడానికీ ఓ సమయం కేటాయించాలి. దాన్నే 'వర్రీ విండో టైం' అంటున్నారు నిపుణులు.

15-20 నిమిషాలు చాలు! రోజులో మనకు వచ్చిన ప్రతికూల ఆలోచనలన్నీ ఓ చోట రాకుంటే ఉదయం ప్రయాణాల్లోనో, పనులన్నీ అయిపోయాకో, బ్రేక్ సమయంలో రాసిన వాటి ఎంపికగా చదువుతూ... వాటికోసం ఆలోచించమంటున్నారు. దీనికి పూర్తిగా 15-20 నిమిషాలు సరిపోతాయి. అలా చేయడం వల్ల ఒకదాని మీదే దృష్టి కేంద్రీకృతమై ఉంటుంది. దాంతో సమస్యలకు పరిష్కారాలు దొరుకుతాయి. కొన్ని వాటిని ఎలావచ్చో మైండ్ ఆలోచిస్తుంది. మైండ్ ఫుల్‌నెస్ టెక్నిక్ ఇది. నిర్ణీత సమయం తర్వాత ఆలోచనల్ని వెంటనే కట్టడి చేయాల్సిన బాధ్యత కూడా మీదే అంటే మనసూ, మైండ్ మీద నియంత్రణ ఈ స్థాయిలో ఉండాలంటోంది ఈ పద్ధతి. ఇంట్లో ఉండే నెగిటివిటీనీ, దుమ్మూ, దూళినీ బయటికి పంపడానికి ఎలా అయితే... ద్వారాలు, కిటికీలు తెరుస్తామో... అలానే మన మైండ్‌లో ఉండే ప్రతికూల ఆలోచనల్ని తరిమేయడానికి ఈ సమయాన్ని ఉపయోగించుకోమంటోంది వర్రీ విండో పద్ధతి అందుకే దీని పేరు కూడా. అయితే రాత్రిళ్లు, నిద్రపోయేముందు మాత్రం దీనికి సమయం కేటాయించొద్దు అంటున్నారు నిపుణులు. ఎందుకంటటే ఈ సమయంలో ఆలోచనల్ని అదుపు చేసుకోవడం కష్టమట. □

# కాఫీ ప్రేమికుల కోసం..

ఓ కప్పు వేడివేడి కాఫీ తాగితే.. వర్క్‌టెన్షన్ పరార్ కదా! ఇందుకు ప్రతిసారీ వంటగది, పాంట్రీకి వెళ్లనక్కర్లేదు. ఈ మగ్ వార్మర్ ఒకటి మీ దగ్గర ఉంటే చాలు. క్షణాల్లో మీరున్నచోటు నుంచే కాఫీ చేసుకుని తాగేయొచ్చు మరి. ఒక్క కాఫీ మాత్రమే కాదు వేడివేడి సూప్‌లను సైతం తయారుచేసుకోవచ్చు. ఈ వాటర్ ప్రూఫ్ మగ్ ఛార్జింగ్‌తో పనిచేస్తుంది. □



# ఒళ్లు విరుచుకుంటున్నారా?

పొద్దున నిద్ర లేవగానే ఒళ్లు విరుచుకుంటాం. ఎక్కువసేపు కూర్చొని చేసే పని పూర్తయ్యాక అప్రయత్నంగానే చేతులు చాచి, ఒళ్లు విరుచుకుంటాం. దీంతో పాటు తెలియకుండానే ఆవలిస్తాం కూడా. మనమే కాదు, పిల్లలు, కుక్కల వంటి చాలా జంతువులూ తరచూ ఒళ్లు విరుచుకుంటుంటాయి. ఇంతకీ దీంతో ఏమైనా ప్రయోజనముందా? ఒళ్లు విరుచుకుకోవటమనేది మెదడులోని హైపోథలమస్ భాగంలో మొదలవుతుంది. నిద్ర మ శరీర వంటి పనులను హైపోథలమస్ చేస్తుంది. దీన్నుంచి విడుదలైన హార్మోన్లు కార్టిజల్ వంటి ఇతర హార్మోన్లనూ ప్రేరేపిస్తుంది. కార్టిజాల్ ఒత్తిడి కారక హా అయినప్పటికీ జీవ గడియారంలో ఇదీ ఒక భాగమే. ఒళ్లు విరుచుకు పడుతున్నప్పుడు హాయి భావన కలగటానికి ఇది ఒక కారణం కావొచ్చు. లాభాలు చాలానే ఒళ్లు విరుచుకో వడంతో చాలా లాభాలే ఉన్నాయి. వయసు మీద పడుత విరుచుకోవటం తగ్గుతుండొచ్చు గానీ ప్రయోజనాల గురించి తెలిస్తే ఔరా అనాల్సిందే. ✦ కండర సంకోచాలను నియంత్రించే నాడులు తిరిగి గాడిలో పడతాయి. దీనితో ఎక్కువసే కదలకుండా ఉండటం వల్ల కండరాల్లో తలెత్తిన ఒత్తిడి తగ్గుతుంది. ఫలితంగా కండరాల వదులై కదలికలు సాఫీగా సాగుతాయి. ✦ లోపలి అవయవాలను పట్టి ఉంచే అనుసంధాన కణజాల పొరలు ఉత్తేజితమవుతాయి. అనుసంధాన కణజాలాల ఆరోగ్యం మెరుగవుతుంది. ✦ భంగిమను సరిచేసే కండరాలే శరీరం నిటారుగా ఉండటానికీ తోడ్పడతాయి. ఒళ్లు విరుచుకోవటం వల్ల ఉత్తేజితమయ్యే ఈ కండరాలు నడుస్తున్నప్పుడు తూలిపోకుండానూ కాపాడతాయి. □



# పిల్లలు నిజాయితీగా..

**పిల్లలు ప్రతి చిన్న విషయానికి అబద్ధం చెప్పడం, తాము తప్పు చేయడంలేదని వాదించడం వంటివి చేస్తున్నారంటే అది తల్లిదండ్రులను చూసి నేర్చుకుంటూ ఉండొచ్చు. అబద్ధాలు చెప్పే అలవాటు పెద్దవాళ్లకు ఉంటే గనుక పిల్లలు గ్రహిస్తారు. అదే విధానాన్ని అనుసరిస్తారు.** తాము నిజం మాట్లాడకుండా పిల్లలను మాత్రం పాటించాలని చెప్పడం మంచిది కాదు. వారిలో మార్పు తేవాలని అనుకోవడం కన్నా ముందుగా తల్లిదండ్రుల్లో మార్పు రావాలి. ఆ తర వాతే.. పిల్లలకు నేర్పించాలి. ఉన్నదున్నట్లుగా నిజాన్ని మాత్రమే మాట్లాడగలగడం, నిజాయితీగా ఉండటం వల్ల ఎటువంటి ప్రయోజనాలు ఉంటాయో కథల ద్వారానూ వినిపించాలి.

**అడిగి తెలుసుకోండి...** రోజూ కొంత సమయాన్ని పిల్లలతో గడపాలి. వారితో చర్చిస్తూనే వారి ఆలోచనలను పంచుకోవాలి. ఆ రోజు విశేషాలను అడిగి తెలుసుకుంటూనే ఆయా సందర్భాల్లో పిల్లలెలా ప్రవర్తించి ఉంటారో గుర్తి



చాలి. చుట్టుపక్కలవారితో అనుబంధాన్నెలా కొనసాగిస్తు న్నారో తెలుసుకోవాలి. స్నేహితుల ఆలోచనలను అర్థం చేసుకోవడంతోపాటు వారిపట్ల నిజాయితీగా ఉండటం వల్ల ఎటువంటి ప్రయోజనాలు ఉంటాయో కథల ద్వారానూ వినిపించాలి.

**అడిగి తెలుసుకోండి...** రోజూ కొంత సమయాన్ని పిల్లలతో గడపాలి. వారితో చర్చిస్తూనే వారి ఆలోచనలను పంచు కోవాలి. ఆ రోజు విశేషాలను అడిగి తెలుసుకుంటూనే ఆయా సందర్భాల్లో పిల్లలెలా ప్రవర్తించి ఉంటారో గుర్తిం చాలి. చుట్టుపకనకలవారితో అనుబంధాన్ని కొనసాగి స్తున్నారో తెలుసుకోవాలి. స్నేహితుల ఆలోచనలను అర్థం చేసుకవోడంతోపాటు వారిపట్ల నిజాయితీగా ఉంటే, ఆ బంధాలను కలకాలం నిలుపుకోగలమన్న అవగాహన కలిగించాలి.

**ప్రశంసిస్తేనే...** మార్కుల విషయంలో మాత్రమే కాకుండా పిల్లల ప్రవర్తన ప్రశంసాపూర్తకంగా కనిపిస్తే వెంటనే అభినందించాలి. దీంతో ఇతరులను ప్రశంసించగలిగే నిజాయితీ పిల్లలూ నేర్చుకుంటారు. అసూయ, ద్వేషం వంటివి ప్రదర్శించకుండా మనస్ఫూర్తిగా ఎదుటివారి గొప్ప తనాన్ని గుర్తించి అభినందించడం తెలుసుకుంటారు. దీని ద్వారా ఎదుటివారి విశ్వాసాన్నీ, ప్రేమనూ పొందవచ్చని ప్రయోగాత్మకంగానూ పిల్లలకు అర్థమవుతుంది. అందరితో సత్సంబంధాలను ఏర్పరుచుకోగలుగుతారు. □

# ధైర్యమే ఆయుధం..

ఆధ్యాత్మికం

స్వామి వివేకానంద పరివ్రాజక సన్యాసిగా దేశమంతా పర్యటిస్తూ వారణాసి వెళ్లారు. అంజనేయ ఆలయం దర్శించుకొని తిరిగివస్తున్నారు. ఇంతలో కోతుల సమూహం కనిపించింది. అన్ని కోతులు ఒకేసారి ఎదురొచ్చే సరికి ఏం చేయాలో తోచక వెనుతిరిగారు. అవి వెంబడించసాగాయి. స్వామీజీ నడక వేగాన్ని పెంచారు. మర్కటాలూ అంతే వేగంగా తరమసాగాయి. నిస్సహాయస్థితిలో స్వామీజీ అటూ ఇటూ చూస్తున్నారు. ఇంతలో దగ్గర్లో చెట్టుకింద ఓ వృద్ధసాధువు 'అవేమీ చేయవు. భయపడకుండా ధైర్యంగా ఎదుర్కో అని హితవు పలికారు. దాంతో వివేకానంద పరుగు ఆపి నిర్భయంగా, స్థిమితంగా నిలబడ్డారు. తదేక దీక్షతో కోతుల వంక చూశారు. అంతే అవి తోకముడిచి పారిపోయాయి. కొన్ని సంవత్సరాల తర్వాత స్వామీజీ న్యూయార్క్‌లో ప్రసంగిస్తూ వారనాసి సంఘటన ప్రసావించారు. ఆ ఉదంతం నుంచి దేన్నయినా ధైర్యంగా ఎదుర్కోవాలనే పాఠం నేర్చుకున్నాను. సమస్యలను చూసి పారిపోకుండా నిర్భయముగా నిలిస్తే ఎంతటి భయానక పరిస్థితులైనా చక్క బడతాయి. జీవితంలో ఎదురయ్యే కష్టాలు ఆ కోతుల్లాంటివే! మనం భయపడితే, అవి భయపెడతాయి. ఎదురుతిరిగితే అవే పారిపోతాయి. పిరికివాళ్లకు పిల్లి కూడా పులిలాగే కనిపిస్తుంది. ధీశాలులు పులిని చూసినా భయపడరు. వాళ్లను ఏ అవాంతరాలూ అడ్డుకోలేవు. ధైర్యమే ఆయుధమౌతుంది అంటూ ఉద్ఘాటించారు. □



# కొల్హాపురీ గుడ్డుకూర

**గుడ్లతో ఆమ్లెట్**, ఇగురు, పులుసు, బుర్జీ ఇలా ఎన్నో రకాలుగారుచికరమైంది, ఎంతో ప్రసిద్ధి పొందింది కొల్హాపురీ ఎగ్ కర్రీ. మహా ఇది ప్రసిద్ధం. కొల్హాపురీ మసాలాతో చేసే ఈ కూర వేరే లెవెల్లో ఉంటుంది.

కావలసినవి: గుడ్లు 6, ఉల్లితరుగు కప్పున్నర, టొమాటో ముక్కలు పేస్ట్, కొల్హాపురి మసాలా, ధనియాల పొడి, కారం చెంచా చొప్పున, ప పొడి, ఆవాలు, మెంతులు పావు చెంచా చొప్పున, నూనె 2 టేబుల్ తగినంత, కొత్తిమీర తరుగు పావు కప్పు

**తయారీ:** ముందుగా గుడ్లను ఉడకబెట్టి సిద్ధంగా ఉంచాలి. ప్యాన్‌లో నూనె వేయాలి. అవి చిటపటలాడుతున్నప్పుడు.. జీలకర్ర, మెంతులు.. ఉల్లిపా ఉల్లితరుగు బంగారురంగులోకి మారాక.. అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి నిమిషం వేయించాలి. టొమాటో ముక్కలు కలపాలి. అవి మెత్తగా అయ్యాక.. కొన్ని నీళ్ల, ధనియాల పొడి, కారం, పసుపు, జీలకర్ర పొడి జోడించి కలపాలి. నాలుగైదు నిమిషా తర్వాత ఉడికించిన గుడ్లకు మధ్యలో గాటుపెట్టి వేయాలి. ఓసారి రుచి చూసి కారం, ఉప్పు తగ్గితే ఇంకొంచెం వేసి.. సన్న సెగ మీద ఇంకో రెండు నిమిషాలు ఉడక నివ్వాలి. వేసి కలియబెట్టి దించాలి. అంతే.. అదిరి పోయే కొల్హాపురీ గుడ్డు కూర సిద్ధమైనట్లె. □



# తెర



# జూనియర్‌కి బాస్..

ప్రముఖ రాజకీయ నాయకుడు, వ్యాపారవేత్త గాలి జనార్ధన్ రెడ్డి కుమారుడు కిరీటి రెడ్డి రాధా కృష్ణ దర్శకత్వం వహించిన యూత్ ఎంటర్‌టైనర్ జూనియర్‌తో హీరోగా అరంగేట్రం చేస్తున్నాడు. శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. జెనీలియా కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ సినిమాలో నాది ఒక మంచి బాస్ క్యారెక్టర్. సినిమా ముందు కెళ్తున్న కొద్ది ఆ క్యారెక్టర్‌లో చాలా మార్పులు వస్తాయి. అవన్నీ కూడా చాలా కొత్తగా ట్రీట్ చేశారు డైరెక్టర్. జీవితమన్నప్పుడు అన్ని ఉంటాయి. అయితే ఎన్నో అద్భుతమైన సినిమాలు చేశాను. బొమ్మరిల్లు హాసిని వెరీ మెమొరబుల్ క్యారెక్టర్. అలాగే హ్యాపీలో మధుమతి, కథ సినిమా.. ఇప్పటికీ ఆడియన్స్ నా క్యారెక్టర్స్ పేరుతోనే నన్ను పిలుస్తుంటారు. అది ఒక నటిగా చాలా గొప్ప ఆనందాన్ని ఇస్తుంది. మంచి క్యారెక్టర్స్ వస్తే నటించడానికి నేను సిద్ధంగా ఉన్నాను. చిన్న క్యారెక్టర్ అయినా గుర్తుండిపోయే క్యారెక్టర్ చేయడం నాకు ఇష్టం. ఇండస్ట్రీలోకి రావడం, ఇన్ని పాత్రలు చేయడం, ప్రేక్షకుల నుంచి విశేషమైనటువంటి అభిమానాలు పొందడం ఇదంతా కూడా నాకు ఒక డ్రీమ్ లాగా అనిపిస్తుంది. ఇంతకుమించిన డ్రీమ్ ఏమీ లేదు. మజిలీ రీమేక్ చేశాం. అది అద్భుతమైన విజయాన్ని ఇచ్చింది. మరో మంచి లవ్ స్టోరీ కుదిరితే సినిమా చేయాలని ఆలోచన అయితే ఉంది.




### ఓ రాజకీయ కుటుంబ నేపథ్యం

# ప్రభుత్వ సారాయి దుకాణం

జాతీయ అవార్డ్ దర్శకులు నరసింహ నంది తాజాగా ఎస్వీఎస్ ప్రొడక్షన్స్, శ్రీనిధి సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ప్రభుత్వ సారాయి దుకాణం సినిమా ఫస్ట్‌లుక్ విడుదల కార్యక్రమం గ్రాండ్‌గా జరిగింది. ఈ కార్యక్రమంలో నిర్మాత ప్రసన్న కుమార్, దర్శకులు సముద్ర, నటుడు పృథ్వీతో పాటు చిత్ర యూనిట్ పాల్గొన్నారు. షేక్స్పియర్ కథలోని పాత్రల ఆధారంగా తీసుకొని తెలంగాణలో ఒక మారుమూల ప్రాంతంలో జరిగే పొలిటికల్ ఫ్యామిలీ ఇతివృత్తంగా పగ, ద్వేషం, ఈర్ష్య, అసూయ, ప్రేమ మనిషిలోని వివిధ కోణాలను చూపిస్తూ ప్రభుత్వ సారాయి దుకాణం సినిమా కథను తయారు చెయ్యడం జరిగింది. 1980 నాటి పరిస్థితులు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మలిచారు. ఈ సందర్భంగా దర్శకులు నరసింహ నంది మాట్లాడుతూ కమర్షియల్ అంశాలతో కూడుకున్న కథ ఇది. అన్ని వర్గాల ప్రేక్షకులు ఈ కథకు కనెక్ట్ అవుతారని తెలిపారు. దర్శకుడు సముద్ర మాట్లాడుతూ....నేను నరసింహ నంది మంచి స్నేహితులం. ప్రతి సినిమా విభిన్నంగా చేస్తూ వచ్చారు. ప్రభుత్వ సారాయి దుకాణం మోషన్ పోస్టర్ చాలా బాగుంది అని అన్నారు. నిర్మాత ప్రసన్న కుమార్ మాట్లాడుతూ నరసింహ నంది డైరెక్ట్ చేసిన 1940లో ఒక గ్రామం సినిమాకు నేషనల్ అవార్డ్ రావడం విశేషం. ఈ చిత్ర యూనిట్ చాలా క్రమశిక్షణతో కనిపిస్తున్నారు. ఆర్టిస్ట్‌గా కాకుండా గెస్ట్‌గా వచ్చిన పృథ్వి ఈ సినిమా చాలా బాగుందని చెపుతున్నారు. తప్పకుండా ఆయన మాటలు నిజం కాబోతున్నాయని తెలిపారు. నటుడు పృథ్వి మాట్లాడుతూ ఈ సినిమాలో మా అమ్మాయి శ్రీలు చక్కటి రోల్‌లో నటించింది. తనతో పాటు అందరికి ఈ సినిమా ఒక మంచి బ్రేక్ రావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. నిర్మాత నరేష్ గౌడ మాట్లాడుతూ.... త్వరలో మా ప్రభుత్వ సారాయి దుకాణం సినిమా థియేటర్స్ లో అందరిని అలరించబోతోందన్నారు. నిర్మాత పరిగి మల్లిక్ మాట్లాడుతూ నరసింహ నంది ప్రాణం పెట్టి ఈ సినిమాను తెరకెక్కించాని చెప్పారు. హీరో విక్రమ్ మాట్లాడుతూ..ఈ చిత్రం తప్పకుండా మీ అందరికి నచ్చుతుందని భావిస్తున్నానన్నారు. ఈ సినిమా నా కెరీర్‌లో ఒక మంచి సినిమాగా మిగిలిపోతుందని నమ్మకం ఉంది అని హీరో సదన్ పేర్కొన్నారు. హీరో వినయ్, హీరోయిన్ అధితి మైకేల్, హీరోయిన్ శ్రీలు దాసరి, హీరోయిన్ మోహన సిద్ది, నటుడు తిలక్ తదితరులు మాట్లాడారు.

## 18న ఓం సంత్ తుకారాం

పదిహేడవ శతాబ్దపు మరాఠీ సాధువు, కవి భక్తిని ప్రతిఘటనగా మార్చిన సంత్ తుకారాం జీవితం, వారసత్వం, సాహిత్య విప్లవం ఆధారంగా దర్శకుడు, నిర్మాత, నటుడు అయిన ఆదిత్య ఓం సంత్ తుకారం చిత్రాన్ని రూపొందించారు. ఈ చిత్రంలో ప్రముఖ మరాఠీ నటుడు సుబోధ్ భావే టైటిల్ రోల్‌ను పోషిస్తున్నారు. మరాఠీ, హిందీ సినిమాల్లో భావే తన అద్భుతమైన నటనతో అందరినీ మెప్పించారు. ఈ చిత్రం జూలై 18న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ క్రమంలో తాజాగా ఈ మూవీకి సంబంధించిన రిలీజ్ డేట్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో శివ సూర్యవంశీ, షీనా చోహన్, సంజయ్ మిశ్రా, అరుణ్ గోవిల్, శిశిర్ శర్మ, హేమంత్ పాండే, గణేష్ యాదవ్, లలిత్ తివారీ, ముఖేష్ భట్, గౌరీ శంకర్, ట్వింకిల్ కపూర్, రూపాలి జాదవ్, దీరి అక్బర్ సామి వంటి ప్రఖ్యాత నటులు కీలక పాత్రలకు జీవం పోశారు. ప్రముఖ నటుడు ముఖేష్ ఖన్నా ఇచ్చిన వాయిస్ ఓవర్ సినిమాకి హైలెట్ కానుంది. నిఖిల్ కామత్, రవి త్రిపాఠి, వీరల్, లావన్ స్వరపరిచిన పాటలు అందరినీ ఆకట్టుకోనున్నాయి. శాస్త్రీయ,



జానపద, భక్తి భావాల్ని కలిగించేలా పాటలు ఉండనన్నాయి. ప్రతి పాట తుకారాం పాత్ర భావోద్వేగ, తాత్విక పరిణామాన్ని ప్రతిధ్వనిస్తుంది. పురుషోత్తం స్టూడియోస్‌తో కలిసి బి. గౌతమ్‌కు చెందిన కర్జన్ ఫిల్మ్స్ నిర్మించిన ఈ చిత్రం పాన్ఇండియా వైడ్‌గా రిలీజ్ కాబోతోంది.

### హాలీవుడ్ స్థాయికి

# హైదరాబాద్ ఎదగాలి

**శ్రీమద్ భాగవతం తెలంగాణ సినిమా పరిశ్రమకు కొత్త ఊపిరి అవుతుంది**

**చిత్ర షూటింగ్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్ష**

హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మక రామోజీ ఫిల్మ్ సిటీలో 'శ్రీమద్ భాగవతం పార్ట్ 1' చిత్రం షూటింగ్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భారత సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్, శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే రంగారెడ్డి, ప్రముఖ నిర్మాత మోతీ సాగర్, రామోజీ గ్రూప్ ఎండీ కిరణ్, విజయేశ్వరి (ఎండి, రామోజీ ఫిల్మ్ సిటీ) తదితర ప్రముఖులు ఈ వేడుకలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీమద్ భాగవతం సినిమా తీయాలన్న ఆలోచన వచ్చినందుకు సినిమా టీమ్‌ను అభినందిస్తున్నా. తరం మారుతున్న ఈ సమయంలో శ్రీమద్ భాగవతం లాంటి సినిమాలు చాలా అవసరం. నలభై ఏళ్ల క్రితం రామాయణం సీరియల్ రామాయణాన్ని అందరికీ చేరువ చేసింది. కోవిడ్ టైమ్‌లో మళ్లీ రామాయణం సీరియల్‌ను టెలికాస్ట్ చేస్తే రికార్డు సృష్టించింది. 2035 లోగా తెలంగాణను 1 ట్రిలియన్ ఎకానమిగా తీర్చి దిద్దాలని మేం సంకల్పించాం. 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమిగా తీర్చిదిద్దాలని ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఇందుకోసం 2047 విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేసుకుంటున్నాం.. ఇందులో సినిమా రంగానికి ఒక ప్రత్యేక చాప్టర్ ఉంటుంది. ఆనాడు రామానంద్ సాగర్ తీసిన రామాయణం సీరియల్ ఎంత పాపులర్ అయిందో.. శ్రీమద్ భాగవతం పార్ట్1 సినిమా అంత హిట్ అవ్వాలని కోరుకుంటున్నా.. రాబోయే రోజుల్లో హాలీవుడ్ సినిమాలు కూడా హైదరాబాద్‌లో షూటింగ్ చేసే స్థాయికి ఎదగాలని మా ఆకాంక్ష.. అని ఆయన పేర్కొన్నారు.

ఈ చిత్రం తెలంగాణలో సినిమా పరిశ్రమకు కొత్త ఊపిరి పోసే అవకాశం ఉందని, రామోజీ ఫిల్మ్ సిటీ వంటి అత్యాధునిక సౌకర్యాలు దీనికి దోహదపడతాయని సినీ పరిశ్రమ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. శ్రీమద్ భాగవతం పార్ట్1 చిత్రం తెలుగు సినిమా ఖ్యాతిని మరింత పెంచే దిశగా ఒక ముందడుగుగా భావిస్తున్నారు.




రామోజీ ఫిల్మ్ సిటీలో 'శ్రీమద్ భాగవతం పార్ట్ 1' చిత్రం షూటింగ్ ప్రారంభోత్సవానికి హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి

### ఎన్టీఆర్ పాత్రల ప్రేరణతో

# వీరమల్లు విల్లు



పవన్ కళ్యాణ్ ప్రతిష్టాత్మక చిత్రం హరి హర వీరమల్లు జూలై 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. తాజాగా ఈ చిత్రం గురించి దర్శకుడు జ్యోతి కృష్ణ ఒక ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు. హరి హర వీరమల్లు చిత్రంలో పవన్ కళ్యాణ్ పాత్రను రూపొందించడానికి దిగ్గజ నటులు ఎన్టీఆర్, ఎంజీఆర్‌ల నుండి ప్రేరణ పొందానని జ్యోతి కృష్ణ వెల్లడించారు. ఎన్టీఆర్, ఎంజీఆర్ వంటి దిగ్గజ వ్యక్తుల మాదిరిగానే పవన్ కళ్యాణ్‌లో ఉన్న అద్భుతమైన లక్షణాలను గమనించిన తర్వాతే ఆయన పాత్రను రాయడానికి ప్రేరణ పొందానని జ్యోతి కృష్ణ పేర్కొన్నారు. ధర్మపరుడిగా, బలవంతుడిగా మరియు ప్రజల మనిషిగా పవన్ కళ్యాణ్‌కి ఉన్న ఇమేజ్‌ను దృష్టిలో పెట్టుకొని హరి హర వీరమల్లులో ఆయన పాత్రను చాలా జాగ్రత్తగా రూపొందించినట్లు దర్శకుడు జ్యోతి కృష్ణ తెలిపారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా ఎంజీఆర్ సందేశాత్మక, నిజాయితీతో కూడిన సినిమాలు చేస్తూ నట జీవితాన్ని కొనసాగించారు. ఈ అంశం నాకు స్ఫూర్తినిచ్చింది. అందుకే హరి హర వీరమల్లులో 'మాట వినాలి' అనే శక్తివంతమైన మరియు ఆలోచింపజేసే పాటను స్వరపరిచాము. ఈ పాట యొక్క సారాంశం పవన్ భావజాలాన్ని ప్రతిబింబిస్తూ జీవితంలో సానుకూలత మరియు ధర్మాన్ని స్వీకరించడాన్ని తెలియజేస్తుంది. ఈ పాట ప్రేక్షకులను బాగా ప్రభావితం చేసింది.. అని జ్యోతి కృష్ణ అన్నారు. నటుడిగా ఎన్టీఆర్ యొక్క గొప్ప ప్రదర్శనలు పౌరాణిక మరియు జానపద చిత్రాల నుండి వచ్చాయి. ముఖ్యంగా రాముడు, కృష్ణుడు పాత్రలలో ఆయన ఒదిగిపోయిన తీరు చిరస్థాయిగా నిలిచిపోయింది. ఎన్టీఆర్ తన శక్తిని మరియు ధర్మాన్ని నిలబెట్టే సామర్థ్యాన్ని సూచించే విల్లు, బాణం పట్టుకున్న శ్రీరాముడిగా అద్భుతంగా చిత్రీకరించబడ్డారు. ఈ అంశం నుండి ప్రేరణ పొంది, హరి హర వీరమల్లులో పవన్ కోసం విల్లు, బాణాన్ని రూపొందించాము. పవన్ కళ్యాణ్ యొక్క శక్తిని సూచించడానికి, న్యాయం కోసం పోరాడటానికి మరియు ధర్మాన్ని నిలబెట్టడానికి ప్రతీకగా ఈ ఆయుధాలు రూపొందించబడ్డాయి అని జ్యోతి కృష్ణ వివరించారు. అలాగే తాను స్క్రిప్ట్ రాస్తున్నప్పుడు ప్రజలు పవన్ కళ్యాణ్‌ను కథానాయకుడిగా కాకుండా నాయకుడిగా చూస్తున్నారని గ్రహించానని ఆయన అన్నారు. కథనాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దేలా ప్రతి సన్నివేశాన్ని ప్రత్యేకంగా సృష్టించాలనుకున్నాను.. అని జ్యోతి కృష్ణ చెప్పారు.

## 'సయారా' ఈ తరానికి ప్రతిబింబం

భారతదేశంలో అత్యంత ప్రసిద్ధమైన ఫిల్మ్ మేకర్స్‌లో ఒకరైన మహేష్ భట్ తాజాగా 'సయారా'పై స్పందించారు. ప్రతి తరానికి ఒక ప్రేమకథ ఉంటుంది. ఆ తరానికి ప్రతిబింబంలా ఆ ప్రేమ కథ నిలుస్తుంది. నా దృష్టిలో 'సయారా' ఈ తరానికి చెందిన ప్రేమ కథగా, ప్రేమకు నిర్వచనంగా మారుతుంది. నేను ఆషికి సినిమాను ఎంతో నిజాయితీతో, స్వచ్ఛమైన ప్రేమతో చేశాను. అందుకే ప్రేక్షకులు ఆ చిత్రానికి ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యారు. నేటి తరానికి రొమాంటిక్ సినిమా ఎలా ఉండాలో చెప్పే నియమాల్ని 'సయారా' తిరిగి రాస్తుందని నమ్మకంగా చెప్పగలను. ఇంత వరకు మోహిత్ తీసిన చిత్రాల్లో ఇది చాలా భిన్నంగా అనిపిస్తోంది. ఈ చిత్రంలో మోహిత్ తనలోని ప్రేమ, లోతుని చూపించినట్టుగా కనిపిస్తోంది. తెరపై ఇద్దరు ప్రతిభావంతులైన నటులతో సయారాను తెరకెక్కించారు. ఇంత గొప్ప సినిమాను తీసేందుకు ముందుకు వచ్చిన వైఆర్ఎఫ్ వంటి స్టూడియోని చూస్తే గర్వంగా, సంతోషంగా ఉంది. సయారా చాలా కొత్తగా కనిపిస్తోంది. కొత్తవారితో మాత్రమే జరిగే ఓ మ్యాజిక్‌లా ఉంది. సయారా చిత్రంపై నా అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. జూలై 18న ఈ మూవీని చూడాలని వెయిట్ చేస్తున్నాను అని అన్నారు.





# 4వేల కోట్లతో రామాయణ

నితీష్ తివారి దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ప్రాజెక్ట్ రామాయణ. ఈ సినిమాపై రోజు రోజుకూ ప్రేక్షకుల్లో అంచనాలు భారీగా పెరిగి పోతున్నాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో నిర్మాత నమిత్ మల్హోత్రా ఈ సినిమా బడ్జెట్ గురించి చేసిన వ్యాఖ్యలు మరోసారి అందరి దృష్టిని ఆకర్షించాయి. ఏకంగా రూ. 4000 కోట్లతో దీన్ని నిర్మిస్తున్నట్లు చెప్పి ఆశ్చర్యపరిచారు. భారతీయ సినీ చరిత్రలో ఇప్పటివరకూ.. ఇంత భారీ బడ్జెట్ చిత్రం తెరకెక్కలేదని.. రామాయణ చరిత్ర సృష్టించడానికి సిద్ధంగా ఉందని అన్నారు. ఏ భారతీయ సినిమా కూడా ఈ ప్రాజెక్ట్ దరిదాపుల్లోకి కూడా రాలేదని తెలిపారు.

### సమ సమాజ స్థాపన కోసం

# అగ్రహారంలో అంబేద్కర్




మన భారత రాజ్యాంగ రూపశిల్పి బాబా సాహెబ్ అంబేద్కర్ సిద్ధాంతాల స్ఫూర్తితో రూపొందిన చిత్రం 'అగ్రహారంలో అంబేద్కర్'. ఇప్పటికే పలు ప్రతిష్టాత్మక అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలలో పురస్కారాలు అందుకున్న ఈ చిత్రాన్ని రామోజీ లక్షమోజి ఫిల్మ్స్ పతాకంపై మంతా కృష్ణచైతన్య స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. హీరో కూడా ఆయనే కావడం విశేషం. ఈ సినిమా టైటిల్ సాంగ్‌ను దళిత సంచలనం పద్మశ్రీ మందా కృష్ణ మాదిగ రిలీజ్ చేశారు. కృష్ణచైతన్య ఎన్నో కష్టాలు పడి తెరకెక్కించిన ఈ చిత్రం అసాధారణ విజయం సాధించాలని ఆయన ఆకాంక్షి      ంచారు. అంబేద్కర్ అభిమానులైన ప్రతి ఒక్కరూ అగ్రహారంలో అంబేద్కర్ చిత్రం చూసి తీరాలని పిలుపునిచ్చారు. కృష్ణచైతన్య మాట్లాడుతూ అంబేద్కర్ భావజాలాన్ని విశ్వవ్యాప్తం చేయడమే లక్ష      ్యంగా తెరకెక్కించిన ఈ చిత్రాన్ని సినిటేరియా మీడియా వర్క్స్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం.. కుల మత ప్రాంత వర్గ వైషమ్యాలకు అతీతంగా సమ సమాజ స్థాపన కోసం కృషి చేసిన అంబేద్కర్‌కు గొప్ప నివాళిగా.. ఎన్నో వ్యయప్రయాసలకు లోనై చిత్రీకరించిన ఈ చిత్రాన్ని ప్రతి ఒక్కరూ ఆదరిస్తారని ఆశిస్తున్నాం అన్నారు.

## 'మిస్టర్ రెడ్డి'కి ఎమోషన్లు ఎన్నో..



ఎంతో తపన ఉంటేనే సినిమాలు నిర్మిస్తారు. ఎన్నో వ్యయ ప్రయాసలు పడితే గానీ ఓ మూవీ బయటకు రాదు. ఈ క్రమంలో నన్ను ఎంతో మంది మోసం చేశారు. కానీ నేను ఎప్పుడూ ఎక్కడా భయప డలేదు. నా టాలెంట్‌ను నమ్ముకుని ఇక్కడి వరకు వచ్చాను అని 'మిస్టర్ రెడ్డి' చిత్ర నిర్మాత టి. నరసింహారెడ్డి అన్నారు. ఈ మూవీని జూలై 18న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ ఇది అన్ని రకాల ఎమోషన్‌తో తీసిన చిత్రమన్నారు.

## రాశి నెగెటివ్ షేడ్



యదార్థ సంఘటనలతో రూపొందిన ఓ వైవిధ్యమైన గ్రామీణ ప్రేమకథగా ఉసురే ఆగస్టు 1న థియేటర్స్‌లో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. సీనియర్ హీరోయిన్ రాశి ఈ చిత్రంలో ముఖ్య పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ట్రైలర్‌ను చూస్తుంటే ఇదొక సహజమైన, వైవిధ్యమైన ప్రేమకథలా అనిపిస్తుంది. ప్రముఖ హీరోయిన్ రాశి నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపిస్తుందని అర్థమోతుంది.

### 'పోలీసు వారి హెచ్చరిక'తో

# బాధ్యత పెరుగుతుంది

తూలికా తనిష్క్ క్రియేషన్స్ బ్యానర్‌పై అభ్యుదయ దర్శకుడు బాబ్జీ దర్శకత్వంలో బెల్లి జనార్థన్ నిర్మాతగా ఈ నెల 18న ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం 'పోలీసు వారి హెచ్చరిక'. ఈ చిత్రానికి కిషన్ సాగర్, నళినీ కాంత్ సినిమాటో గ్రాఫర్స్‌గా పనిచేయగా గజ్వేల్ వేణు సంగీతాన్ని అందించారు. శివ శర్వాణి ఎడిటింగ్ వర్క్ చేశారు. ఈ చిత్ర తొలి టికెట్ లాంచ్ చేసిన సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరు అయిన మట్టి కవి బెల్లి యాదయ్య మాట్లాడారు. 'నేను ఎన్నో సంవత్సరాల క్రితం నాటక రంగంలో నటించా.. ఇంతకాలం తర్వాత ఈ సినిమా కోసం ఇప్పుడు కెమెరాల ముందుకు వచ్చి మాట్లాడుతున్నాను. ఈ సినిమా మా ప్రాంతంలో కొన్ని నిజమైన లొకేషన్స్‌లో షూటింగ్ చేశాం. ఈ సినిమాలో మంచి కంటెంట్ ఉంది. అలాగే సమాజానికి మంచి సందేశాన్ని ఇస్తుంది' అని అన్నారు. నాకు చిన్నప్పటి నుండి సినిమాలపైన ఉన్న ఆసక్తితో ఈ సినిమాలో మంచి పాత్రను పోషించానని నటుడు సన్నీ అఖిల్ చెప్పుకొచ్చారు. నేను సాధారణంగా నాటికల ద్వారా ప్రేక్షకులకు పరిచయం. ఎక్కువగా నెగటివ్ రోల్స్‌లో నటించా.. ఈ సినిమాలో నా పాత్ర ఇప్పటి వరకు ప్రేక్షకులు నన్ను చూసిన పాత్రలతో పోలిస్తే కొంచెం భిన్నంగా ఉంటుంది అని నటి జయ వాహిని అన్నారు.

నిర్మాత బెల్లి జనార్ధన మాట్లాడుతూ... నేను ఆర్మీలో పని చేసి వచ్చాను. ఒక సినిమాను తెరపై చూపించేందుకు ముందుగా దర్శకులు ఎంతో కష్టపడతారు. మంచి కంటెంట్ ఉన్న ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరిస్తారని కోరుకుంటున్నాను అన్నారు. దర్శకుడు బాబ్జి మాట్లాడుతూ మనకు సాధారణంగా బయట కనిపించే సినిమాలు కాకుండా ఈ సినిమా కాస్త భిన్నంగా ఉండబోతోంది. ఈ సినిమాలో నెగటివ్ క్యారెక్టర్ల మధ్య మంచి సన్నివేశాలు ఉండబోతున్నాయి. వారి మధ్య ప్రేమ, పాటలు ఉండబోతున్నాయి. మా చిత్ర టైటిల్ ఇప్పటికే ప్రేక్షకులలోకి బాగా వెళ్ళింది. దానికి పోలీస్ వారికి మేము ధన్యవాదాలు తెలుపుకోవాలి. ఒక మంచి సందేశాన్ని ఈ చిత్రం ద్వారా ప్రేక్షకులకు తెలుపబోతున్నాము. ఈ సినిమా చూసిన ప్రేక్షకులు సమాజం మీద ఒక ప్రేమతో, బాధ్యతతో థియేటర్ నుండి బయటకు వెళ్తారు. మా సినిమాను అందరూ సపోర్ట్ చేయండి అంటూ ముగించారు.



# రాష్ట్రంలో 5,774 ఎంపిటిసి స్థానాలు

## లెక్క తేల్చిన అధికారులు

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎంపిటిసి స్థానాల లెక్క తేలింది. మొత్తంగా 5,774 స్థానాలు ఉన్నట్టు పంచాయతీరాజ్ శాఖ ఖరారు చేసింది. ఈనెల 12తో ఎంపిటిసి స్థానాల పునర్విభజన పూర్తయింది. దీంతో స్థానాలపై స్పష్టత వచ్చింది. గత మార్చిలో 5,817 ఎంపిటిసి స్థానాలు ఉండగా... ప్రస్తుతం ఆ సంఖ్య 5,774కు తగ్గింది. కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పలు గ్రామాలు విలీనం కావడం, ఓఆర్ఆర్‌లోని గ్రామాలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేయడమే ఇందుకు కారణం. కొన్ని మండలాల్లో జనాభా ప్రకారం రెండు, మూడు ఎంపిటిసి స్థానాలే ఉండటంతో ప్రభుత్వం చట్ట సవరణ చేసింది. ఒక మండలంలో కనీసం ఐదు ఎంపిటీసీల స్థానాలు ఉండే విధంగా మార్పులు చేసింది. వాస్తవానికి ఒక ఎంపిటిసి స్థానానికి 3,500 జనాభా ఉండాలి. ఎంపిపి వైస్‌ఎంపిపీలకు ఇద్దరు ఎంపిటిసి కావాలి. వారిని ఎన్నుకోవడానికి, వారు వేదిక మీద కూర్చుంటే సమావేశానికి హాజరుకావడానికి కనీసం మరో ఎంపిటిసిఅయినా ఉండాలి. కానీ పలు గ్రామాల్లో ఆ పరిస్థితులు లేకపోవడంతో ప్రతి మండలంలో కనీసం ఐదుగురు ఎంపిటిసిలు ఉండే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. దీంతో అనేక మండలాల్లో ఐదు ఎంపిటిసిల స్థానాలు ఏర్పడ్డాయి. రాష్ట్రంలో గతమార్చి తర్వాత కొత్తగా మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు ఏర్పడటంతో సమీప గ్రామాలను అందులో కలిపారు. ఓఆర్ఆర్ లోపలి గ్రామాలను సైతం సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేశారు. దీంతో ఎంపిటిసిల స్థానాలు సంఖ్య తగ్గింది. గత మార్చిలో 5,817 ఎంపిటీసీ స్థానాలు ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య 5,774కు తగ్గింది. మేడ్చల్‌మల్కాజ్గిరి జిల్లాలో 19 ఎంపిటిసి స్థానాలు ఉండగా ఆ జిల్లాను అర్బన్ జిల్లా మార్చారు. దీంతో ఆ 19 స్థానాలు కనుమ రుగైపోయాయి. ఖమ్మం, నారాయ ణపేట్, నాగర్ కర్నూలు, కొత్తగూడెం జిల్లాల్లో నాలుగు చొప్పున, ములుగు, సంగారెడ్డి జిల్లాల్లో మూడు చొప్పున, రంగారెడ్డి, పెద్దపల్లి జిల్లాలో ఒకటి చొప్పున ఎంపిటిసి స్థానాలు పట్టణ స్థానిక సంస్థల్లో వీలి నమయ్యాయి. రాష్ట్రంలో అత్యధికంగా నెల్గొండ జిల్లాలో 352 ఎంపిటీసీ స్థానాలు ఉండగా.. అత్యల్పం గా ములుగు జిల్లాలో 84 ఎంపిటీసీ స్థానాలు ఉన్నాయి.

**జిల్లాల వారీగా ఎంపిటిసిల స్థానాల వివరాలు**

మంచిర్యాలలో 166, ఆసిఫాబాద్‌లో 127, మంచిర్యాలలో 129, నిర్మల్ 157, కరీంనగర్‌లో 170, జగిత్యాలలో 216, సిరిసిల్లలో 123, పెద్దపల్లిలో 139, నిజామాబాద్‌లో 307, కామారెడ్డిలో 237, సిద్దిపేటలో 230, సంగారెడ్డిలో 273, మెదక్‌లో 190, రంగారెడ్డిలో 231, వికారాబాద్‌లో 227, మహబూబ్‌నగర్‌లో 175, నారాయణపేటలో 132, నాగర్ కర్నూల్లో 210, గద్వాల్లో 142, వనపర్తిలో 133, సూర్యాపేటలో 235, నల్గొండలో 352, భువనగిరిలో 178, వరంగల్‌లో 130, హన్మకొండలో 129, ములుగులో 84, మహబూబాద్‌లో 193, భూపాలపల్లి 109, జనగామలో 134, ఖమ్మంలో 288, కొత్తగూడెంలో 288లో ఉన్నాయి.



# సహకార రంగంలో నూతన ఒరవడికి శ్రీకారం

## వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** సహకార రంగములో నూతన ఒరవడికి శ్రీకారంచుట్టినట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. దేశంలోనే ఎక్కడాలేని విధంగా ప్రాథమిక సహకార సంఘాలను రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా మార్చడానికి నిర్ణయం తీసుకున్నామన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన సదస్సులో మాట్లాడుతూ ప్రస్తుత అవసరాలకు తగ్గట్టు మరియు వ్యవసాయరంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సహకారం పరపతి సంఘాలు తమ దృక్పథం మార్చుకోవాలన్నారు. కేవలం ఒకటి లేదా రెండు సేవలకు పరిమితం కాకుండా, రైతులకు సంబంధించి అన్ని సేవల రూపకల్పనలో పాలుపంచుకొన్నట్లయితేనే ఆర్థిక పరిపుష్టి సాధించడంతో పాటు రైతులకు కూడా ప్రయోజనకారిగా ఉండగలమని పేర్కొన్నారు. ముల్కనూరు లాంటి సహకార సంస్థలు మరిన్ని రాష్ట్రంలో ఉద్భవించే అవకాశాలు ఉంటాయని చెప్పారు. ఇప్పటికే ఉన్న ప్రాథమిక సహకార పరపతి సంఘాలను రైతు ఉత్పత్తి సంఘాలుగా మార్చి, వారికి మరింత ఆర్థికతోడ్పాటు అందించే ఆలోచన చేశామని తెలిపారు. రాష్ట్రంలో 311 సహకార పరపతి సంఘాలను రైతు ఉత్పత్తిదారుల సంఘాలు లుగా ఎన్నిక చేయడం జరిగిందన్నారు. వీటికి ఒక్కొకదానికి 15 లక్షల ఈక్విటీ గ్రాంటు మరియు 18 లక్షల మేనేజ్ మెంట్ ఖర్చు (మొత్తం 33 లక్షలు) 167.93 కోట్లు మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. ఇందులో మొదటి విడతగా 9 కోట్లు 85 లక్షల 40 వేల రూపాయలు (ప్రతి శితిదిళీ కు 3,16,849 రూ) విడుదల చేశామని వివరించారు.

# గత ప్రభుత్వ తప్పిదాలు కాంగ్రెస్‌కు ఆపాదించొద్దు: ఎంపి చామల

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** గత ప్రభుత్వం చేసిన పదేళ్ల తప్పిదాలను కాంగ్రెస్ ప్రభుత్వంపై రుద్దుతు దీనంతటికి మా ప్రభుత్వవైఫల్యంగా బిజెపి రాష్ట్ర నూతన అధ్యక్షులు రాంచందర్‌రావు ఆపాదించొద్దని ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి హితవు చెప్పారు. గాంధీభవన్‌లో ఎంపి చామల కిరణ్ మాట్లాడుతూ బిజెపి లో పాత కళాకారులు పోయి కొత్త కళాకారుడు వచ్చాడని ఎకసెక్కాలు చేశారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మాటల్లో సబ్జెక్ట్ లేదు. రాంచందర్ రావుకు మతి మరుపు ఉన్నట్లు ఉందని అనుమానం వ్యక్తం చేశారు. మోడీ గుజరాత్ ముఖ్యమంత్రి గా ఉన్నప్పుడు రేషన్ కార్డు లలో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ఫోటో ఎందుకు పెట్టలేదని నిల దీశారు. ట్రిపుల్‌ఆర్, మెట్రో ఫేజ్-2 త్వరగా నిధులు ఇచ్చి పూర్తి చేయడానికి సహకరిస్తే వాటి దగ్గర మోడీ ఫోటో లు పెడతామని తెలిపారు. బ్రిటీష్ హయాంలోనే కొందరు మైనారిటీ ముస్లిం లను బిసి లలో చేర్చారని ఆయన గుర్తుచేశారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో కూడా మైనారిటీ ముస్లింలు బిసిలలోనే ఉన్నారు. రాంచందర్‌రావు విషయపరిజ్ఞానం పెంచుకుంటే మంచిదని కోరారు. గత పదేళ్లలో ఏ రోజైనా తుంగతుర్తి అభివృద్ధి గురించి జగదీష్‌రెడ్డి మాట్లాడలేదని అన్నారు. గంజి లేని జగదీష్‌రెడ్డి బెంజ్ కారులో ఎలా తిరుగుతున్నాడని ప్రశ్నించారు.

# సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 353

**హైదరాబాద్ (బేగంపేట), జూలై 15, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 353 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 60దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 63 దరఖాస్తులు, విద్యుత్ శాఖకు సంబంధించి 22 దరఖాస్తులు, పౌర సరఫరాల శాఖకు సంబంధించి 07దరఖాస్తులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం 57దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 144 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలియజేసారు. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా. జి. చిన్నారెడ్డి స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు.

# 12 శాతమున్న ముస్లింలకు 100 శాతం రిజర్వేషన్లా?



**తెలంగాణలో కాంగ్రెస్ కుట్రలు ప్రజలకు వివరిస్తాం**

**బిసి జాబితా నుంచి ముస్లింలను తీసేస్తేనే మద్దతు**

**బిసిలకు జరుగుతున్న అన్యాయంపై ఉద్యమిస్తాం**

**కేంద్రమంత్రి బండి సంజయ్ హాట్ కామెంట్లు**

**సిరిసిల్ల బ్యూరో, ప్రభాతవార్త:** బిసిల రిజర్వేషన్ల అమలుపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీసీ రిజర్వేషన్ల అమలు వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని మండి పడ్డారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు పేరుతో ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం దుర్మార్గమన్నారు. ముస్లింలను బీసీ రిజర్వేషన్ల జాబితా నుండి తొలగించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. తక్షణమే బీసీ జాబితా నుండి ముస్లింలను తొలగించి 42 శాతం రిజర్వేషన్లను పూర్తిగా బీసీలకే దక్కేలా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 51 శాతమున్న బీసీలకు 32 శాతం మాత్రమే రిజర్వేషన్లు అమలు చేస్తామంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం 12 శాతమున్న ముస్లింలకు మాత్రం వందకు వంద శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు సిద్ధమవడం దుర్మార్గమన్నారు. బనకచర్ల విషయంలో కేంద్రం రెండు రాష్ట్రాల సీఎంలతో సమావేశం ఏర్పాటు చేయడాన్ని స్వాగతించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ వాదనను బలంగా విన్పించాలని కోరారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సైకిళ్ల పంపిణీ కార్యక్రమానికి హాజరైన బండి సంజయ్ విలేకరులతో మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రతి అసెంబ్లీ నియోజ కవర్గంలో ప్రభుత్వ స్కూళ్లలో చదువుకునే టెన్త్ విద్యార్థులందరికీ సైకిళ్లను అందజేస్తున్నామని 20 వేలకుపైగా సైకిళ్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. బనకచర్ల ప్రాజెక్టు అంశంపై కేంద్ర ప్రభుత్వం రెండు రాష్ట్రాల ముఖ్య మంత్రులతో సమావేశం కాబోతుందన ఈ నేపథ్యంలో తెలంగాణ వాదనను బలంగా విన్పించాలని అయన కోరారు. కేంద్రానికి అన్ని రాష్ట్రాలూ సమానమేనని ఏ రాష్ట్రానికి అన్యాయం చేయదని స్పష్టం చేశారు. రాష్ట్ర వాదనను సీఎంల మీటింగ్ లో రేవంత్ రెడ్డి గట్టిగా విన్పించాలన్నారు. బీసీ రిజర్వేషన్ల అమలు వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ప్రభుత్వం వాస్తవాలను కప్పి పుచ్చే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు అదనంగా ఇస్తున్న రిజర్వేషన్లు 5 శాతమేనని దీనివల్ల బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అట్లాగే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలవుతున్నాయని అందులో ముస్లింలు లబ్ది పొందుతుండగా రాష్ట్రంలో 12 శాతం మంది ముస్లింలు ఉంటే... కాంగ్రెస్ 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం ద్వారా ముస్లింలకు ఇకపై వందకు వంద శాతం రిజర్వేషన్లు పొందబోతున్నారని తెలిపారు. బీసీలకు మాత్రం తీవ్రమైన అన్యాయం జరుగుతుందని మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం అయినా ఆర్డినెన్స్ తీసుకు వస్తామని చెప్పడం దుర్మార్గమని ఆరోపించారు. తక్షణమే బీసీ రిజర్వేషన్ల జాబితా నుండి ముస్లింలను తొలగించాలని కేంద్ర సహాయ మంత్రి సంజయ్ డిమాండ్ చేశారు. 42కు 42 శాతం రిజరే షన్లను బీసీలకు అమలు చేస్తానంటే కేంద్రాన్ని ఒప్పించి ఆమోదం తెలిపే బాధ్యతను మేం తీసుకుంటామని లేనిపక్షంలో ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. కాంగ్రెస్‌కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ముస్లింలను బీసీ జాబితా నుండి తొలగించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎంఎల్సీ అంజిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి, సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# అణగారిన వర్గాలకు రాజ్యాధికారం అప్పగించడమే కాంగ్రెస్ లక్ష్యం

## బిసి ధూంధాం పోస్టర్ ఆవిష్కరణలో పిసిసి మహేష్‌కుమార్, మంత్రి వివేక్

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** అణగారినవర్గాలకు రాజ్యాధికారం అప్పగించడమే కాంగ్రెస్ లక్ష్యమని రాజకీయ, ఆర్థిక సమానత్వంతో దేశం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్, మంత్రి వివేక్ అన్నారు. హైదరాబాద్‌లో మంగళవారం "42శాతం రిజర్వేషన్ కోసం ధూంధాం" పోస్టర్ ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం వెంటనే తెలంగాణ బిసి రిజర్వేషన్ బిల్లును భారత రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని ఆయన కోరారు. స్థానిక సంస్థలలో 42శాతం వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్ కల్పించేలా ఈనెల 18న ఉస్మానియాలో చేపట్టిన ధూంధాం విజయవంతం చేయాలని ఆయన కోరారు. 42 శాతం వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ల కోసం ధూంధాంను బిసిల హక్కుల సాధనలో భాగంగా, ఆల్ ఇండియా ఒబిసి స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే కార్యక్రమం విజయవంతమైతే కేంద్రంలో కూడా చలనం వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రి వివేక్ వెంకట్ స్వామి విద్యార్థుల ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థి నాయకులు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

# 23న విద్యాసంస్థల బంద్

## ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజు దోపిడీని అరికట్టాలి

## వామపక్ష విద్యార్థి సంఘాలు

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ నెల 23న విద్యా సంస్థల బంద్‌కు వామపక్ష విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రభుత్వ విద్యా సంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ప్రైవేటు విద్యా సంస్థల దోపిడిని అరికట్టాలని డిమాండ్ చేస్తూ విద్యా సంస్థల బంద్‌ను నిర్వహిస్తున్నట్టు విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను విద్యార్థి సంఘాల నాయకులు మంగళవారం విడుదల చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని, విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలు, జూనియర్ కళాశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు విద్యార్థి సంఘాల నాయకులు ప్రకటించారు. బంద్ పోస్టర్‌ని హిమాయత్ నగర్‌లోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ఆవిష్కరించారు.

# మహిళల ఆనందమే తెలంగాణ సౌభాగ్యం

## రూ. 20.56 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కు అందించిన మంత్రి సీతక్క

**హైదరాబాద్, జూలై 15 ప్రభాతవార్త:** ఆడబిడ్డల ఆనందమే తెలంగాణ సౌభాగ్యమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో తెలంగాణ మహిళలు గణనీయమైన విజయాలను సాధిస్తు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. మంగళవారం కామారెడ్డి జిల్లా మహిళా సమాఖ్య నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో ముఖ్య అతిథిగా పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె జిల్లా మహిళా సమాఖ్యకు రూ. 20.56 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కును అందచేశారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ.. మహిళా స్వయం సహాయక బృందాల మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశలో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కామారెడ్డి కలెక్టరేట్లో మహిళా సంఘాలు నిర్వహిస్తున్న ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్ ద్వారా ప్రతి నెల రూ. లక్ష ఆదాయాన్ని మహిళా సంఘాలు పొందుతూ ఇందిరా మహిళా శక్తి విజయానికి చక్కటి ఉదహరణగా నిలుస్తున్నారన్నారు. ఒకప్పుడు మహిళలకు బ్యాంకులు అప్పు ఇవ్వాలంటేనే బయపడే పరిస్థితి ఉండేదనీ, కానీ ఇప్పుడు అవే బ్యాంకుల ద్వారా ఏడాదికి కనీసం రూ. 25 వేల కోట్లకు తగ్గకుండా రుణాలు సమకూర్చుతున్నాయన్నారు. త్వరలో కామా రెడ్డిలో పసుపు ఆధారిత పరిశ్రమను మహిళా సంఘాల ఆధ్వర్యంలో నెలకొల్పుతామన్నారు. మహిళలు స్వతంత్రంగా ఎదగాలి..కోటీశ్వరులుగా నిలవాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు.

# మంత్రి జూపల్లితో నిథమ్ డైరెక్టర్ భేటీ

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్) డైరెక్టర్‌గా నియమితులైన ప్రొఫెసర్ వెంకటరమణ.. పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరమణకు మంత్రి జూపల్లి శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.

# స్థానిక సంస్థల ఎన్నికలపై బిజెపి దృష్టి

## మెజారిటీ స్థానాలు గెలవాలంటూ దిశానిర్దేశం

## రాష్ట్ర నేతలతో సునీల్‌బన్సాల్ సమావేశం

**హైదరాబాద్, జూలై 15 ప్రభాతవార్త:** బిజెపి అధినాయకత్వం రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టిసారించింది. మెజారిటీ స్థానాలు గెలపొందాలంటూ నేతలకు జాతీయ నేతలు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో బిజెపి రాష్ట్ర శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డితో జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ అభయ్ పాటిల్‌తో భేటీ అయ్యారు ఈ సమావేశంలో ముఖ్యంగా రాష్ట్రంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ సన్నాహాలపై ప్రధానంగా చర్చించారు. పార్టీలో కొత్త, పాత వివాదంపై కూడా డిస్కస్ చేసినట్లుగా సమాచారం. రాష్ట్ర కమిటీలో తమ వారికి కూడా తగిన ప్రాధాన్యం ఇవ్వాలని ఈటల, మహేశ్వర్ రెడ్డి కోరినట్లుగా సమాచారం. ఇక స్థానిక ఎన్నికల బాధ్యతలను పూర్తిగా ఈటల రాజేందరు అప్పగించే అవకాశం ఉన్నట్లుగా తెలిసింది. ఇవాళ మధ్యాహ్నం స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ నిర్వహించి ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై సునీల్ బన్సల్ నాయకులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌తో పాటు జోనల్ స్థాయి వర్క్‌షాప్‌లు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. సునిల్ బన్సల్ భేటీ కొనసాగుతున్న నేపథ్యంలో కంటోన్మెంట్ బోర్డు సమావేశం ఉండటంతో ఎంపి ఈటల మధ్యలోనే వెళ్లిపోయారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తా చాటాలని, మెజార్టీ స్థానలు కైవసం చేసుకుని మరోసారి ఎన్నికలలో సత్తా చాటాలని, నేతలందరూ కలిసికట్టుగా పనిచేయాలంటూ దిశానిర్ధేశనం చేశారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ఎలక్ట్రిక్ బస్సులు ఆర్‌టిసికి ఇవ్వాలి

## టిజిఎస్ ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ఎలక్ట్రిక్ బస్సులు ఆర్‌టిసికి ఇవ్వాలని టిజిఎస్ ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. వాతావరణ కాలుష్యంతో పర్యావరణం దెబ్బ తినకుండా ఉండాలంటే డీజిల్, పెట్రోల్ వాహనాలకు బదులుగా ఎలక్ట్రిక్ బస్సుల తయారీని కేంద్ర ప్రభుత్వం సమర్థించటాన్ని ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు ఎస్ బాబు, ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న తప్పు పట్టారు. కేవలం ఆర్‌టిసి బస్సుల వల్లనే పర్యావరణం దెబ్బతినడం లేదని, టూ వీలర్ దగ్గర నుండి.. సుమారు 60 లక్షల వాహనాలు తెలంగాణ ప్రాంతంలో ఆపరేట్ అవుతున్న సందర్భంలో పర్యావరణం దెబ్బ తినడం లేదా అని ప్రశ్నించారు. ఆర్‌టిసి బస్సుల వల్ల కాలుష్యం కేవలం 0.09 శాతం మాత్రమేనని, మిగిలిన కాలుష్యమంతా ఇతర వాహనాలతోనే వస్తోందన్నారు. కాలుష్యం పేరుతో కార్పొరేట్ శక్తులకు సబ్సిడీ ఇచ్చి, బస్సులను తయారు చేయడం కార్పొరేట్ రంగాన్ని బలోపేతం చేసి, ఆర్‌టిసిని నిర్వీర్యం చేయడమేనన్నారు. కార్పొరేట్ శక్తుల చేతుల్లో ఉన్న బస్ బాడీ బిల్డింగ్ యూనిట్లకు సబ్సిడీ ఇచ్చి వారిని బాగు చేసే బదులు.. అదే సబ్సిడీలు ఆర్‌టిసికిచ్చి వారి బాడీ బిల్డింగ్ యూనిట్లలో ఎలక్ట్రిక్ బస్సుల తయారయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే 600 ఎలక్ట్రిక్ బస్సులు తెలంగాణ ఆర్‌టిసిలో అద్దెబస్సులుగా రావడం వలన కొన్ని డిపోలు, గ్యారేజీలు ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పడం జరిగిందని.. దానివలన ఆ డిపోల నుండి వందలాది మంది సిబ్బంది బలవంతంగా బయటికి గెంటివేయబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.

# ఎస్‌టిఎఫ్, డిటిఎఫ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాల ఆధ్వర్యంలో కల్లు కాంపౌండ్‌లపై ముప్పేట దాడులు

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** కల్లు కాంపౌండులపై ప్రత్యేకంగా దాడులు నిర్వహించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్‌డెరెక్టర్ షానవాజ్ ఖాసీం ఇచ్చిన అదేశాల మేరకు దాడులను ముమ్మరం చేశారు. హెచ్‌డిఎఫ్, ఏ టీం లీడర్ అంజిరెడ్డి టీమ్‌లు నాంపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 32 లీటర్ల కల్లును అక్రమంగా రవాణ చేస్తూ ఉండగా స్వాధీనం చేసుకున్నారు. ఒక్క బైక్‌ను సీజ్ చేసి, శాంపిల్ తీసుకున్నారు. కాంబ్లే గిరిధరిపై కేసు నమోదు చేశారు. ఎస్‌టిఎఫ్ సిసిఐ వెంకటేశ్వర్ల అధ్వర్యంలో గోల్కొండ, శంషాబాద్ బండ్లగూడ ప్రాంతాల్లో కల్లు కాంపౌండ్‌లలో తనిఖీలు నిర్వహించి కల్లు శాంపిళ్లను సేకరించారు. సిఐ నాగరాజు ఆధ్వర్యంలో మైలార్‌దేవరపల్లి హైదర్‌గూడ, ముద్దోవ్వాల, జంగంపేట్, ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. అన్ని కల్లు దుకాణాల్లో శాంపిళ్లను సేకరించారు. ఎస్‌టిఎఫ్‌బి టీం గద్వాల, రాయన్‌పేట, ఏదుర్తి నుంచి మసాయిపేట ప్రాంతాల్లో సిఐ బిక్షారెడ్డి, సిఐ బిక్షారెడ్డి, ఎస్ఐ బాలరాజులతోపాటు సిబ్బంది కలిసి 6 చోట్ల దాడులు నిర్వహించారు. ఐదుగురిపై కేసు నమోదు చేశారు. ఎలాంటి అనుమతులు, లైసెన్స్‌లు లేకుండా కల్లు దుకాణాలను నిర్వహిస్తుండంతో ఈ కల్లు కంపౌండ్‌లోని ఉన్న కల్లును నేలపాలు చేశారు. మరో 595 లీటర్ల కల్లును స్వాధీనం చేసుకుని అవసరమైన శాంపిల్స్‌ను తీసుకున్నారు. మల్లయ్య, నరేందర్ కృష్ణ, వెంకటేష్ పద్మమ్మలపై కేసు నమోదుచేసి వారిని గద్వాల ఎక్సైజ్ స్టేషన్ అప్పగించారు. నాగర్ కర్నూల్ ఎక్సైజ్ ఎక్సైజ్‌స్టేషన్ సిబ్బందితో కలిసి 350 లీటర్ల అనుమతి లేని కల్లును స్వాధీనం చేసుకుంటున్నారు. మంగనూర్, బిజినేపల్లి ప్రాంతాల్లో ద్యాడలు నిర్వహించారు. నాగర్ కర్నూల్ డిటిఎఫ్ సిఐ సిబ్బంది కలిసి ఒక వాహనంలో అనుమతులు లేకుండా తరలిస్తున్న 31.2 లీటర్ల కల్లును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశారు.

# వర్షాలు పడొద్దని శాపనార్థాలతో కెటిఆర్ రాక్షసానందం

## చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**హైదరాబాద్, జూలై 15,ప్రభాతవార్త:** నైరుతి రుతుపవన సీజన్ పూర్తి గా ప్రారంభం కాకుండానే కెటిఆర్ శాపనార్థాలు ప్రారంభమైనాయనీ, వర్షాలు పడొద్దని కోరుకుంటూ ఆయన రాక్షసానందం పొందతున్నారని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మంగళవారం సిఎల్‌పి సమావేశంలో మాట్లాడుతూ వానకాలం విత్తనాలు ఇంకా విత్తనేలేదురైతులకు నీళ్లు ఇవ్వడం లేదని కెటిఆర్ గగ్గోలు పెడుతున్నాడని అన్నారు. ఎవరైనా మంచి వర్షాలు పడాలని రైతులు బాగుండాలని కోరుకుంటారు కానీ కెటిఆర్ రైతులు పచ్చగా ఉంటే ఓర్వలేకపోతున్నారని దుయ్యబట్టారు. ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోయి పంటలు ఎండిపోతున్నాయని పిచ్చి వాగుడు వాగుతున్నాడని సత్యం విమర్శించారు. రాష్ట్రంలో ఎక్కడైనా ఒక్క ఎకరం ఎండిపోయిందా? కేటీఆర్ నిరూపించాలి అని ఆయన అన్నారు. రైతులకు 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్ ను ఇస్తున్నామని తెలిపారు. ఏ సబ్ స్టేషన్ దగ్గర చిన్న నిరసన లేదని అన్నారు. విద్యుత్ డిమాండ్ 16 వేల మెగావాట్లు దాటినా రెప్పపాటు కూడా కరెంటు పోకుండా చూశామని అన్నారు. రైతుల కోసం వేల కోట్లు వెచ్చించి ఉచిత విద్యుత్ ఇస్తున్నామని మేడిపల్లిసత్యం తెలిపారు. ఎక్కడైనా ఒకటి రెండు ట్రాన్స్ ఫార్మర్లు పని చేయకపోతే వాటిని చూపించాలిన అన్నారు. కెటిఆర్ ఇంట్లో కూర్చుని ట్వీట్లు చేస్తున్నాడు, పొలాల వెంట వెళ్లి చూడు ఏం జరుగుతుందో చూడాలని అన్నారు.

# సాహితీ, సాంస్కృతిక రంగాల్లో యువతను ప్రోత్సహించాలి

## మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

## వైభవంగా తెలుగు విశ్వవిద్యాలయ ప్రతిష్టాత్మక ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం

**హైదరాబాద్ (నాంపల్లి), జూలై 15, ప్రభాతవార్త :** తెలుగు భాషా, సంస్కృతి పరిరక్షణే ధ్యేయంగా ఏర్పాటు చేసిన తెలుగు విశ్వవిద్యాలయం ప్రతీయేటా ప్రతిభావంతులకు, మేధావులకు, వివిధరంగాల్లో నిష్ణాతులకు పురస్కారాలు ఇవ్వడమే కాకుండా సాహిత్య సాంస్కృతిక రంగాల్లో అభిరుచి, ఆసక్తిగత యువతను గుర్తించి వారిలోని సృజనాత్మకశక్తిని పెంపొందించి ప్రోత్సహించే కీలక బాధ్యతను విశ్వవిద్యాలయం పోషించాలని, ఆ దిశగా విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సూచించారు. విశ్వవిద్యాలయ నాంపల్లి ప్రాంగణంలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో మంగళవారం సాయంత్రం విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యా నందరావు సభాధ్యక్షతన జరిగిన 2023 ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గుత్తా సుఖేందర్‌రెడ్డి విశిష్ట అతిథులుగా సింగరేణి కాలరీస్ సీఎండి ఎం. బలరామ్, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు, విస్తరణ సేవావిభాగం అదనపు సంచాలకుడు రింగు రామమూర్తితో కలిసి వివిధరంగాల్లో విశేష సేవలందించిన 12మంది ప్రముఖులు ఎలనాగు (కవిత్వం), డా. ప్రభల జానకి (విమర్శ), ఆచార్య ఆర్. లక్ష్మీరెడ్డి (చిత్ర లేఖనం), ఎ. సంపత్‌రెడ్డి (శిల్పం), పేరిణి రమేష్ లాల్ (నృత్యం), బి. హరిప్రియ (సంగీతం), కాసుల ప్రతాపరెడ్డి (పత్రికా రంగం), గుమ్మడి గోపాలకృష్ణ (నాటకరంగం), కడకంచి పాపయ్య (జానపద రంగం), ధూళిపాళ మహదేవమణి (అవధానం), ఆచార్య కె. మలయవాసిని (ఉత్తమ రచయిత్రి), డా. శాంతినారాయణ (నవల/కథ)లను ఘనంగా సత్కరించి ప్రతిభా పురస్కారంతోపాటు 20,116 రూపాయల నగదు, శాలువ, అభినందనపత్రాన్ని అందజేసి వారి సేవలను ప్రశంసించి శుభాభినందనలు తెలిపి ప్రసంగించారు. మన మాతృభాష తెలుగును కాపాడుకునే బాధ్యతను ప్రతీఒక్కరూ విధిగా తీసుకోవాలని, అన్యభాషలను ద్వేషించకుండా గౌరవించాలని కోరారు. కళలు, సాహిత్యం ద్వారా సమాజాన్ని మేల్కొలిపి చైతన్యవంతుల్ని చేస్తున్న ప్రతిభామూర్తులను తగురీతిన పురస్కారాలతో సన్మానించడం హర్షణీయమని ఎం. బలరామ్ అన్నారు. అధ్యక్షోపన్యాసంలో ఆచార్య నిత్యానందరావు పురస్కార గ్రహీతలను సభకు పరిచయంచేస్తూ వారిలోని అసాధారణ ప్రతిభాపాటవాలను వివరించారు. ముందుగా కోట్ల హనుమంతరావు స్వాగతోపన్యాసంలో వివిధ రంగాలలో తెలుగు విశ్వవిద్యాలయం చేస్తున్న కృషిని సవివరపరిచారు. చివరిగా పురస్కార గ్రహీతలు తమ స్పందనలో విశ్వవిద్యాలయానికి కృతజ్ఞతలు తెలిపారు. రింగు రామమూర్తి కార్యక్రమ సమన్వయకర్తగా వ్యవహరించారు.



ప్రతిభా పురస్కార గ్రహీతలతో సుఖేందర్‌రెడ్డి, నిత్యానందరావు, బలరామ్, హనుమంతరావు, రామమూర్తి తదితరులు

# తెలంగాణ కాంగ్రెస్ బిసి నేతలకు బెంగళూరులో ఘనస్వాగతం

## ఎఐసిసి ఒబిసి సలహా మండలి సమావేశంలో కీలకనిర్ణయాలు

**హైదరాబాద్, జూలై 15,ప్రభాతవార్త:** తెలంగాణ కాంగ్రెస్ బిసినేతలకు బెంగళూరులో ఘనస్వాగతం లభించింది. కర్ణాటక సిఎం సిద్ధరామయ్య ఆధ్వర్యంలో మంగళవారం బెంగళూరు లో ఎఐసిసి ఒబిసి నేషనల్ అడ్వైజరీ మండలి సమావేశంలో పాల్గొన్నారు. ఎఐసిసి ఒబిసి సలహా మండలి సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకోవడానికి టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్, మంత్రులు పొన్నం ప్రభాకర్, సురేఖ, వాకాటి శ్రీహరిలు కులగణన సర్వే చేసిన విధానం వివరించారు. రాజకీయంగా విద్యా, ఉపాధి విషయంలో కూడా 42శాతం రిజర్వేషన్ కల్పించేందుకు తీర్మాణం చేశామని తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చడానికి కేంద్రంకు పంపామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. బెంగళూరు వెళ్లిన ఎఐసిసి ఒబిసి సెల్ జాతీయ అధ్యక్షుడు అనిల్ కుమార్ జైహింద్, సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ వి. హనుమంత రావు, బీకే. హరిప్రసాద్, మాజీ ఎమ్మెల్యే పూర్ణిమ యాదవ్ మరియు ఇతర నేతలు ఉన్నారు.

# ఒత్తిడి తట్టుకోలేకపోతున్న బ్యాటర్లు

## ఇంగ్లండ్ నాల్గో టెస్ట్‌కు రిషబ్, బుమ్రా దూరం



**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్ సిరీస్‌లో టీమిండియా బ్యాటర్లు పేలవ ప్రదర్శనతో వరుస వైఫల్యాలు చవిచూస్తున్నారు. ఇండియా వర్సెస్ ఇంగ్లాండ్ మధ్య ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా లార్డ్స్ వేదికగా జరిగిన మూడో టెస్టులో టీమిండియా ఓటమిపాలైంది. ఇంకా రెండు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. నాల్గో టెస్టు మ్యాచ్ ఈ నెల 23 నుంచి ప్రారంభమవుతుంది. ఈ టెస్టు మ్యాచ్‌కు భారత్ జట్టుకు చెందిన కీలక ప్లేయర్లలో మార్పులు జరుగనున్నాయి. టీమిండియా వికెట్ కీపర్, బ్యాటర్ రిషబ్ పంత్, స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రాను మార్చే అలోచన జరుగుతోంది. మూడో టెస్టులో ప్లేయర్ల వైఫల్యంపై బోర్డు పోస్టుమార్టం చేస్తోంది. ఇంగ్లండ్ నిర్దేశించిన 193 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత్ బ్యాటర్లు ఒత్తిడి తట్టుకోలేక తడబడుతూ వరుస వికెట్లు సమర్పించుకుని ఓటమి పాలయ్యారు. ముఖ్యంగా యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, ఆకాష్ దీప్, రిషభ్ పంత్, వాషింగ్టన్ సుందర్ వంటి కీలక ఆటగాళ్లు ఛేజింగ్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. భారత్ రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన యశస్వి జైస్వాల్ (0) ఏడు బంతుల్లో డకౌట్ అవ్వడం టీమ్ ఇండియాకు భారీ ఎదురుదెబ్బ. ఇంగ్లండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్ బౌలింగ్‌లో ఆర్చర్ బౌన్సర్‌కు పెవిలియన్ చేరాడు. ఈ సిరీస్‌లో జైస్వాల్ కీలక ఛేజింగ్‌లో అతను పూర్తిగా నిరాశపరిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో 13 పరుగులు చేసిన జైస్వాల్, రెండో ఇన్నింగ్స్‌లో ఖాతా తెరవలేకపోయాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (6) కూడా తక్కువ స్కోరుకే అవుట్ అయిపోవడం ఆందోళన కలిగించింది. బ్రిడాన్ కార్స్ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగిన గిల్, కెప్టెన్‌గా జట్టుకు కావాల్సిన స్థిరత్వాన్ని ఇవ్వలేకపోయాడు. ఈ సిరీస్‌లో గిల్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నప్పటికీ, ఈ కీలక ఛేజింగ్‌లో అతను విఫలం కావడం జట్టును ఒత్తిడిలోకి నెట్టింది. ఆకాష్ దీప్ నిష్క్రమణతో పెరిగిన ఒత్తిడి నైట్ వాచ్‌మన్‌గా క్రీజులోకి వచ్చిన ఆకాష్ దీప్ (1) కూడా ఎక్కువసేపు నిలబడలేకపోయాడు. బెన్ స్టోక్స్ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ కావడంతో భారత్ కష్టాల్లో పడింది. ఆకాష్ దీప్ బౌలింగ్‌లో హ్యారీ బ్రూక్‌ను అవుట్ చేసి అద్భుతంగా రాణించినప్పటికీ, బ్యాటింగ్‌లో అతను తనవంతు సహకారం అందించలేకపోయాడు. ఇక తొలి ఇన్నింగ్స్‌లో 74 పరుగులతో మెరిసిన రిషభ్ పంత్, జట్టును ఆదుకున్నప్పటికీ, కీలకమైన నాలుగో ఇన్నింగ్స్ ఛేజింగ్‌లో కేవలం 9 పరుగులే చేసి, పెవిలియన్ చేరాడు. పంత్ నుంచి మ్యాచ్ గెలిపించే ఇన్నింగ్స్ ఆశించారు. గబ్బాలో ఆస్ట్రేలియాపై విజయాన్ని అందించిన విధంగా ఇక్కడ కూడా పంత్ తనదైన శైలిలో దూకుడుగా ఆడితే విజయం సాధ్యమని భావించినా నిరాశే మిగిల్చాడు.





## మహిళల ప్రపంచ కప్..
# ఫైనల్స్‌కు హారిక, వైశాలి

**న్యూఢిల్లీ:** మహిళల ప్రపంచ కప్-2025లో భారత్‌కు చెందిన ద్రోణవల్లి హారిక మరియు ఆర్ వైశాలి కఠినమైన టైబ్రేక్‌ల ద్వారా పోరాడి 16వ రౌండ్‌కు చేరుకున్నారు, ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో స్వదేశీయులైన కోనేరు హంపి మరియు దివ్య దేశ్‌ముఖ్‌లతో చేరారు. అయితే, కాటెరినా లగ్నోతో జరిగిన హోరాహోరీ మ్యాచ్ తర్వాత వంటికా అగర్వాల్ ప్రచారం నిరాశాజనకంగా ముగిసింది. అమెరికాకు చెందిన కారిస్సా యిప్‌పై వైశాలి అద్భుతమైన స్థితిస్థాపకతను ప్రదర్శించింది. క్లాసికల్ గేమ్స్ మరియు ప్రారంభ రాపిడ్ టైబ్రేక్‌లు డ్రాగా ముగియడంతో, వైశాలి 10+10 రాపిడ్ గేమ్‌లను గెలుచుకుని 4-2 తేడాతో మొత్తం విజయాన్ని నమోదు చేసింది. ఆమె తదుపరి కజకిస్తాన్‌కుచెందిన మెరుర్ట్ కమలిడెనోవాతో తలపడనుంది, ఆమె డిఫెండింగ్ ఛాంపియన్ అలెగ్జాండ్రా గోరియాచ్కినాను ఓడించడంద్వారా భారీ ఓటమిని చవి చూసింది. వైశాలి విజయానికి హారిక అద్దం పట్టింది, గ్రీకు ప్రత్యర్థి స్టావ్రౌలా సోలాకిడౌను టైబ్రేకర్లలో 4-2 స్కోరుతో ఓడించింది. ఆమె తదుపరి సవాలు లాగ్నో, వంటికాను ఓడించి ముందుకు సాగింది. లాగ్నోతో జరిగిన తన తొలి క్లాసికల్‌గేమ్‌లో విజయంతో వంటిక ఆశలు రేకెత్తించింది, కానీ పట్టు విడుచుకోలేకపోయింది. రష్యన్ గ్రాండ్‌మాస్టర్ తిరిగి పుంజుకుని మ్యాచ్‌ను సమం చేసినా చివరికి 10+10 రాపిడ్ టైబ్రేకర్‌లో వంటికను ఓడించింది. ఇంతలో, దివ్య దేశ్‌ముఖ్ తన ప్రీక్వార్టర్ ఫైనల్ పోరులో చైనాకు చెందిన రెండవ సీడ్ జు జినర్‌తో తలపడనుండగా, కోనేరు హంపి స్విస్ గ్రాండ్ మాస్టర్ అలెగ్జాండ్రా కోస్టెనిక్‌తో తలపడనుంది.

## జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్..
## తొలి రౌండ్‌లో నిష్క్రమించిన
# రుతపర్ణ, శ్వేతపర్ణ



**న్యూఢిల్లీ:** జపాన్ ఓపెన్ సూపర్ 750లో ఒడిశాకు చెందిన పాండా సోదరీమణులు రుతపర్ణ మరియు శ్వేతపర్ణ మహిళల డబుల్స్ ఓపెనింగ్ రౌండ్‌లోనే ఓడిపోయారు. టోక్యోలో మంగళవారం జరిగిన భారత ద్వయం జపాన్‌కు చెందిన కొకోనా ఇషికావా, మైకో కవాజో చేతిలో 30 నిమిషాల వ్యవధిలో 13-21, 7-21 తేడాతో ఓడిపోయింది. టోర్నమెంట్ ప్రారంభ రోజున బరిలోకి దిగిన ఏకైక భారతీయులు శ్వేతపర్ణ మరియు రుతపర్ణ, జనవరిలో జరిగిన 2025 ఇండియా ఓపెన్ సూపర్ 750 తర్వాత వారి మొదటి మ్యాచ్‌లో జపాన్ ప్రత్యర్థులతో పోటీ పడలేకపోయారు. భారత షట్లర్లు బుధవారం ఎనిమిది మ్యాచ్‌లలో తలపడనున్నారు. ఇక పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ చైనాకు చెందిన వాంగ్ జడ్ఎక్స్‌తో తలపడనుండగా, నలుగురు మహిళా సింగిల్స్ క్రీడాకారిణులు పివి సింధు, ఉన్నతి హుడా, అనుపమ ఉపాధ్యాయ, రక్షిత రామ్‌రాజ్ బరిలోకి దిగుతారు. పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డి మరియు చిరాగ్ శెట్టి, మరియు హరిహరన్ అంసకరుణన్‌రూబన్ కుమార్‌కూడా మహిళల డబుల్స్‌లో కవి ప్రియ సెల్వం సిమ్రాన్ సింఘితో కలిసి తమ ప్రచారాన్ని ప్రారంభించనున్నారు.

# నేషనల్ రగ్బీ ఛాంపియన్‌గా బీహార్




**న్యూఢిల్లీ:** జూనియర్ నేషనల్ రగ్బీ ఛాంపియన్‌షిప్-2025లో ఉత్కంఠభరితమైన ఫైనల్‌లో డిఫెండింగ్ ఛాంపియన్స్ ఒడిశాను ఓడించి, బీహార్ అండర్ 18 బాలుర జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. ఇప్పటికే ఈ వారం ప్రారంభంలో బాలికల అండర్ 18 కిరీటాన్ని కూడా బీహార్ కైవసం చేసుకోవడం విశేషం. అత్యంత నిలకడగా ఆడిన రెండు జూనియర్ రగ్బీ జట్లు పాల్గొన్న ఈ ఫైనల్ పోటీకి సరైన క్లైమాక్స్. గోల్డాన్ కుమార్ ఒక ట్రై మరియు కన్వర్షన్‌తో బీహార్ తరపున గోల్ చేయడం ప్రారంభించాడు, కానీ ఒడిశా మంటుడు, సుబాష్ హన్స్‌దా, ఈశ్వర్ పూజారి చేసిన ప్రయత్నాల ద్వారా తిరిగి విజయం సాధించి తిరుగులేని ఆధిక్యాన్ని సంపాదించింది. బీహార్ తరపున సన్నీ కుమార్ ఒక గోల్ చేయడంతో గోల్డాన్ మరోసారి సత్తా చాటాడు.

చివరి క్షణాల్లో విజయ ప్రయత్నం చేసి 17-15 తేడాతో టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు.

కాగా ఈ ఏడాది ప్రారంభంలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ బాలుర ఫైనల్‌లో ఒడిశాను (14-12) ఓడించిన బీహార్, మరోసారి అత్యంత ముఖ్యమైన సమయంలో ఆధిక్యంలో ఉంది. గ్రూప్ దశలో చండీగఢ్ (49-0) మరియు హర్యానా (62-0) పై విజయాలు, పంజాబ్ పై 29-0 రౌండ్ ఆఫ్ 16, పశ్చిమ బెంగాల్ పై 39-0 క్వార్టర్ ఫైనల్, మరియు మహారాష్ట్రపై 10-5 సెమీఫైనల్ విజయాలతో వరుస గెలుపులు సాధించింది. ఫైనల్‌కు ముందు, ఉత్కంఠభరితమైన మూడవ స్థానం కోసం జరిగిన ప్లే ఆఫ్‌లో మహారాష్ట్ర ఢిల్లీని ఓడించి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. అథర్వ్ పాల్కర్ చేసిన ట్రై మరియు కన్వర్షన్ మహారాష్ట్రను ప్రారంభంలోనే నియంత్రణలోకి తెచ్చింది, కానీ జావేద్ ఖాన్ మరియు పుష్పెందర్ ఢిల్లీ తరపున ట్రై మరియు ట్రైకన్వర్షన్ కాంబోతో స్కోరును తిప్పికొట్టారు. ఇక రెండవ అర్ధభాగం చివరిలో మ్యాచ్ సమంగా ఉండటంతో, సౌరభ్ సంజయ్ రాజ్‌పుత్ ఒక ట్రై చేసి దానిని సమం చేశాడు, ఆ తర్వాత గోల్డెన్ ట్రైతో మ్యాచ్‌ను మరియు పోడియం స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఢిల్లీకి, 2024లో 7వ స్థానంలో నిలిచిన తర్వాత, జూనియర్ రగ్బీలో పురోగతితో నాల్గవ స్థానం చేరింది.

## కాంటినెంటల్ టూర్.. లాంగ్‌జంప్‌లో
# సోజన్‌కు కాంస్యం



**న్యూఢిల్లీ:** వరల్డ్ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్ కాంస్య (కేటగిరీ-సి) ఈవెంట్ అయిన లిగ్నానో మీటింగ్‌లో మహిళల లాంగ్ జంప్‌లో యాన్సీ సోజన్ మూడవ స్థానంలో నిలిచింది. ఇటలీలో జరిగిన ఈ పోటీలో ఆమె ఆరు జంప్‌లలో ఐదు 6.15 మీటర్ల మార్కును దాటాయి. నాల్గవ ప్రయత్నంలో 6.36 మీటర్ల జంప్ చేసి స్థిరత్వాన్ని ప్రదర్శించింది. ఆమె 6.26 మీటర్లు (మొదటి ప్రయత్నం), 6.35 మీటర్లు (రెండవ ప్రయత్నం), 6.19 మీటర్లు (మూడవ ప్రయత్నం), 6.36 మీటర్లు (నాల్గవ ప్రయత్నం), 6.18 మీటర్లు (ఐదవ ప్రయత్నం), మరియు 6.11 మీటర్లు (చివరి ప్రయత్నం) దూకింది. ఆస్ట్రేలియాకు చెందిన డెల్టా అమిడ్జోవ్సీ కేవలం రెండు చెల్లుబాటు అయ్యే ప్రయత్నాలను మాత్రమే నమోదు చేసినప్పటికీ 6.47 మీటర్లతో స్వర్ణం గెలుచుకుంది. అలాగే దక్షిణాఫ్రికాకు చెందిన డేనియల్ నోల్టే 6.44 మీటర్లతో రజతం గెలుచుకుంది. ఆమె అత్యుత్తమ ప్రదర్శన ఆమె సీజన్‌లో అత్యుత్తమ ప్రదర్శన అయిన 6.54 మీటర్ల కంటే చాలా తక్కువ, ఈ సంవత్సరం మే ప్రారంభంలో ఆమె నమోదుచేసింది. అయితే, 2025 యూరోపియన్ లెగ్‌లో స్పెయిన్‌లో ఆమె 6.21 మీటర్లు దూకినప్పటి నుండి యాన్సీ ఈ జంప్ గణనీయమైన మెరుగుదలను సూచిస్తుంది. గత ఏడాది సెప్టెంబర్‌లో బెంగళూరులోని శ్రీకంఠీరవ స్టేడియంలో ఆమె నమోదు చేసిన 6.71 మీటర్ల వ్యక్తిగత అత్యుత్తమ రికార్డుకూడాఉంది. దీంతో 2025 ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లకు అర్హత ర్యాంకింగ్స్‌లో, రోడ్ టు టోక్యో 25లో యాన్సీ ప్రస్తుతం చివరి స్థానంలో ఉంది.

# వాణిజ్యం

# ముంబైలో టెస్లా తొలి షోరూం

**ముంబై, జులై 15:** అమెరికాకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా భారత్ మార్కెట్లోకి ప్రవేశించింది. మహారాష్ట్ర రాజధాని ముంబయిలో తొలి షోరూంను మంగళవారం ప్రారంభించింది. బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోని మార్కర్ మ్యాక్సిటీ మాల్‌లో దానిని తెరిచింది. ఈ షోరూం ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ హాజరయ్యారు. ఈ సంస్థకు వెల్‌కమ్ చెప్పారు. భారత్‌లో ఈ ఎలక్ట్రిక్ కార్ల తయారీకి సంబంధించిన భవిష్యత్ ప్రణాళికలపై ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా మోడల్ వై కారును సంస్థ ఆవిష్కరించింది. తొలుత మోడల్ ఈవీలను టెస్లా భారత్ మార్కెట్లో విక్రయించనుంది. ఇక్కడ ఆర్‌డబ్ల్యూడీ వెర్షన్ (బేస్) మోడల్ వై ధర రూ.61.07 లక్షలుగా (ఆన్‌రోడ్) నిర్ణయించింది. లాంగ్‌రేంజ్ వెర్షన్‌ధర రూ.69.15 లక్షలుగా ఉంది. బేస్ మోడల్ ధర అమెరికాలో 44,990 డాలర్లు (రూ.38.63 లక్షలు), చైనాలో 2,63,500 యువాన్లు (రూ.31.57లక్షలు) జర్మనీలో 45,970 యూరోలు (రూ.46.09లక్షలు)గా ఉంది. దిగుమతి సుంకాలు, రవాణా ఖర్చుల కారణంగా భారత్‌లో దీని ధర ఎక్కువగా ఉంది. కొన్నిరోజుల క్రితం భారత రోడ్లపై మోడల్‌ను పరీక్షించిన సంగతి తెలిసిందే. ముంబయి-పుణె జాతీయ రహదారిపై ఈ వాహనం దర్శనమివ్వడం చూపరులను ఆకర్షించింది. ఇది పూర్తిగా అప్‌డేట్ అయిన మోడల్ కారుగా నిపుణులు గుర్తించారు. దీని కోడ్‌నేమ్ జునిపెర్. సాధారణ మోడల్ కంటే దీనిలో ఎక్కువ ఫీచర్లు ఉంటాయి. అమెరికా, కెనడా మార్కెట్లలో వీటిని విక్రయిస్తున్నారు. దీని సీ షేప్‌లోని ఎల్ఈడీ లైట్లు, ట్విన్ స్పోక్ అలాయ్ వీల్స్, టెస్లా ప్రత్యేకతను తెలిపే గ్లాస్ రూఫ్ ఉన్నాయి. ఇది భారత్‌లో ఆరు రంగుల్లో లభించవచ్చని భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా మోడల్ కారు ఆల్‌వీల్ డ్రైవ్‌గా లభిస్తోంది. వీటిల్లో లాంగ్ రేంజ్ బ్యాటరీ ప్రత్యేకత. ఒక్కసారి ఛార్జి చేస్తే 500600 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చు.



కేవలం 4.6 సెకన్లలో గంటకు 096 కిలోమీటర్ల వేగాన్ని అందుకొంటుంది. అత్యధికంగా గంటకు 200 కి.మీ. వేగంతో ప్రయాణించ గలదు. దీనిలో భారీ 15.4 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌ను అమర్చారు. వెనక సీట్లలోని ప్యాసింజర్ల కోసం 8 అంగుళాల ప్రత్యేకమైన స్క్రీన్ కూడా ఉంటుంది. అడాస్ ఫీచర్లు, వైర్‌లెస్ ఫోన్ ఛార్జింగ్ వంటి హంగులు ఇందులో కస్టమర్లకు లభించనున్నాయి. షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం దేవేంద్ర ఫడణవీస్ మాట్లాడుతూ, టెస్లా సరైన రాష్ట్రం, నగరాన్ని ఎంచుకుంది. ఈ కంపెనీ కార్ల డిజైన్, ఇన్నోవేషన్‌పై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి ఉంటుంది. 2015లో అమెరికా పర్యటనకు వెళ్లినప్పుడు తొలిసారి టెస్లా కారులో తిరిగాను అని ఫడణవీస్ మాట్లాడారు.

# నష్టాలకు బ్రేక్..లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, జులై 15:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో పాటు దేశీయంగా రిటైల్ ద్రవ్యోల్బణం ఆరేళ్ల కనిష్ఠానికి చేరడం వంటి కారణాలు పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమయ్యాయి. దీంతో నాలుగు రోజుల వరుస నష్టాలకు బ్రేక్‌పడింది. అన్ని రంగాల షేర్లలో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. ఆటో ఇండెక్స్ ఒకటిన్నర శాతం మేర లాభపడగా, ఫార్మా, హెల్త్ కేర్ సూచీలు ఒక శాతం మేర పెరిగాయి. సెన్సెక్స్ ఉదయం 82,233.16 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,253.46) స్వల్ప నష్టాల్లో ప్రారంభమయ్యాయి. కాసేపటి తర్వాత మళ్లీ లాభాల బాట పట్టిన సూచీ.. ఇంట్రాడేలో 82,743.62 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 317.45 పాయింట్ల లాభంతో 82,570.91 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 113.50 పాయింట్ల లాభంతో 25,195.80 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.82గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో సన్‌ఫార్మా, బజాజ్ ఫిన్‌సర్వ్, టాటా మోటార్స్, ట్రెంట్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు రాణించాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎటర్నల్, టాటా స్టీల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 68.99 డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 3,374 డాలర్ల వద్ద కొనసాగింది.



# టిసిఎస్‌లో వేరియబుల్ పే..

**ముంబై, జులై 15:** ప్రముఖ ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి గానూ ఉద్యోగులకు వేరియబుల్ పే అలవెన్స్‌ను ప్రకటించింది. మొత్తం ఉద్యోగుల్లో 70 శాతం మందికి నూరు శాతం చెల్లింపులు చేయనున్నట్లు పేర్కొంది. తమ వ్యాపార విభాగాల పనితీరు ఆధారంగా మిగిలిన ఉద్యోగులకు చెల్లింపులు ఉంటాయని తెలిపింది. ఇలా ఎక్కువ మందికి పూర్తి వేరియబుల్ పే చెల్లింపులు చేయడం ఇది వరుసగా రెండోసారి అని సంస్థ తెలిపింది. క్వార్టర్లీ వేరియబుల్ పే ప్లాన్ ప్రకారం సీ2 గ్రేడ్ వరకు ఉన్న అందరు ఉద్యోగులకు నూరు శాతం వేరియబుల్ పే అందుకుంటారు. సీ3 గ్రేడ్, ఆపై ఉన్న వారికి వారి విభాగాల పనితీరు ఆధారంగా చెల్లింపులు ఉంటాయి అని టీసీఎస్ చీఫ్ హెచ్ఆర్ ఆఫీసర్ మిలింద్ లక్కడ్ ఉద్యోగులకు పంపిన ఇ-మెయిల్‌లో పేర్కొన్నారు. టీసీఎస్‌లో ఉద్యోగుల్లో వివిధ గ్రేడ్‌లు విభజన ఉంటుంది. వై లెవెల్ అనేది ట్రైనీలతో ప్రారంభమవుతుంది. తర్వాత సిస్టమ్ ఇంజనీర్లు(సి1) ఉంటారు. ఆ తరువాత సి2, సి3, సి4, సి5 ఇలా గ్రేడ్‌ల వారీ విభజన ఉంటుంది. సాధారణంగా సి3, అంతకంటే ఎక్కువ బ్యాండ్‌ల్లోని సిబ్బందిలో సీనియర్ మేనేజర్లు, వ్యాపార యూనిట్ హెడ్స్‌గా ఉంటారు.




# భారత్ మార్కెట్‌కు వియత్నాం కార్లు

**ముంబై, జులై 15:** దేశీయ కార్ల మార్కెట్‌లోకి విదేశీ కార్ల కంపెనీలు క్యూ కడుతున్నాయి. ఎన్నోఏళ్ల ఎదురుచూపుల తర్వాత అమెరికాకు చెందిన టెస్లాదేశంలోకి మంగళవారం ఎంట్రీ ఇచ్చింది. ముంబయిలో తొలి కార్ల షోరూమ్‌ను ప్రారంభించింది. అదేరోజున మరో విదేశీ కంపెనీ తన ప్రణాళికలను ప్రారంభించింది. వియత్నాంకు చెందిన విన్‌ఫాస్ట్ సంస్థ తన వీఎఫ్6, వీఎఫ్7 మోడళ్ల ప్రీ బుకింగ్‌ను వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తెచ్చింది. ఆగస్టులో వీటిని లాంచ్ చేయబోతోంది. దేశంలోకి ఎంట్రీ ఇచ్చిన రోజే.. మరో విదేశీ కంపెనీ నుంచి టెస్లా ఎదుర్కోవడం గమనార్హం. ముంబయిలో తొలి షోరూమ్‌ను ప్రారం భించిన టెస్లా.. దేశీయంగా తొలుత మోడల్ ఈవీలను విక్రయించనుంది. ఇందులో బేస్ మోడల్ ధర రూ.60 లక్షల నుంచి ప్రారంభం అవుతుంది. లాంగ్ రేంజ్ మోడల్‌ధర రూ.68 లక్షలుగా నిర్ణయించింది. స్టాండర్డ్ వేరియంట్ 60కెడబ్ల్యూహెచ్ బ్యాటరీ కలిగిన కారు సింగిల్ ఛార్జింగ్‌తో 500 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. 75 కెడబ్ల్యూహెచ్ బ్యాటరీ కలిగిన లాంగ్ రేంజ్ వేరియంట్ 622 కిలోమీటర్లు వెళుతుంది. ఈ ఏడాది మూడో



త్రైమాసికం నుంచి డెలివరీలు ప్రారంభం కానున్నాయి. రూ.22 వేలు చెల్లించి రిజర్వేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ మొత్తం నాన్‌రిఫండబుల్. వియత్నాంకు చెందిన విన్‌ఫాస్ట్ ఆగస్టులో వీఎఫ్6, వీఎఫ్7 మోడళ్లను లాంచ్ చేయనుంది. రూ.21 వేలు చెల్లించి కంపెనీ వెబ్‌సైట్‌లో ప్రీ బుకింగ్ చేసుకోవచ్చు. ఈ మొత్తం రిఫండబుల్. టెస్లా తన కార్లను దిగుమతి చేసుకుంటుండగా.. విన్‌ఫాస్ట్ మాత్రం తమిళనాడులో 2 బిలియన్ డాలర్లు వెచ్చించి తయారీ ప్లాంట్‌ను నెలకొల్పుతోంది.

# 3.51 బిలియన్ డాలర్లకు తగ్గిన వాణిజ్యలోటు

**న్యూఢిల్లీ, జూలై 15:** భారత వాణిజ్యలోటు గణనీయంగా తగ్గింది. 3.51 బిలియన్ డాలర్లకు చేరింది. అదే గత ఏడాది జూన్‌నెలలో 7.30 బిలియన్ డాలర్లు ఉన్న వాణిజ్యలోటు ఏటికేడాది చొప్పున చూస్తే గణనీయంగా తగ్గినట్లు తెలుస్తోంది. ఎగుమతులు భారీగా నమోదు చేయడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. వాణిజ్య ఎగుమతులు జూన్‌నెలలో 67.98 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఇదే గత ఏడాది-జూన్‌లో 63.83 బిలియన్ డాలర్లు నమోదయ్యాయి. దీన్ని బట్టి చూస్తే భారత్‌లో దిగుమతులపరంగాచూస్తే డిమాండ్ భారీగా ఉన్నట్లే తెలుస్తోంది. వాణిజ్య లోటు తగ్గడం అనేది భారత కరెంటు ఖాతా మెరుగుపడేందుకు సానుకూల సంకేతంగా నిలుస్తోంది. దేశ వాణిజ్యలోటు మేనెలలో కూడా గణనీయంగా తగ్గింది. గత ఏడాద ఇమేనెలలో నమోదయిన 9.35 బిలియన్ డాలర్లతో పోలిస్తే ఈ ఏడాది జూన్‌నెలలో 6.62 బిలియన్ డాలర్లుగా నమోదయింది. మేనెలలో కూడా వాణిజ్య ఎగుమతులు 71.12 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. వార్షిక పద్ధతిలో చూస్తే 2.77శాతం పెరిగాయి. మొత్తం ఎగుమతులు గత ఏడాది ఇదేనెలలో 69.20 బిలియన్ డాలర్లుగా నమోదయింది. ఇతర కార్యాచరణ చర్యలపరంగాచూస్తే కేంద్ర ప్రభుత్వం కీలకంగా ఉన్న 14 రంగాలకు ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలను ప్రకటించడంతో కొంతమేర ఎగుమతులకు ఊతం లభించింది. ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, టెలికాం, ఈవీ బ్యాటరీల రంగానికి ఈ పిఎల్ఐ స్కీం అన్వయింప చేసారు. 2025-26 సంవత్సరంలో ప్రభుత్వం లక్ష కోట్ల డాలర్ల విలు వైన ఎగుమతులు చేయాలనన లక్ష్యంతో ఉంది. స్వేఛ్ఛా వాణిజ్య ఒప్పందాలు వివిధ దేశాలతో చేసుకోవడం వల్ల ఎగుమతులు గణనీయంగా పెరిగాయి. ఇటీవలే బ్రిటన్, యుఎఇలతో స్వేఛ్ఛా వాణిజ్య ఒప్పందాలు జరిగాయి. వాణిజ్యశాఖ కార్యదర్శి సునీల్ బర్త్‌వాల్ మాట్లాడుతూ పరిశ్రమల సదస్సులోనే ఎఫ్‌టిఎల ప్రాధాన్యతలను వివరించామని, భారత్ యుకె స్వేఛ్ఛా వాణిజ్య ఒప్పందం ఇందుకు నిదర్శనమని వెల్లడించారు.



# హీరో మోటోకార్ప్ విదేశీ విస్తరణ

**న్యూఢిల్లీ, జులై 15:** ద్విచక్ర వాహనాల తయారీ దిగ్గజం హీరో మోటోకార్ప్ అంతర్జాతీయంగా కార్యకలాపాలను మరింతగా విస్తరించడంపై దృష్టిపెడుతోంది. ఇందులో భాగంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంద్వితీయార్థంలో జర్మనీ, ఫ్రాన్స్, స్పెయిన్, బ్రిటన్ మార్కెట్లలోకి అడుగు పెట్టే ప్రణాళికల్లో ఉంది. 2024-25 వార్షిక నివేదికలో షేర్ హోల్డర్లను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో కంపెనీ చైర్మన్ పవన్ ముంజాల్ ఈ విషయాలు తెలిపారు. హీరో ఫర్ స్టార్టప్స్ తదితర సొంత వేదికల ద్వారా కొత్త తరం ఎంట్రప్రెన్యూర్లను ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. కొత్త ఉత్పత్తులు, సేవలపై పరిశోధనలు సాగించేందుకు, వాటిని అభివృద్ధి చేసేందుకు అవసరమైన తోడ్పాటు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. దక్షిణాసియా నుంచి లాటిన్ అమెరికా వరకు అంతర్జాతీయ మార్కెట్లలో 2024-25లో 43శాతం వార్షిక వృద్ధి సాధించినట్లు ముంజాల్ వివరించారు. రిటైల్‌లో వ్యూహాత్మక విస్తరణతో ఎలక్ట్రిక్ స్కూటర్ విడా అమ్మకాలు 200 శాతం పెరిగాయని చెప్పారు. ఇక లిస్టెడ్ కంపెనీ ఏథర్ ఎనర్జీతో భాగస్వామ్యం కట్టడమనేది దేశీయంగా 'ఇవి' ఛార్జింగ్ నెట్‌వర్క్‌ను, ప్రీమియం ఎలక్ట్రిక్ వాహనాల సెగ్మెంట్‌లో స్థానాన్ని పటిష్టం చేసుకునేందుకు దోహదపడినట్లు పేర్కొన్నారు. అటు అమెరికన్ సంస్థ జీరో మోటార్ సైకిల్స్ భాగస్వామ్యం ద్వారా సరికొత్త ప్రీమియం మోటార్ సైకిల్ వస్తోందని చెప్పారు. యూలర్ మోటార్స్‌లో రూ.510 కోట్ల పెట్టుబడి పెట్టడమనేది అంతర్జాతీయంగా ఎలక్ట్రిక్ త్రీ-వీలర్ సెగ్మెంట్‌లో తమ కార్యకలాపాల విస్తరణకు దోహదపడుతుందని పేర్కొన్నారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.